
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంగళవారం 31-10-2023
సంపుటి : 9 సంచిక : 300
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

ఆ హక్కు ప్రజలకు లేదు

ఎన్నికల బాండ్ల సమాచారం పబ్లిక్ డొమైన్‌లో ఉండదు

- ఆర్టీఐ ద్వారా తెలుసుకునే అవకాశమూ లేదు వివరాలు 9లో..
- ఈ పథకంలో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదు : సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి



కులగణన చేపట్టాలి

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

- విద్యుత్ స్మార్ట్ మీటర్లు ప్రజలకు భారం
- ప్రజలపై ఆర్థిక భారాలను ధ్వజమెత్తుతాం
- దేశవ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ కార్యక్రమాలు
- తెలంగాణలో పోటీ చేసే స్థానాలపై చర్చ కొనసాగుతోంది : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

రాజస్థాన్‌లో 17, మధ్యప్రదేశ్‌లో 4, ఛత్తీస్‌గఢ్‌లో 3 స్థానాల్లో పోటీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

స్వతంత్ర దేశం కోసం పాలస్తీనా ప్రజలు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా కార్యక్రమాలు చేపట్టాలని, ఇజ్రాయెల్ ఆక్రమణ, మారణహెూమానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ అన్ని పార్టీలకు పిలుపునిచ్చింది. గాజాలో కాల్పుల విరమణ, పౌరులకు మాన వతా సహాయం అందించాలన్న ఐక్యరాజ్యసమితి తీర్మానంపై ఓటింగ్‌కు దూరంగా ఉన్న మోడీ ప్రభుత్వ చర్యను కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. సోమవారం నాడిక్కడ సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం (ఏకేజీ భవన్)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మూడు రోజుల పాటు జరిగిన కేంద్ర కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను సీతారాం ఏచూరి వివరించారు.మోడీ ప్రభుత్వ వైఖరి పాలస్తీనియన్లకు మద్దతు ఇచ్చే భారతదేశ చరిత్ర, సంప్రదాయానికి విరుద్ధంగా ఉంది. ఐక్యరాజ్యసమితి తీర్మానంలోని డిమాండ్లను వెంటనే అమలు చేయాలి. ఇజ్రాయెల్ అన్ని అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ మారణహెూమ



యుద్ధం చేస్తోంది. తక్షణ కాల్పుల విరమణను డిమాండ్ చేస్తూ అంతర్జాతీయ నిరసనలో సీపీఎం భాగస్వా మ్యమైంది. 1967కి పూర్వపు సరిహద్దులతో పాటు తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా దేశంగా యుఎన్ భద్రతా మండలి ఆదేశించిన ద్విజాతీయ పరిష్కారాన్ని వెంటనే అమలు చేయాలి" అని తెలిపారు.జాతీయ స్థాయిలో కుల గణన నిర్వహించాలి.

"నవంబర్ 26 నుంచి 28 వరకు జరగనున్న దేశవ్యాప్త కార్మిక, కర్షక మహాపడావ్‌కు ...3లో


ప్రజలపై ఆర్థిక భారాలు

"ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలపై మోడీ ప్రచార యంత్రాంగం సృష్టించిన తప్పుడు వాదనలను తిప్పికొట్టాలి. నియంత్రించలేని ధరల పెరుగుదల, నిరుద్యోగం వల్ల గృహ ఆర్థిక ఆస్తులతో ప్రజల ఆదాయంలో 2020-21 నుంచి 2022-23 మధ్య జీడీపీలో 11.5 శాతం నుండి 5.1 శాతానికి క్షీణించాయి. ఇది గృహ రుణభారంలో తీవ్ర పెరుగుదలకు దారితీస్తుంది. ఉల్లి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గ్రామీణ బాధలు, ప్రపంచ ఆకలి సూచికలో భారతదేశం స్థానం 125 దేశాలలో 111 వద్ద చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయింది" అని వివరించారు.

మా సహనం నశిస్తే దుమ్ము దుమ్మే

ప్రజాతీర్పును ఎదుర్కోలేకే భౌతిక దాడులు

- ఆగం కాకుండా విచక్షణతో ఓటు వేయాలి
- కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి
- మేము 24 గంటలు ఇస్తూ...మీ 5 గంటల కరెంటు చూడటానికి కర్నాటకకు రావాల్నా : సీఎం కేసీఆర్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి/జుక్కల్/బాన్సువాడ (నసురుల్లాబాద్)

ఎన్నికల్లో గెలవలేక భౌతిక దాడులకు దిగుతున్నారని, దాడులకు పాల్పడే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజా తీర్పును ఎదుర్కోలేక భౌతిక దాడులు, హత్యా రాజకీయాలకు తెగబడటం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో ఇటువంటి సంఘ విద్రోహుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ నాయకులపై, కార్యకర్తలపై ఎవరు దాడులకు పాల్పడ్డా సహించేది లేదని హెచ్చరించారు. సోమవారం నారాయణఖేడ్, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు.

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగిన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రజలు ఓట్లప్పుడు ఆగమాగం కావద్దన్నారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పే కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదన్నారు. మన పక్కనే ఉన్న కర్నాటక రాష్ట్ర డిప్యూటీ సీఎం శివకుమార్ తెలంగాణలో తిరుగుతూ ఆ రాష్ట్రంలో రోజుకు ఐదు గంటల కరెంటు ...9లో

భారత్‌లో అతిపెద్ద డేటా లీక్?

అమ్మకానికి 81.5 కోట్ల మంది భారతీయుల సమాచారం



- ప్రమాదంలో ఐసీఎంఆర్ కోవిడ్ పరీక్ష డేటా
- డార్క్‌వెబ్‌లో పౌరుల డేటాబేస్ ప్రచారం

న్యూఢిల్లీ : భారత్‌లో పౌరుల సమాచారానికి భద్రత కరువైంది. ఐసీఎంఆర్ కోవిడ్ పరీక్షల సమాచారం ప్రమాదంలో ఉన్నది. దాదాపు 81 కోట్ల మందికి పైగా భారతీయుల సమాచారం అమ్మకానికి ఉన్నట్టుగా తెలుస్తున్నది. కోవిడ్ సమయంలో పౌరుల దగ్గర నుంచి సేకరించిన వారి పేర్లు, ఫోన్‌నెంబర్లు, చిరునామా వంటివి ఇందులో ఉన్నట్టు సమాచారం. అయితే, ఐసీఎంఆర్ ఫిర్యాదు అనంతరం సీబీఐ ఈ విషయాన్ని విచారించే అవకాశం కనిపిస్తున్నది. దీంతో కోవిడ్-19 డేటా లీక్ అంశం ఇప్పుడు సర్వత్రా ఆందోళనను కలిగిస్తున్నది. కోవిడ్‌ను ధైర్యంగా ఎదుర్కొన్నామని చెప్తున్న ...9లో

గాజాపై దాడులు అమానవీయం

ఐరాసలో ఓటింగ్‌కు భారత్ గైర్హాజరుని ఖండించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి (ఐరాస) జనరల్ అసెంబ్లీ తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు కావడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ప్రపంచంలో హింసకు స్థానం లేదని కాంగ్రెస్ మాజీ చీఫ్ సోనియాగాంధీ జాతీయ మీడియాతో పేర్కొన్నారు. హమాస్ దాడులను తమ పార్టీ ఖండిస్తున్నట్టు మరుసటి రోజే ప్రకటన విడుదల చేశామని అన్నారు. హమాస్ దాడులకు ప్రతిగా విషాదం చోటుచేసుకుందని,



ఇజ్రాయిల్ గాజాపై చేపడుతున్న ప్రతీకార దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా వేలాది మంది పౌరులు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా రాష్ట్ర సార్వభౌమ, స్వతంత్ర, భద్రత కోసం ఇజ్రాయిల్‌తో శాంతి చర్చలు జరపాలని తమ పార్టీ దీర్ఘకాలంగా కోరుకుంటోందని అన్నారు. ఇజ్రాయిల్ జరుపుతున్న అమానవీయ దాడులను మనమందరం సమిష్టిగా ...9లో

ఉమ్మడి పోరాటాలకు సిద్ధంకండి

ఆశాలను రెగ్యులరైజ్ చేయాలి

- మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా ఇంటింటి ప్రచారం
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి...సామాజిక భద్రత కల్పించాలి : ఆశా సంఘర్ష్ ర్యాలీలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్
- హస్తినలో కదం తొక్కిన ఆశాలు

వివరాలు 3లో..



కొత్త ప్రభాకర్‌రెడ్డికి కత్తిపోట్లు

సెల్ఫీ దిగేందుకు వచ్చి ఒక్కసారిగా దాడి




- తీవ్రంగా రక్తస్రావం.. గజ్వేల్ ఆస్పత్రికి తరలింపు
- హైదరాబాద్ యశోదలో ఆపరేషన్
- ఈ దాడి ఆయన పై కాదు, నాపై : కేసీఆర్
- ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదుర్కోవాలి : హరీశ్‌రావు
- ఆస్పత్రిలో సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పరామర్శ

నవ తెలంగాణ - దౌల్తాబాద్/బేగంపేట

దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి జరిగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో ఓ పాస్టర్ కుటుంబాన్ని పరామర్శించి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. సోమవారం దుబ్బాక నియోజకవర్గంలోని గాజులపల్లి, దొమ్మాట, ముత్యంపేట, సూరంపల్లి గ్రామాల్లో ప్రభాకర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూరంపల్లి గ్రామంలో పాస్టర్ కుటుంబాన్ని పరామర్శించి లింగరాజుపల్లి ...9లో

దాడిని ఖండిస్తున్నాం



ప్రభాకర్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాం. కాంగ్రెస్ ఎప్పుడూ హింసను నమ్మబోదు. దాడిచేసిన వ్యక్తి ఎవరైనా కఠినంగా శిక్షించాలి. కత్తి దాడి ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు తెలపాలి.

-పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

బీజేపీతో బంధం వినాశకరం

ఆ పార్టీ విషకౌగిలి నుంచి బయటపడాలి

- వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు సీపీఐ(ఎం) సూచన
- ఏపీలోని సీతంపేట, ఆదోనీల్లో ప్రజారక్షణ భేరీ ప్రారంభం



విజయనగరం : బీజేపీతో బంధం వినాశనకరమని, ఆ పార్టీ విషకౌగిలి నుంచి వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు బయటకు రావాలని సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరిలో భాగంగా ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, కర్నూలు జిల్లా ఆదోనిలో సోమవారం బస్సు యాత్రలు ప్రారంభమయ్యాయి. సీతంపేటలో ప్రచార భేరిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి ఈ యాత్ర పాలకొండ, కురుపాం మీదుగా పార్వతీపురం వరకూ సాగింది. కర్నూలు జిల్లా ఆదోనిలో ప్రారంభమైన యాత్ర కర్నూలు వరకూ సాగింది. ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, గిరిజనులు ఘన స్వాగతం పలికారు.

గిరిజన చట్టాలను కాలరాస్తున్న బీజేపీ

వత్తాసు పలుకుతున్న వైసీపీ, టీడీపీ : బివి రాఘవులు

గిరిజన చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఆ ప్రభుత్వానికి రాష్ట్రంలోనే వైసీపీ, టీడీపీ వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఈ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా రావాడ రోడ్డు జంక్షన్, పార్వతీపురంలలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గిరిజనులు పోరాడి సాధించుకున్న చట్టాలను సవరించి వారిని దోపిడీ చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే అటవీ హక్కుల చట్టాన్ని సరిగ్గా అమలు చేయడం లేదన్నారు. చట్ట ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికీ గరిష్ఠంగా పది ఎకరాలు వరకు భూమి ఇవ్వాల్సి ఉన్నప్పటికీ తూతూమంత్రంగా పంపిణీ జరిగిందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో కొండ కోనలను ధ్వంసం చేసి అందులో నిక్షిప్తమైన గనులను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. ఇందుకోసం పీసా చట్టానికి విఘాతం ...9లో

కలిసి పని చేస్తాం...

ఫలించిన రేవంత్, కోదండరామ్‌ల చర్చలు

- పరిపాలనలో భాగస్వామ్యం కల్పిస్తామన్న కాంగ్రెస్



వివరాలు 6లో..

సిగ్నల్ వ్యవస్థ సరిగాలేకనే...

విజయనగరం రైలుప్రమాద ఘటన

- 13 మంది దుర్మరణం... ముమ్మరంగా సహాయక చర్యలు
- రైల్వే ట్రాక్ పునరుద్ధరణ 6లో..



సారూ...జర ఇటు చూడు

గాంధీ మార్చురీలో భరించరాని వాసన

పాడైన సగం కోల్డ్ స్టోరేజీ బాక్సులు

రాష్ట్రంలో ఒకవైపు రాజకీయ వేడి పెరిగిపోయింది. పార్టీలు, రాజకీయ నాయకులు పోటాపోటీగా ప్రచారంలో మునిగి తేలుతున్నారు. మరోవైపు సమస్యలు పేరుకుపోతున్నా ...పట్టించుకునే నాథుడు లేడని బాధితులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలోని పెద్ద ప్రభుత్వాస్పత్రుల్లో ఒకటైన హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో గత నెల రోజులకు పైగా మార్చురీలో నెలకొన్న ఇబ్బంది పరిష్కారానికి నోచుకోవడం లేదు. మార్చురీలో పోస్ట్ మార్టం చేసేందుకు శవాలను భద్రపరిచేందుకు 60 కోల్డ్ స్టోరేజ్ బాక్సులుండగా, అందులో దాదాపు సగం బాక్సులు పాడైపోయాయి. నెల రోజుల క్రితమే ఈ విషయం ఆస్పత్రి సూపరింటెండెంట్ దృష్టికి అక్కడ పని చేసే వైద్యులు, సిబ్బంది తీసుకెళ్లినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. పాడైపోయిన బాక్సుల్లో ఉంచిన శవాల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామని సిబ్బంది వాపోతున్నారు.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాంధీ మార్చురీకి వచ్చే శవాల్లో గుర్తించిన శవాలతో పాటు గుర్తించని శవాలు (అన్‌నోన్ బాడీస్) ఉంటాయి. ఆస్పత్రిలో మరణించిన వారితో పాటు ఆస్పత్రి పరిధిలోకి వచ్చే పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగే ప్రమాదాల్లో మరణాలు, వారిని తరలించిన తర్వాత జరిగే మరణాలతో పాటు మెడికో లీగల్ కేసులకు సంబంధించిన శవాలు కూడా మార్చురీకి తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో గుర్తించిన వాటిని కాకుండా గుర్తింపుకు నోచుకోని శవాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)కి చెందిన సిబ్బంది దాదాపు ప్రతి 10 రోజులకు ఒకసారి తీసుకెళ్లి సామూహిక అంత్యక్రియలు చేస్తుంటారు. దీంతో ప్రతిసారి 50 నుంచి వంద శవాలను తరలించాల్సి వస్తున్నట్టు తెలుస్తున్నది. అప్పటి వరకు ఇలాంటి భౌతికదేహాలను ఎక్కువగా పెర్ఫ్యూమ్ గదిలో ఉంచుతుంటారు. ప్రతి రోజు సుమారు 15 నుంచి 20 మందికి పోస్ట్ మార్టం చేస్తుండగా, ఈ విభాగంలో 25 నుంచి 30 మంది వరకు డాక్టర్లు (ప్రొఫెసర్లు, పీజీలు కలిసి) పని చేస్తున్నారు. వీరితో పాటు నాలుగో తరగతి సిబ్బంది సహాయకారులుగా ఉన్నారు. గాంధీ ఆస్పత్రి పరిధి కూడా విస్తతంగా ఉండటంతో ప్రతి రోజు శవాల రాకతో ఉన్న 60 బాక్సుల ఆక్యుపెన్సీ ఎప్పుడు వందశాతంగా ఉంటున్నది. అయితే ప్రతి రోజు 15 నుంచి 20 ...9లో

అనేక ఉద్యమాల్లో విష్ణు పోరాడారు

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



- మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌ను పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి
- సుముఖత వ్యక్తం చేసిన విష్ణు

నవతెలంగాణ-ముషీరాబాద్

పీజేఆర్ అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే పీజేఆర్.. అనే విధానంగా ఉండేదని, అలాంటి నాయకుని కుమారుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణు అనేక ఉద్యమాల్లో తమతో కలిసి పోరాడారని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరేందుకు విష్ణు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డిని దోమలగూడలోని ఆయన నివాసంలో సోమవారం మంత్రి కలిసి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడుతూ .. విష్ణువర్ధన్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని చెప్పారు. అయితే ఆయనకు తమ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పట్టపగలు డబ్బు కట్టలతో దొరకిన వ్యక్తి సీట్లు అమ్ముకున్న వ్యక్తి రేవంత్ రెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం నాశనం అవుతుందని, ఈ రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉంటే బాగుంటుందనేది జనాలు గుర్తించాలన్నారు. తెలంగాణ వాదులకు తెలంగాణ ద్రోహులకు మధ్య జరుగుతున్న పోటీ అని, ప్రజలిది గమనించాలన్నారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. తన నాన్న మెడలో కాంగ్రెస్ జెండా ఉంటే ఇది మా రక్తం అని అనుకునే వాళ్ళమని, కానీ ఈ రోజు ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదన్నారు. పార్టీ కోసం అలుపెరుగని సేవ చేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేసిన తమకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో డబ్బు రాజకీయం చలామణి అవుతున్నదని, అందు వల్లనే బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించు కున్నట్టు తెలిపారు. గాంధీ భవన్ అమ్ముడుపోతోందని, నాయకులు నయ వంచనకు పాల్పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చలు జరిపానని త్వరలో బీఆర్ఎస్‌లో చేరతానని స్పష్టం చేశారు.

సీపీఎస్ రద్దుకు నవంబర్ 3న చలో ఢిల్లీ

- పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
- ఎస్టీఎఫ్ఐ, సీసీజీఈడబ్ల్యూ, ఏఐఎస్‌జీఈఎఫ్, ఏఐఎస్‌జీపీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)న్ని రద్దు చేయాలని కోరుతూ వచ్చేనెల మూడున చలో ఢిల్లీ (మార్చ్ టు పార్లమెంట్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ), కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ (సీసీజీఈడబ్ల్యూ), ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీఈఎఫ్), ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీపీఎఫ్) ప్రకటించాయి.

జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి. పీఎఫ్ఆర్డీఏను రద్దు చేయాలనీ, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలనీ, దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనీ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలనీ, వారిని రెగ్యులరైజ్ చేయాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశాయి. వచ్చేనెల మూడున ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించే ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి వేలాదిమంది ఉపాధ్యాయులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొంటారు. తెలంగాణ నుంచి ఎస్టీఎఫ్ఐ అనుబంధ సంఘం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో వందలాది మంది ఉపాధ్యాయులు పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొనటానికి ఇప్పటికే ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై అన్ని రాజకీయ పార్టీలూ వాటి వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోల్లో చేర్చాలని కోరారు.

రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌లో పడిగ తేజస్‌కు సిల్వర్

శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండాప్రకాశ్ అభినందన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చైనాలోని బీజింగ్‌లో జరిగిన 19వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో 16ఏండ్ల వయస్సులోనే పడిగ తేజస్ ముదిరాజ్ సత్తా చాటడం గొప్ప విషయమని శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండాప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పడిగ తేజస్ ముదిరాజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరుపున అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలను సాధించాలని ఆకాంక్షించారు. యువత క్రీడల్లో ముందుండాలని సూచించారు. ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు జరిగిన పోటీలలో హైదరాబాద్‌కి చెందిన పడిగ తేజస్ ముదిరాజ్ సిల్వర్ మెడల్ సాధించి తన సత్తా చాటాడని తెలిపారు. ఆయన ఇప్పటికే జిల్లా స్థాయిలో, రాష్ట్రస్థాయిలో పలు పతకాలు సాధించాడని పేర్కొన్నారు. 79 బంగారు పతకాలు, 33 వెండి పతకాలు సాధించాడని తెలిపారు.

టీఎస్పీఎస్సీతో సంబంధమే లేదన్నావ్..ప్రక్షాళన ఎట్ల చేస్తవ్?

సాకులతో ఉద్యోగ నియామకాల జాప్యం : కేంద్ర మంత్రి జీకేఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'టీఎస్పీఎస్సీతో తమ ప్రభుత్వానికి సంబంధమే లేదన్నావ్..ఇప్పుడేమో అధికారంలోకి వస్తే ప్రక్షాళన చేస్తానంటున్నావ్..ఎట్ల చేస్తావ్ కేటీఆర్?' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా కాలయాపన చేసి నిరుద్యోగులతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడుకుంటున్నదని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీఎస్పీఎస్సీ కుంభకోణంపై కేటీఆర్ వ్యాఖ్యలు దొంగలు పడ్డ ఆరు నెలలకు ఫైర్ చేసినట్టుగా ఉందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ రెండు స్థానాల్లోనూ ఓడిపోవడం ఖాయమన్నారు. పరీక్షల నిర్వహణలో టీఎస్పీఎస్సీ నిర్లక్ష్యం ఫలితంగా 30 లక్షల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆయన కుటుంబంలో అందరికీ ఉద్యోగాలున్నాయి కాబట్టి కేసీఆర్‌కు నిరుద్యోగ కుటుంబాల బాధ అర్థం కావట్లేదన్నారు. ప్రవళిక ఆత్మహత్య విషయంలో తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేలా వారు ఆడిన డ్రామా అందరికీ తెలుసన్నారు. కేసీఆర్ అసమర్థత వల్ల 17సార్లు పరీక్షలు వాయిదా పడ్డాయని విమర్శించారు. ఉద్యోగాల ఖాళీలపై బిస్వాస్ కమిటీ ఇచ్చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం దాచిందని ఆరోపించారు. ఒకే టీచర్‌తో 6,800 పాఠశాలలు నడుస్తున్నాయనీ, 24వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. యూనివర్సిటీల్లో 2వేలకు పైగా పోస్టులు ఖాళీలున్నాయన్నారు. రూ. 4 వేల కోట్లకు పైగా రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించాల్సి ఉందని వివరించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. పేపర్లు లీకు కాకుండా కేంద్రం మాదిరిగా ఉద్యోగ నియామకాలు చేపడతామని చెప్పారు. ఢిల్లీలో బుధవారం సెంట్రల్ ఎలక్షన్ కమిటీ మీటింగ్ ఉంటుందనీ, అందులో మూడో లిస్టుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

బీసీ ద్రోహి బీజేపీ

-వీహెచ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీలను అన్ని రకాలుగా దగా చేసిన పార్టీ బీజేపీ అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంత రావు విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయ కుండా, బీసీ క్రిమిలేయర్ ఎత్తేయ కుండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న బీసీ వర్గానికి చెందిన బండిని తొలగించి కిషన్‌రెడ్డిని పెట్టిన బీజేపీ అన్ని విధాలుగా బీసీలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఎన్నికల కోసమే బీసీ సీఎం డ్రామా ఆడుతుందని తెలిపారు. ముస్లీంల రిజర్వేషన్లు ఎత్తేస్తామంటున్న బీజేపీని ఆపే శక్తి ఒక్క కాంగ్రెస్‌కే ఉందనీ, కాంగ్రెస్ గాలి వీస్తున్న సమయంలో మైనార్టీలు ఆలోచించి ఓటేయాలని సూచించారు.





జోరుగా నామినేషన్లు..

పటాన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా

ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బఘెల్



దుర్గ్: ఛత్తీస్‌గఢ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్ సోమవారం తన సాంప్రదాయ స్థానమైన దుర్గ్ జిల్లాలోని పటాన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. 62 ఏండ్ల నాయకుడు దుర్గ్ కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలను సమర్పించారు. సీఎం బఘెల్ వెంట అసెంబ్లీ స్పీకర్ చరణ్ దాస్ మహంత్, హెూం మంత్రి తామ్రధ్వజ్ సాహు ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్ ఆత్మగౌరవం కోసం, మీ అందరికీ సేవ చేయడానికి ఎల్లప్పుడూ అంకితభావంతో ఉంటానని వాగ్దానం చేస్తున్నాను" అని బఘెల్ రాశారు.పటాన్ దుర్గ్ జిల్లాలోని గ్రామీణ నియోజకవర్గం నుంచి బఘెల్ 1993, 1998, 2003, 2013 మరియు 2018లో ఐదుసార్లు ఈ స్థానం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మరోసారి విజయ్ బఘేల్‌ను ఈ స్థానంలో నిలబెట్టింది. ప్రస్తుతం ఆయన దుర్గ్ లోక్‌సభ ఎంపీ. ఇద్దరూ కుర్మీ కులస్తులే కావటం విశేషం.

బుధ్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా మధ్యప్రదేశ్

సీఎం శివరాజ్ చౌహాన్ నామినేషన్



భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత శివరాజ్‌సింగ్ చౌహాన్ బుధ్ని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. బుధ్ని నియోజకవర్గంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్‌ల దాఖలుకు ఆఖరి రోజైన అక్టోబర్ 30న ఆయన నామినేషన్ వేశారు. శివరాజ్ సింగ్ చౌహాన్ రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు.

దడపుట్టిస్తున్న

చిన్న పార్టీల కూటములు

మూడు రాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్ రెబల్స్ అడ్డాలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల జరుగుతున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ల్లో చిన్న పార్టీలు కూటములుగా ఏర్పడ్డాయి. రాజస్థాన్‌లో భీమ్ ఆర్మీ నేత చంద్రశేఖర్ ఆజాద్ ఏఎస్పీతో హనుమాన్ బేనివాల్ ఆర్ఎల్పీ కూటమి ఏర్పడింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రెండింటిలో బీఎస్పీ, జీజీపీ కూటమిగా ఏర్పడ్డాయి. ఈ మూడు రాష్ట్రాల్లో ఈ కూటములు మూడో ధ్రువంగా ఉద్భవించాయి. ఎందుకంటే చాలా మంది బీజేపీ, కాంగ్రెస్ తిరుగుబాటు నాయకులు ఈ కూటమి పార్టీల నుంచి పోటీ చేయాలని చూస్తున్నారు.

రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మూడు రాష్ట్రాలలో ఈ పొత్తులు రెండు జాతీయ పార్టీల తిరుగుబాటుదారులకు ఆకర్షణీయమైన ఎంపికలు, కుల సమూహాల అనుగుణంగా ఉన్నాయి. రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్పీ) జాట్‌లలో తన స్థావరాన్ని కలిగి ఉంది. ఇది 40 అసెంబ్లీ స్థానాల ఫలితాలను ప్రభావితం చేసే సంఘం, ఆజాద్ సమాజ్ పార్టీ (ఏఎస్పీ) దళిత ఓటు బ్యాంకులో ప్రవేశించింది. అదేవిధంగా, బీఎస్పీ దళిత వాదం జెండాతో బేవర్ అయిన గోండ్వానా గంతంత్ర పార్టీ (జీజీపీ)తో జతకట్టింది. ఇది మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రెండింటిలోనూ ఒక ప్రధాన గిరిజన సమూహం అయిన గోండి ప్రజల మధ్య ప్రభావంతో ఉంది.ఈ మూడు రాష్ట్రాలలో ఈ పొత్తుల కుల కలయికలు కూడా తిరుగుబాటుదారులకు తమ పార్టీలతో తెగదెంపులు చేసుకోవడానికి అవకాశంగా ఉన్నాయి. నాగోడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ రెబల్‌గా ఉన్న యద్వేంద్ర సింగ్‌కు, లాహర్ స్థానం నుంచి బీజేపీ రెబల్‌గా ఉన్న రసాల్ సింగ్‌కు కూడా బీఎస్పీ టికెట్ ఇచ్చింది.

తిరుగుబాటుల వెనుక

మధ్యప్రదేశ్‌లో గ్వాలియర్-చంబల్ ప్రాంతంలో ప్రభావాన్ని కలిగి ఉన్న మాయావతి నేతృత్వంలోని పార్టీ, రాష్ట్రంలోని రెండు కీలక పార్టీల రెబల్స్‌కు టిక్కెట్లు ఇచ్చింది. ఇప్పుడు కొన్ని స్థానాల్లో కొంతమంది బలమైన అభ్యర్థులను ఆ పార్టీ నిలబెట్టింది.

అదేవిధంగా, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటివరకు పది మంది అభ్యర్థులను ప్రకటించిన ఆర్ఎల్పీ, బీటీపీని కూటమి భాగస్వామిగా చేర్చుకొని మొత్తం 200 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని యోచిస్తోంది. బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన చాలా మంది రెబల్స్‌తో తామతో టచ్‌లో ఉన్నారని, వారిని అనేక అసెంబ్లీ స్థానాల్లో తమ అభ్యర్థులుగా నిలబెట్టే ఆలోచనలో ఉన్నామని ఆర్ఎల్పీ వర్గాలు తెలిపాయి.

రాజకీయ పార్టీల పొత్తులను నియంత్రించలేం

- 'ఇండియా' కూటమి పేరుపై కేంద్ర ఎన్నికల సంఘం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ పార్టీల పొత్తులను నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్‌కు ఎలాంటి చట్టపరమైన అధికారం లేదని సీఈసీ వెల్లడించింది. ప్రతిపక్ష పార్టీల కూటమికి 'ఇండియా' అని పేరు పెట్టడాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై విచారణ సందర్భంగా ఈసీ తమ అభిప్రాయాన్ని వెల్లడించింది. అయితే, 'ఇండియా' పేరు చట్టబద్ధతపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదని స్పష్టం చేసింది.వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఉమ్మడిగా ఎదుర్కొనే వ్యూహంతో 28 ప్రతిపక్ష రాజకీయ పార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే. అయితే, ఈ పేరును సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని పార్టీలు దేశం పేరును ఉపయోగించుకుంటున్నాయని పిటిషనర్ గిరిష్ భరద్వాజ్ ఆరోపించారు. ఆ కూటమి 'ఇండియా' పేరును వినియోగించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు.దీనిపై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు.. ఈ పిటిషన్ పై తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈసీ సోమవారం కోర్టుకు తమ స్పందన తెలియజేసింది. "ఎన్నికలను నిర్వహించడం, రాజకీయ పార్టీలను రిజిస్టర్ చేసుకునే అధికారం ఈసీకి ఉంది. కానీ, రాజకీయ పొత్తులను ప్రజాప్రాతినిధ్య చట్టం, భారత రాజ్యాంగం కింద 'నియంత్రిత సంస్థలు'గా గుర్తించలేం. గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం కింద రాజకీయ కూటములను చట్టపరమైన సంస్థలుగా పరిగణించలేం. అందువల్ల వాటి పనితీరును నియంత్రించేందుకు చట్టబద్ధమైన నిబంధన ఏదీ లేదు" అని ఈసీ తమ అభిప్రాయాన్ని వెల్లడించింది. అయితే, తమ విధివిధానాలకు అనుగుణంగా ఈ స్పందన తెలియజేశామని ఈసీ ఈ సందర్భంగా తెలిపింది. అంతేగానీ, 'ఇండియా' పేరు చట్టబద్ధత అంశంపై దీన్ని తమ స్పందనగా భావించరాదని స్పష్టం చేసింది.



రాజస్థాన్ ఎన్నికల్లో బంధువులే అభ్యర్థులుగా..

కాంగ్రెస్-బీజేపీ నుంచి 29 మంది బరిలోకి..

- వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకమంటూనే టిక్కెట్లు



జైపూర్: 25న రాజస్థాన్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో, ప్రధాన ప్రత్యర్థులు అధికార కాంగ్రెస్ ,ప్రత్యర్థి బీజేపీ మధ్య ఫైట్ కనిపిస్తోంది. 200 అసెంబ్లీ స్థానాలున్న రాజస్థాన్‌లో ఇప్పటివరకు బీజేపీ 124 స్థానాలకు, అధికార కాంగ్రెస్ 95 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇప్పటివరకు, కనీసం 29 మంది అభ్యర్థులు రెండు పార్టీల నుంచి ఎన్నికల బరిలో ఉన్నారు. అయితే వారంతా నాయకుల బంధువులు లేదా ఏదో ఒక రాజకీయ కుటుంబానికి చెందినవారు కావటం గమనార్హం.తమ పార్టీల్లో ఎలాంటి తిరుగుబాటు జరగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్టు ఇరు పార్టీల నేతలు చెప్పుకుంటున్నారు. 124 మంది అభ్యర్థులతో కూడిన రెండు జాబితాలలో, ప్రముఖ నాయకుల కుటుంబ సభ్యులైన కనీసం 11 మందికి బీజేపీ టిక్కెట్లు ఇచ్చింది. అదే సమయంలో ఇప్పటివరకు 95 మంది అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన 18 మందికి టిక్కెట్లు ఇచ్చింది.

కొడుకులు, కుమార్తెలు, మనవరాలు, కోడలుతో సహా...

బీజేపీ జాబితాలో పలువురు ప్రముఖ నేతల కుమారులు, కుమార్తెలు, మనవరాలు, కోడలు ఉన్నారు. అనారోగ్య సమస్యలతో అకాల మృతి చెందిన నాయకుల కుటుంబాలకు జాబితాలో సముచిత స్థానం కల్పించారు. నసీరాబాద్ స్థానం నుంచి దివంగత ఎంపీ సన్వర్ లాల్ జాట్ కుమారుడు రామ్ స్వరూప్ లాంబాకు, దీగ్-కుమ్హేర్ నియోజకవర్గం నుంచి దివంగత రాష్ట్ర మాజీ మంత్రి దిగంబర్ సింగ్ కుమారుడు శైలేష్ సింగ్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. 2018 ఎన్నికల్లో గెలుపొందిన లంబాపై మరోసారి బీజేపీ పంతం పట్టింది. గతంలో ఆయన అజ్మీర్ నుంచి లోక్‌సభ ఉప ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘు శర్మ చేతిలో 80 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు.

దొందు దొందే...

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాయి. వంశపారంపర్య రాజకీయాలు ప్రజాస్వామ్యానికి సమస్య అని బీజేపీ సీనియర్ నేతలు అభివర్ణించారు. అదే సమయంలో రాజస్థాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ సుఖ్‌జీందర్ సింగ్ మాట్లాడుతూ.. తమ పార్టీలో వంశపారంపర్య రాజకీయాలపై ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు తమ కుటుంబాలను వెనకేసుకురాకపోతే పార్టీ ఎలా ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు.

కులగణన చేపట్టాలి



(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) మద్దతు తెలుపుతుంది. దళిత సంఘాలు, వేదికల నేతృత్వంలో డిసెంబర్ 4న జరిగే చలో పార్లమెంట్‌కు మద్దతు ఇవ్వాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. సాధారణ జనాభా గణనతో పాటు అఖిల భారత కుల గణన కూడా నిర్వహించాలి. రాష్ట్ర స్థాయిలో కుల గణనలు నిర్వహించడం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వచ్చే అంశం. కానీ జనాభా లెక్కలకు అఖిల భారత ప్రాతిపదిక అత్యంత అవసరం. అని సీతారాం ఏచూరి అన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో జనంపై మోయలేని భారం

ప్రజలపై మోయలేని భారం పడే విద్యుత్ స్మార్ట్ మీటర్ల అమలును నిలిపివేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ డిమాండ్ చేసినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. ప్రీపెయిడ్ విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్లను విధించాలన్న మోడీ ప్రభుత్వ నిర్ణయం విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించడమేనని విమర్శించారు. ఇప్పటికే విద్యుత్ టారిఫ్ ఎక్కువగా ఉంది. స్మార్ట్ మీటర్లు విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా ప్రయివేట్ కార్పొరేట్‌లకు అందించి లాభాలను పొందేందుకు ఒక వేదికను రూపొందించడానికి ఉద్దేశించబడ్డాయి. దీనివల్ల పేదలు, రైతులే కాకుండా సామాన్యులు కూడా నష్టపోతారు" అని అన్నారు.

ఒకే దేశం-ఒకే ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

"జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన కమిటీ ఉంది. ఈ ప్రతిపాదన అమలు ఇప్పుడు అభిప్రాయాన్ని కోరింది. 2024 జనవరి 18లోగా రాతపూర్వకంగా రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలపాలని కోరింది. కొన్ని నెలల తర్వాత సాధారణ ఎన్నికల ప్రతిపాదనతో కేంద్రం వైఖరి స్పష్టమైందనీ, ఈ ప్రతిపాదన రాజ్యాంగంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఫెడరలిజంపై ద్విముఖ దాడి. రాజ్యాంగంలో ముఖ్యమైన సవరణలు కాకుండా, అటువంటి ప్రతిపాదన లోక్‌సభ ఎన్నికలతో సమకాలీకరించడానికి రాష్ట్రాల అసెంబ్లీల జీవితాన్ని తగ్గించడం లేదా పొడిగించడం వంటివి చేస్తుంది. ప్రభుత్వం మెజారిటీని కోల్పోయినప్పుడు, దానిని కొనసాగించడం చట్టవిరుద్ధం. ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కును కాలరాస్తూ కేంద్ర పాలన విధిస్తే అది ప్రజాస్వామ్య విరుద్ధం" అని పేర్కొన్నారు

మణిపూర్ లో మరింత దిగజారిన పరిస్థితి

"మణిపూర్‌లో పరిస్థితి మరింత దిగజారుతోంది. ఇది మోడీ ప్రభుత్వం పూర్తి వైఫల్యాన్ని స్పష్టం చేస్తుంది. పరిస్థితిని నియంత్రించడంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది. రాష్ట్రంలో జాతి పోలరైజేషన్ కు మత రంగు పులుముతోంది. ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్‌ను తక్షణమే తొలగించి మణిపూర్‌లో అల్లకల్లోలాన్ని అరికట్టాలి" అని డిమాండ్ చేశారు.

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 17 స్థానాల్లో పోటీ

"ఐదు రాష్ట్రాల్లో నాలుగు రాష్ట్రాల పరిస్థితిపై కేంద్ర కమిటీ చర్చించింది. రాజస్థాన్‌లో రాష్ట్ర కమిటీ ప్రతిపాదించిన 17 మంది అభ్యర్థుల జాబితాను కమిటీ ఆమోదించింది.ఈ కమిటీలో ఇద్దరు సీపీఐ(ఎం) సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో పార్టీ మూడు స్థానాల్లో పోటీ చేస్తుంది. మధ్యప్రదేశ్‌లో పార్టీ నాలుగు స్థానాల్లో పోటీ చేస్తుంది. తెలంగాణలో పోటీపై చర్చ కొనసాగుతోంది" అని తెలిపారు.

ఉమ్మడి పోరాటాలకు సిద్ధంకండి





నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉమ్మడి పోరాటాలకు సిద్ధం కావాలని ఆశా వర్కర్స్, ఫెసిలిటేటర్లకు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపు ఇచ్చారు. రెగ్యులరైజేషన్, కనీస వేతనం నెలకు రూ. 26000, సామాజిక భద్రత, పెన్షన్, అందరికీ ఆరోగ్యం డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్‌లో ఆశా సంఘర్ష్ ర్యాలీ జరిగింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన ఆశాలు దేశ రాజధాని హస్తినలో కదంతొక్కారు. ఆయా రాష్ట్రాల ప్రాంతీయ భాషల్లో డిమాండ్లతో కూడిన ప్లకార్డులను చేబూని గర్జించారు. "మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలి. 2023 నవంబర్ 26 నుంచి 28 వరకు జరగనున్న రాష్ట్ర రాజధానుల్లో జరిగే మజ్దూర్ కిసాన్ మహాపడావ్‌లో భాగస్వామ్యం కావాలి" అంటూ సంఘర్ష్ ర్యాలీ పిలుపు ఇచ్చింది.

'ఆశా సంఘర్ష్ ర్యాలీ'ని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో అద్భుతమైన పోరాటాలు చేస్తున్న ఆశా వర్కర్లను అభినందిస్తూ, జాతీయ స్థాయిలో పోరాటాలను ఉధృతం చేయాలని, కార్పొరేట్, మత సంబంధమైన ఈ ప్రభుత్వ దేశ వ్యతిరేక విధానాలను మార్చేందుకు ఉమ్మడి పోరాటాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజలపై భారాలు మోపుతున్న మోడీ సర్కార్, కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలను ఇస్తుందని విమర్శించారు. స్కీమ్ వర్కర్లకు న్యాయంగా అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని అన్నారు. మరోవైపు స్కీమ్ లను ప్రయివేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతున్నదని విమర్శించారు. కింద స్థాయి సేవల్లో ఆశాలు కీలక పాత్ర పోషిస్తున్నారని, కాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. వారి హక్కులను కాలరాసే విధానాలను, అమలు చేస్తున్నారని విమర్శించారు. వీటినన్నింటి తిప్పికొట్టేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు ఇచ్చారు.

ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ అధ్యక్షురాలు పిపి ప్రేమ అధ్యక్షోపన్యాసం చేశారు. ఆశాలను మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఆశాలతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని, కాని వారి ప్రయోజనాల రూపకల్పనలో వెనుకడుగు వేస్తున్నారని విమర్శించారు. ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ మాట్లాడుతూ ఇప్పటి వరకు సమాఖ్య చేసిన పోరాటాలు, సాధించిన డిమాండ్లను వివరించారు. పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చారు.

ఈ ర్యాలీలో ప్రజా సంఘాల నాయకులు పి కృష్ణప్రసాద్ (ఏఐకేఎస్), బి వెంకట్ (ఎఐఎడబ్ల్యుయు), హన్నన్ మొల్లా (ఎస్కేఎం-ఏఐకేఎస్), సవిత (ఐద్వా) ప్రసంగించారు. ఆశాల పోరాటానికి సంఘీభావం, మద్దతు తెలిపారు. జైభగవాన్ (ఎండీఏండబ్ల్యూఏఫ్ఐ), ఉషారాణి (ఏఐఏఫ్ఏడబ్ల్యూహెచ్) ఆశా వర్కర్ల పోరాటాలకు సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా స్కీమ్ వర్కర్ల ఉద్యమాన్ని, ఐక్యతను క్షేత్ర స్థాయి వరకు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఏఆర్ సింధు స్కీమ్ వర్కర్ల భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ కార్యదర్శి సురేఖ ముగింపు ప్రసంగం చేసి కార్యాచరణను ప్రకటించారు.

కోశాధికారి పుష్పా పాటిల్, పి. జయలక్ష్మి (తెలంగాణ), కె. ధనలక్ష్మి(ఆంధ్రప్రదేశ్), నోని లిక్సన్(అసోం), సుధా సుమన్(బీహార్), హసుమతి(గుజరాత్), సునీతా భగత్(జమ్ము) దిల్‌షాదా(కశ్మీర్), కవితా సోలంకి(మధ్యప్రదేశ్), శకుంతల మహాకుత్(ఒడిశా), సీమా (పంజాబ్), పుష్పా పాటిల్ (మహారాష్ట్ర) శివ దుబే (ఉత్తరాఖండ్) సంగీత (ఉత్తరప్రదేశ్), సబీనా యాస్మిన్ (పశ్చిమ బెంగాల్) వివిధ రాష్ట్రాల నాయకులు ర్యాలీలో ప్రసంగించారు. అధ్యక్ష వర్గంలో పి పి ప్రేమ, సునీత, కె. ధనలక్ష్మి, సుధా సుమన్, ఎ టి పద్మనాభన్ వీణా గుప్తా, ఆఫీస్ బేరర్లు మమత (అసోం), ప్రియాంక (మహారాష్ట్ర), మధుజ (బెంగాల్), దిలీప్ శుక్లా (యూపీ), ఎంబి ప్రభావతి, వి వి ప్రెసన్నకుమారి (కేరళ) ఉన్నారు.

భవిష్యత్తు కార్యాచరణ

"మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని, 2023 నవంబర్ 26-28 తేదీల్లో రాష్ట్ర రాజధానుల్లో జరిగే మజ్దూర్, కిసాన్ మహాపడావ్‌లో పాల్గొనాలని ర్యాలీ పిలుపునిచ్చింది.

స్కీమ్ వర్కర్ల సదస్సు పిలుపు మేరకు, డిసెంబర్ 2023లో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో ఆందోళనకు స్కీమ్ వర్కర్లను భారీగా సమీకరించాలి" అని భవిష్యత్తు కార్యచరణను సంఘర్ష్ ర్యాలీ ప్రకటించింది. అన్ని రాష్ట్రాల నుంచి జనసమీకరణ కోటాను అధిగమించి భారీ జనసమీకరణ మోడీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో కలత చెందిన పోలీసులు, పరిపాలన విభాగం సమయానికి ముందే కార్యక్రమాన్ని ముగించటానికి ప్రయత్నించగా, ఆశాలు ప్రతిఘటించారు. సంఘర్ష్ ర్యాలీలో 17 రాష్ట్రాల నుంచి పది వేల మందికి పైగా ఆశా వర్కర్లు, ఫెసిలిటేటర్లు పాల్గొన్నారు. పంజాబ్‌కు చెందిన రెండు అనుబంధేతర యూనియన్‌లు, యూపీ నుంచి ఒక యూనియన్ కూడా ర్యాలీలో పాల్గొన్నాయి. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రాష్ట్రాల్లో పోరాటాల సందర్భంగా రూపొందించిన పాటలు ఆశాలను ఉత్సాహపరిచాయి.

రాజస్థాన్‌లోని 17 స్థానాల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులు పోటీ

- బీజేపీకి ధీటుగా సీపీఐ(ఎం) నిలబడుతుంది: అమ్రారామ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజస్థాన్‌లో రెండు సిట్టింగ్ స్థానాలతో సహా 17 స్థానాలకు సీపీఐ(ఎం) అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు సోమవారం సీపీఐ(ఎం) 17 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేసింది. హనుమాన్‌గఢ్ జిల్లాలోని భద్ర సిట్టింగ్ స్థానం నుంచి బల్వాన్ పునియా మళ్లీ పోటీ చేయనున్నారు. బికనీర్‌లోని మరో సిట్టింగ్ స్థానమైన దుంగార్‌ఘర్‌లో గిర్ధారిలాల్ మహియా తిరిగి పోటీ చేయనున్నారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి అమ్రా రామ్ సికార్ జిల్లాలోని దాతరంగడ్ నుంచి పోటీ చేయనున్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అమ్రారామ్ 2008లో దాతరాన్‌గఢ్‌లో గెలుపొందారు. మరో మాజీ ఎమ్మెల్యే పేమారామ్ సికార్‌లో పోటీ చేయనున్నారు.

సీపీఐ(ఎం) పోటీ చేసిన ఇతర స్థానాలు అభ్యర్థులు

లక్ష్మణ్‌గఢ్ నియోజకవర్గం నుంచి విజేంద్ర ధాకా, సికార్ నుంచి ఉస్మాన్ ఖాన్, హనుమాన్‌ఘర్ నుంచి రఘువీర్ వర్మ, నోహర్ నుంచి మంగేష్ చౌదరి, రైసింగ్ నగర్ నుంచి షోపేత్ రామ్ మేఘ్‌వాల్, అనుప్‌గఢ్ నుంచి షో సింగ్ ధిల్లాన్, దుంగార్‌పూర్ నుంచి గౌతమ్ తోమర్, తారానగర్ నుంచి నిర్మల్ కుమార్ ప్రజాపత్, సర్దార్‌షహర్ నుంచి ఛగన్‌లాల్ చౌదరి, సదుల్‌పూర్ నుంచి సునీల్ పునియా, జాదౌల్ నుంచి ప్రేమ్ పార్గి, లద్నూ నుంచి భగీరథ్ యాదవ్, నవన్ నుంచి కనరామ్ బిజరానియా పోటీ చేయనున్నారు.

సికార్ జిల్లాలో నలుగురు, హనుమాన్‌గఢ్, చురు జిల్లాల్లో ముగ్గురు చొప్పున, శ్రీగంగానగర్, నాగౌర్‌లో ఇద్దరు చొప్పున, దుంగార్‌పూర్, బికనీర్, ఉదయ్‌పూర్ జిల్లాల్లో ఒక్కో స్థానానికి సీపీఐ(ఎం) అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

బీజేపీకి ధీటుగా సీపీఐ(ఎం): అమ్రారామ్

సీపీఐ(ఎం) రాజస్థాన్ రాష్ట్ర కార్యదర్శి అమ్రారామ్ మాట్లాడుతూ.. పోటీ లేని నియోజకవర్గాల్లో బీజేపీకి ధీటుగా సీపీఐ(ఎం) నిలబడుతుందన్నారు. రాజస్థాన్‌లో బీజేపీకి వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడేందుకు కాంగ్రెస్ విముఖత చూపిందని మీడియా అడిగిన ప్రశ్నకు అమ్రారామ్ సమాధానం ఇచ్చారు. "సీట్ల విషయంలో కాంగ్రెస్ అధిష్టానం అంగీకరించలేదు. సీపీఐ(ఎం)కు గరిష్టంగా మూడు సీట్లు ఇవ్వవచ్చని కాంగ్రెస్ రాజస్థాన్ ఇన్‌చార్జి సుఖ్‌జీందర్ సింగ్ రంధావా అన్నారు. ప్రస్తుతం సీపీఐ(ఎం)కు రెండు స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో రెండు చోట్ల రెండో స్థానంలో నిలిచాం. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో దాదాపు 45 వేల ఓట్లు ఉన్నాయి. బీజేపీపై పోరుకు కాంగ్రెస్ సిద్ధంగా లేని పరిస్థితుల్లో సీపీఐ(ఎం) 17 స్థానాల్లో పోటీ చేస్తోంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను బట్టబయలు చేసేందుకు, ప్రజా సమస్యలను సభకు తీసుకురావడానికి సీపీఐ(ఎం) అభ్యర్థులను అత్యధిక సంఖ్యలో గెలిపించాలి" అని అమ్రారామ్ అభ్యర్థించారు.

సంపాదకీయం

విష బీజాలు..!

'ఇండియా-భారత్' వివాదం మళ్లీ తెరమీదికొచ్చి రాజకీయంగా తీవ్ర అలజడికి కారణమైంది. ఈ మారు వివాదానికి కేంద్రమైంది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి). అన్ని పాఠ్య పుస్తకాల్లో 'ఇండియా' స్థానంలో 'భారత్'ను ఉపయోగించాలని సాంఘిక శాస్త్రాల విషయాలపై పరిశీలనకు

> కేరళ వామపక్ష ప్రభుత్వం, మరికొన్ని విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే రాజ్యాంగ పరంగా రాష్ట్రాలకు విద్యపై ఉన్న హక్కును రక్షిస్తూ కేంద్ర విధానాలను ప్రతిఘటిస్తున్నాయి. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, నిజమైన చరిత్ర బోధించాలి. శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి. విద్యలో బీజేపీ సంకుచిత రాజకీయాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాల్సిన తరుణం.

ఎన్‌సిఇఆర్‌టి నియమించిన ఉన్నత కమిటీ సిఫారసు చేసింది. అంతేనా, చరిత్రలో హిందూ రాజుల విజయ గాథలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, ప్రాచీన, మధ్య, ఆధునిక చరిత్రలతో పాటు భారత సంప్రదాయ చరిత్రను విద్యార్థులకు బోధించాలంది. కమిటీ సిఫారసులపై ప్రతిపక్షాలు, విద్యావేత్తలు, మేధావుల నుంచి ముప్పేటా విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సకలానీ స్పందిస్తూ కమిటీ సిఫారసులు ప్రతిపాదనల దశలోనే ఉన్నాయని, తుది నిర్ణయం తీసుకోలేదని వివరణిచ్చారు. అంతటితోనే వివాదానికి ఫుల్‌స్టాప్ పడుతుందని భావించలేం. సైద్ధాంతికంగా, ఉద్దేశపూర్వకంగానే మోడీ ప్రభుత్వం పలు వ్యవస్థల్లో తమ హిందూత్వ ఎజెండా చొప్పింపును చూస్తూనే ఉన్నాం. వాటికి కొనసాగింపుగానే ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య ప్రణాళికల్లో మార్పులను అర్థం చేసుకోవాలి.

ఢిల్లీలో నిర్వహించిన జి20 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న దేశాధినేతలకు రాష్ట్రపతి విందు ఇవ్వగా, ఆ సందర్భంగా కేంద్రం ప్రచురించిన ఆహ్వాన పత్రికలలో తొలిసారి 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' స్థానంలో 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని పేర్కొనడంతో వివాదం చెలరేగింది. అనంతరం జరిగిన ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా పేరు భారత్‌గా మారుస్తారన్న చర్చ వచ్చింది. ఇప్పుడు తిరిగి ఎన్‌సిఇఆర్‌టి తేనెతుట్టెను కదిలించింది.



దేశం పేరు మార్పు అనేది అదేదో విపక్షాల ఫోరం 'ఇండియా' అని పేరు పెట్టుకుంది కాబట్టి ఆ పదం ఉచ్చరించడం ఇష్టం లేక మోడీ ప్రభుత్వం అధాటుగా తీసుకున్న నిర్ణయం అనుకుంటే పొరపాటు. మన దేశానికి ఏ పేరు పెట్టాలనే అంశంపై హిందూత్వ వాదుల ప్రతిపాదనలు వేరేగా ఉన్నాయి. హిందూత్వ సిద్ధాంతకర్తగా ఆర్‌ఎస్‌ఎస్ పిలుచుకునే సావర్కర్, 1923లో రాసిన 'హిందుత్వ' గ్రంథంలో హిందూస్తాన్ సహా పలు పేర్లు సూచించాడు. ఆయనా విష్ణుపురాణంలో ఉన్న భారత ఖండం నామధేయాన్ని ప్రస్తావించాడు. ఎన్‌సిఇఆర్‌టి వేసిన కమిటీ కూడా మక్కీకి మక్కీ అదే ప్రస్తావన చేయడం గమనార్హం. కాబట్టి వాస్తవాలతో, పరిశోధనలతో, ఆధారాలతో కమిటీ సిఫారసు చేయలేదని గుర్తించాలి. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత అమలులో భాగంగానే కమిటీ సిఫారసులను చూడాలి.

పాఠ్య ప్రణాళికల ఫ్రేమ్‌వర్క్‌పై ఎన్‌సిఇఆర్‌టి 2021లో 25 ఉన్నత కమిటీలు వేయగా సాంఘిక శాస్త్రాల పరిశీలనపై సి.ఐ ఐజాక్ ఛైర్మన్‌గా వేసిన కమిటీ ఒకటి. ఐజాక్ చరిత్రకారునిగా కంటే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతవాదిగానే ప్రాచుర్యం పొందారు. భారత చరిత్ర పరిశోధన మండలిలో సభ్యుడు కూడా. 1975లో ఏబీవీపీలో పనిచేశారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలు కలిగిన భారతీయ విచార కేంద్రం కేరళ విభాగానికి వర్కింగ్ ప్రెసిడెంట్. ఐజాక్ కమిటీలోని మరో సభ్యుడు వందనా మిశ్రా సైతం ఏబీవీపీ కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా పనిచేశారు. ఇటువంటి వారున్న కమిటీలు ఎటువంటి సిఫారసులు చేస్తాయో అర్థం చేసుకోవచ్చు. పౌరసత్వ చట్టం, ఏకరూప పౌరస్మృతి, అగ్నివీర్, చరిత్ర వక్రీకరణ, సైన్స్‌లో డార్విన్ పరిణామ సిద్ధాంతం ఎత్తివేత... అనేకానేక వివాదాలు ఆర్‌ఎస్‌ఎస్ అమ్ముల పొదిలో ఉన్నాయి. విద్యకు కాషాయం కప్పే నానారకాల అంశాలు మోడీ సర్కారు ప్రతిపాదించిన నూతన జాతీయ విద్యావిధానంలో నిక్షిప్తమయ్యాయి. కోట్లాది పిల్లల మెదళ్లల్లో భావ కాలుష్యాన్ని అవి నింపుతున్నాయి. కేరళ వామపక్ష ప్రభుత్వం, మరికొన్ని విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే రాజ్యాంగపరంగా రాష్ట్రాలకు విద్యపై ఉన్న హక్కును రక్షిస్తూ కేంద్ర విధానాలను ప్రతిఘటిస్తున్నాయి. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, నిజమైన చరిత్ర బోధించాలి. శాస్త్రీయ ఆలోచన పెంపొందించాలి. విద్యలో బీజేపీ సంకుచిత రాజకీయాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాల్సిన తరుణం. ◆

వాస్తవాలను భరించలేని ఫాసిస్టు ప్రభుత్వం


ప్రభాత్ పట్నాయక్

అన్ని ఫాసిస్టు సంస్థలకూ ఒక ఉమ్మడి లక్షణం ఉంటుంది. వాళ్లు జనం మీదకు వదిలే ప్రచారం బూటకం అని రుజువు చేసే ఆధారాలను వాళ్లు పూర్తిగా తిరస్కరిస్తారు. ఆ ఆధారాలు వాస్తవమే అయినా ఆ విషయాన్ని ఒప్పుకోరు. మన దేశంలో అధికారంలో ఉన్న హిందూత్వ శక్తులు కూడా ఇదే మాదిరిగా ఉన్నారు. తమ ఆధ్వర్యంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక వేగంతో అభివృద్ధి చెందుతున్న దేశంగా దూసుకుపోతోందని, ఇంత మంచి పాలనను గతంలో ప్రజలు ఎన్నడూ చూసి వుండలేదని వాళ్లు ప్రచారం చేస్తున్నారు. అంత ర్జాతీయ సంస్థలు గాని, ఆఖరికి తమ ఆధీనంలో నడిచే ప్రభుత్వ సంస్థలు గాని ఆ ప్రచారానికి విరుద్ధంగా ఉన్న ఆధారాలను వెల్లడి చేస్తే అటువంటి ఆధారాలన్నీ తప్పుల తడకలని దబాయిస్తారు. ఇండియాలో ఫాసిస్టు హిందూత్వ శక్తుల ప్రచారసూక్తి చాలా స్పష్టం. "మోడీ ఏం చెప్తాడో అదే సత్యం" అన్నదే ఆ సూక్తి. అందుకు భిన్నంగా ఏ వాస్తవమైనా బయటపడితే అది తప్పు అయివుండాలి. వాళ్ల లెక్కల్లో బహుశా అది కడు దుర్మార్గమైన ఉగ్రవాద కుట్రలో భాగం అయి వుంటుంది.

ఒక విషయాన్ని మొత్తంగానే తిరస్కరించడం వేరు, దానిని విమర్శనాత్మకంగా పరిశీలించడం వేరు. ఒకవేళ హిందూత్వ శక్తులు వెలుగులోకి వచ్చిన ఆధారాలను విమర్శనాత్మకంగా పరిశీలించి చర్చిస్తే అది చాలా ఉపయోగకరమైన చర్చ అవుతుంది. మేధోపరమైన మథనం ఎలా జరిగినా దాని వల్ల ఉపయోగమే. వెలికి తీసిన ఆధారాలను భిన్నమైన కోణాల నుండి పరిశీలించి నిగ్గు తేల్చడానికి గాని, ఆధారాలను సేకరించడానికి మరింత మెరుగైన పద్ధతులను అనుసరించడానికి గాని అది దారి తీస్తుంది. కాని అటువంటి మేధోపరమైన విమర్శనాత్మక చర్చ హిందూత్వవాదులకు శక్తికి మించిన పని. వెలుగులోకి వచ్చిన వాస్తవాలను, వాటి ఆధారాలను

> ఒక పక్క మన జిడిపి పెరుగుతున్నప్పటికీ, పలు సంస్థలు వేర్వేరు ఆధారాల ప్రాతిపదికలను ఉపయోగించి రూపొందించిన సూచికలు మన దేశంలో పోషకాహార లేమి ఎక్కువగా ఉన్నదని, పైగా నానాటికీ అది మరింత ఎక్కువగా పెరుగుతోందని సూచిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని చాలా తీవ్రంగా పరిగణించాలి. మన దేశాన్నేలుతున్న ఫాసిస్టు తరహా ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తూ ఆ సూచికల నిర్ధారణలను తిరస్కరిస్తోంది. తద్వారా తన అసలు స్వభావాన్ని బయట పెట్టుకుంటోంది.

తిరస్కరించడం ఒక్కటే వాళ్ళకి తెలుసు. ఆ ఆధారాలను, వాస్తవాలను ఎందుకు తిరస్కరించాలో ఆ కారణాలను కూడా వాళ్లు చెప్పలేరు.

మోడీ ప్రభుత్వం వాస్తవాలను, వాటికి సంబంధించిన ఆధారాలను తిరస్కరించిన మూడు సందర్భాలను నేనిక్కడ ప్రస్తావిస్తాను. **మొదటిది :** వినియోగదారులు చేసిన ఖర్చు గురించి 2017-18లో చేసిన జాతీయ శాంపిల్ సర్వేకు సంబంధించినది. 1950 దశకంలో ప్రముఖ గణాంక శాస్త్రవేత్త పి.సి.మహలనోబిస్ ఈ సర్వే విధానాలను రూపొందించారు. ప్రతీ ఐదు సంవత్సరాలకూ ఒక మారు జరిగే పెద్ద శాంపిల్ సర్వే అది. నిజానికి ప్రపంచంలోనే అతి పెద్ద సర్వే అది. అయితే అటువంటి సర్వేకు సైతం కొన్ని పరిమితులు ఉండవచ్చు. ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ, అది చాలా విలువైన సమాచారాన్ని వెలికి తీస్తుంది. మన దేశంలోనే గాక విదేశాలలో ఉండే పరిశోధకులకు సైతం కొన్ని తరాల వరకూ ఉపయోగపడే విలువైన సమాచారం దాని ద్వారా లభిస్తుంది.

2017-18 సర్వే భారతదేశంలో పెరుగుతున్న పేదరికం ఎంత దయనీయంగా ఉందో వెల్లడించింది. దాంతో మోడీ ప్రభుత్వం ఆ సర్వే వివరాలను బహిరంగపరచనివ్వలేదు. అంతే గాక, అటువంటి సర్వేలు ఇకముందు జరగకుండా నిలుపు చేసేసింది. ప్రభుత్వం ఆ వివరాలను తొక్కిపెట్టేలోపే అందులో కొన్ని వివరాలు బయటకొచ్చాయి. వాటిని బట్టి చూస్తే గ్రామీణ భారతంలో రోజుకు తలసరి కనీసం 2200 కేలరీల శక్తిని ఇచ్చే ఆహారాన్ని పొందలేకపోతున్న ప్రజలు 2011-12 నుండి 2017-18 మధ్య కాలంలో 68 శాతం నుండి 78.5 శాతానికి పెరిగారు.

ఈ సర్వే వివరాలను చూసి ప్రభుత్వం అప్రమత్తం అయ్యే బదులు ఆ సర్వే వివరాలను మొత్తంగా తొక్కిపెట్టి వేయడమే కాకుండా, ఇకముందు ఆ తరహా సర్వేలు అనేవి అసలు జరగరాదని ఆదేశించింది! ఆ సర్వేపై సందేహాలు ఉంటే మళ్ళీ తాజాగా సర్వే జరపమని ఆదేశించి వుండవచ్చు (గతంలో 2009-10 సర్వే కూడా పేదరికం స్థాయి చాలా ఎక్కువగా ఉన్నట్టు వెల్లడిస్తే అప్పటి యుపిఎ ప్రభుత్వం 2011-12లో మళ్ళీ సర్వే జరపాలని ఆదేశించింది). లేదా ఒక నిపుణుల కమిటీని నియమించి ఆ సర్వే వెల్లడించిన విషయాల ప్రభావం ఏమిటో, పరిస్థితులను చక్కదిద్దే మార్గాలు ఏమిటో సూచించమని కోరవచ్చు. కాని మోడీ ప్రభుత్వం ఏకంగా ఆ సర్వే వివరాలనే కప్పిపెట్టింది. తాము చేసే ప్రచారానికి భిన్నంగా ఉండే వాస్తవాల పట్ల ఫాసిస్టు శక్తులు ప్రతిస్పందించే తీరు ఈ విధంగానే ఉంటుంది.

నా **రెండో ఉదాహరణ** ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేకు సంబంధించినది. ఈ సర్వే 2019-21 మధ్య నిర్వహించారు. 2015-16లో జరిపిన 4వ సర్వే నాటికే చిన్న పిల్లలలోను, మహిళలలోను అధికంగా ఉన్న రక్తహీనత 5వ సర్వేలో మరింత తీవ్ర స్థాయికి చేరినట్టు తేలింది. 6 నెలల నుండి 5 ఏళ్ళ లోపు ఉన్న పిల్లల్లో రక్తహీనత 59 నుండి 67 శాతానికి చేరింది. వారిలో ఒక మోస్తరు నుండి తీవ్ర స్థాయిలో రక్తహీనత ఉన్నవారు 30.6 నుండి 38.1 శాతానికి పెరిగారు. స్వల్ప స్థాయిలో రక్తహీనత ఉన్నవారు 28.4 నుండి 28.9 శాతానికి, అంటే స్వల్పంగానే పెరిగారు. ఇక 49 ఏళ్ళ వరకు వయస్సు ఉన్న మహిళలలో రక్తహీనత 53 నుండి 57 శాతానికి పెరిగింది. వారిలో కూడా ఒక మోస్తరు నుండి తీవ్ర స్థాయిలో రక్తహీనత ఉన్నవారి శాతం 28.4 నుండి 31.4 శాతానికి పెరిగింది. మహిళలతో పోల్చితే పురుషులలో రక్తహీనత తక్కువే ఉంది. అయినప్పటికీ, 49 ఏళ్ళ లోపు పురుషులలో రక్తహీనత 23 నుండి 25 శాతానికి పెరిగింది. వారిలో ఒక మోస్తరు నుండి తీవ్ర స్థాయిలో రక్తహీనత ఉన్న వారు 5 నుండి 8 శాతానికి పెరిగారు. సగటు రక్తహీనత స్థాయి కన్నా గ్రామీణ ప్రాంతంలో జీవించే పిల్లలు, పెద్దల్లో రక్తహీనత ఉన్నవారి శాతం, తీవ్ర స్థాయిలో ఉన్నవారి శాతం ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలలో దీని తీవ్రత బాగా ఎక్కువగా ఉంది.

ఈ వాస్తవాల పట్ల ప్రభుత్వం ఏ విధంగా స్పందించింది? నిపుణులను రంగంలోకి దించి, ఆ వాస్తవాలను నిగ్గు తేల్చి, పెరుగుతున్న రక్తహీనతను అరికట్టేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టడం పోయి, ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రమూ శ్రద్ధ కనపరచకుండా, ఆ సర్వే నిర్వహించిన అంతర్జాతీయ జనాభా అధ్యయన సంస్థ డైరెక్టర్‌ను విధుల నుండి సస్పెండ్ చేసింది (ఆ డైరెక్టర్ వెనువెంటనే రాజీనామా చేశారు. రాజీనామా చేయగానే ఆ సస్పెన్షన్‌ను రద్దు చేశారు. దీనిని బట్టి సస్పెండ్ చేయడానికి చూపించిన కారణాలు బూటకం అని స్పష్టం ఔతోంది)! వాస్తవాల పట్ల ఫాసిస్టులు ఏ విధంగా ప్రతిస్పందిస్తారు అనే దానికి ఈ ఉదంతం మరో ఉదాహరణ.

నా **మూడో ఉదాహరణ** ప్రపంచ ఆకలి సూచికకు సంబంధించినది. ఆకలి బాగా స్వల్ప స్థాయిలో ఉన్న దేశాలను

> ఈ వాస్తవాల పట్ల ప్రభుత్వం ఏ విధంగా స్పందించింది? నిపుణులను రంగంలోకి దించి, ఆ వాస్తవాలను నిగ్గు తేల్చి, పెరుగుతున్న రక్తహీనతను అరికట్టేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టడం పోయి, ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రమూ శ్రద్ధ కనపరచకుండా, ఆ సర్వే నిర్వహించిన అంతర్జాతీయ జనాభా అధ్యయన సంస్థ డైరెక్టర్‌ను విధుల నుండి సస్పెండ్ చేసింది (ఆ డైరెక్టర్ వెనువెంటనే రాజీనామా చేశారు. రాజీనామా చేయగానే ఆ సస్పెన్షన్ ను రద్దు చేశారు. దీనిని బట్టి సస్పెండ్ చేయడానికి చూపించిన కారణాలు బూటకం అని స్పష్టం ఔతోంది)! వాస్తవాల పట్ల ఫాసిస్టులు ఏ విధంగా ప్రతిస్పందిస్తారు అనేదానికి ఈ ఉదంతం మరో ఉదాహరణ.



ఈ సూచిక తయారీకి పరిగణనలోకి తీసుకోరు. 2023కు సంబంధించిన ఆకలి సూచికలో 125 దేశాలకు గాను మన దేశం 111వ స్థానంలో ఉంది. మన పొరుగునే ఉన్న పాకిస్తాన్ 102వ స్థానంలో, బంగ్లాదేశ్ 81వ స్థానంలోను, శ్రీలంక 61వ స్థానంలోను, నేపాల్ 69వ స్థానంలోను ఉంటే మనం మాత్రం 111వ స్థానంలో ఉండడమే కాకుండా ఏటికేడూ ఆ స్థానం ఇంకా దిగజారుతోంది !

ఇంత కలవర పరిచే ఈ నిర్ధారణల పట్ల ప్రభుత్వం ఏ విధంగా స్పందించింది? చిన్నపాటి ఆందోళన కూడా వ్యక్తం చేయలేదు. ఏ పాటి శ్రద్ధా కనపరచలేదు. ఆ నిర్ధారణలను మొత్తంగా తిరస్కరించింది. ఒక కేంద్ర క్యాబినెట్ మంత్రి ఏకంగా హాస్యాస్పదమైన, తెలివితక్కువ వ్యాఖ్యలు కూడా చేశారు. ఈ ప్రపంచ ఆకలి సూచికను లెక్కించడానికి నాలుగు కొలబద్దలను ప్రాతిపదికగా తీసుకుంటారు. అవి (1) పోషకాహార లోపం, (2) 5 ఏళ్ళలోపు పిల్లల్లో మరణాల రేటు, (3) పిల్లల్లో ఎదుగుదల లేకుండా గిడసబారిపోవడం, (అంటే వయస్సుకు తగ్గ ఎత్తుకు ఎదగకపోవడం), (4) పిల్లల్లో కృశించిపోయే లక్షణం (అంటే ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం). ఆకలి సూచిక లెక్కకు పెద్దవాళ్ళను కాకుండా పిల్లల పరిస్థితినే అతిగా లెక్కలోకి తీసుకున్నారన్న ప్రభుత్వ వాదన కాసేపు సరైనదే అనుకుందాం. కాని, తక్కిన ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే మన దేశంలో పిల్లల పరిస్థితి చాలా ఘోరంగా ఉన్నదన్న చేదు వాస్తవాన్ని ఆకలి సూచిక వెల్లడిస్తోంది. దానిని ఏ మాత్రమూ నిర్లక్ష్యం చేయలేం. అటువంటప్పుడు ప్రభుత్వం చెప్పే సాకుల ప్రాతిపదికన ప్రపంచ ఆకలి సూచిక నిర్ధారణలను తోసిపుచ్చడం ఏ మాత్రమూ తగదు.

ఇంతకూ సదరు మంత్రిగారేమని సెలవిచ్చారు? రోజంతా ప్రయాణంలో ఉన్నందువల్ల తానూ ఆకలిగా ఉన్నానని, ఒకవేళ ఎవరైనా ఫోను చేసి అడిగితే ఆ విషయాన్నే చేప్పే దానినని, అప్పుడు తానూ పోషకాహార లేమితో బాధపడుతున్న వ్యక్తిగానే లెక్కించబడతానని ఆమె అన్నారు. ఆకలి సూచికను లెక్కించడానికి మన దేశంలో 3వేల మంది నుండి మాత్రమే వివరాలు సేకరిస్తారు గనుక ఆ సూచిక నిర్ధారణలను పట్టించుకోనక్కరలేదని అమె అన్నారు.

ఈ సందర్భంలో మూడు విషయాలను స్పష్టం చేయాలి. ప్రపంచ ఆకలిసూచికను లెక్కించడానికి ఉపయోగించే కొలబద్దల్లో పోషకాహార లభ్యత అన్నది ఒక్క కొలబద్ద మాత్రమే. పైగా పోషకాహార లేమిని లెక్కించడానికి కేవలం వ్యక్తులు చెప్పినదాన్నే కాకుండా అధికారికంగా ప్రభుత్వాలు రూపొందించే సమతుల్యాహార లభ్యత గణాంకాలను కూడా లెక్కలోకి తీసుకుంటారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక వినిమయదారుల ఖర్చు తీరుతెన్నులను సేకరించే విధానానికి స్వస్తి చెప్పింది. కనుకనే నేరుగా కొంతమందిని కలిసి వారి నుండి వివరాలు సేకరించవలసిన అగత్యం ఏర్పడింది.

గత కొన్నేళ్ళుగా ప్రపంచ ఆకలిసూచికలో మన స్థానం అధమ స్థాయిలో ఉంటోంది. అది కూడా దిగజారుతూ వస్తోంది. ఒకవైపు ఆకలి తీవ్రత, ఆకలిగొన్నవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతూ వుండడం, మరొక వైపు మన జిడిపి నానాటికీ పెరుగుతూ వుండడం-ఈ రెండు ధోరణులూ ఏక కాలంలో వ్యక్తం ఔతున్నాయి. ఈ ధోరణి నయా ఉదారవాద విధానాలతోపాటు కానవస్తోంది. ఈ ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రాకముందు నుండీ ఇదే ధోరణి ఉంటూ వచ్చింది. వాళ్ళు అధికారంలోకి వచ్చాక ఆ ధోరణి మరింత ముదిరింది.

కొందరు వ్యక్తుల నుండి సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందించడం వల్ల ఈ ఆకలి సూచికను మంత్రిగారు తప్పుబట్టారు. వినిమయదారుల సర్వేకు బీజేపీ ప్రభుత్వం స్వస్తి చెప్పింది గనుకనే ఆ వ్యక్తిగత సర్వే అవసరమైంది. పైగా బీజేపీ అధికారంలోకి రాకముందు నుండీ ఆకలి సూచికలో మన స్థానం దిగజారుతూ వస్తోంది. అందుచేత మంత్రిగారి వాదన చెల్లదు. పైగా, ఈ సూచికను రూపొందించడం కోసం అన్ని దేశాల్లోనూ వ్యక్తుల నుండి సమాచారం సేకరిస్తున్నారు. చాలా దేశాల్లో మనకున్న గణాంక వ్యవస్థ వంటి పటిష్టమైన వ్యవస్థలు లేకపోవడమే దానికి కారణం. ఇక మన స్థానం దిగజారిపోవడం అనే ధోరణి వ్యక్తుల నుండి సమాచారం సేకరించే పద్ధతిని అనుసరించక ముందునుంచీ కనిపిస్తూ వుంది.

ఒక పక్క మన జిడిపి పెరుగుతున్నప్పటికీ, పలు సంస్థలు వేర్వేరు ఆధారాల ప్రాతిపదికలను ఉపయోగించి రూపొందించిన సూచికలు మన దేశంలో పోషకాహార లేమి ఎక్కువగా ఉన్నదని, పైగా నానాటికీ అది మరింత ఎక్కువగా పెరుగుతోందని సూచిస్తున్నాయి. ఈ వాస్తవాన్ని చాలా తీవ్రంగా పరిగణించాలి. మన దేశాన్నేలుతున్న ఫాసిస్టు తరహా ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తూ ఆ సూచికల నిర్ధారణలను తిరస్కరిస్తోంది. తద్వారా తన అసలు స్వభావాన్ని బయట పెట్టుకుంటోంది. ఈ ధోరణి ఇదేవిధంగా కొనసాగితే, మన దేశంలో చాలా శ్రద్ధతో పలు దశాబ్దాల కృషితో నిర్మించుకున్న గణాంక వ్యవస్థను ఈ ప్రభుత్వం అతి త్వరలోనే నాశనం చేయకమానదు. ◆

(స్వేచ్ఛానుసరణ)

రామ్‌మందిర్ ట్రస్ట్‌కి విదేశీ నిధులు

కేంద్ర ప్రభుత్వం శ్రీరామ్ జన్మభూమి తీర్థ్ క్షేత్ ట్రస్ట్‌కి విదేశీ నిధులు పొందడానికి అనుమతి మంజూరు చేసింది. విదేశీ నిధులు పొందడానికి 'విదేశీ నిధుల నియంత్రణ చట్టం' ప్రకారం ప్రభుత్వ లైసెన్స్ పొందడం తప్పనిసరి. ఈ నెల 18న ఆ లైసెన్స్‌ని ట్రస్ట్ పొందిందని ఆ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు. 'స్వదేశీ నిధుల ద్వారా పొందిన నిధుల్లోంచే రూ.900 కోట్లతో ఆలయ మొదటి అంతస్తు నిర్మాణం జరిగింది. ఆ నిధుల్లో ఇంకా రూ.3 వేల కోట్ల దాకా వివిధ డిపాజిట్ల కింద ఉన్నాయి. డిసెంబర్ వరకు ఆలయ నిర్మాణం పూర్తవుతుంది. 2024 జనవరి చివర్లో ప్రధాని నరేంద్ర మోడీ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేస్తారు. రాముడి విగ్రహం ఫొటోను 10 లక్షల కుటుంబాలకు అందజేయడం మా లక్ష్యం. దాంతో పాటు 5 లక్షల గ్రామాలకి అక్షింతలు పంచుతాం. వీటన్నింటి కోసం ఉన్న నిధులతో పాటు విదేశీ నిధుల వినియోగం జరుగుతుంది' అని చంపత్ రాయ్ తెలిపారు.



ఇదంతా చూస్తుంటే మనకు ఏం అర్థమవుతోంది. ఈ అక్షింతల వితరణ ద్వారాగాని, ఫొటోలు పంచడం వలన గాని, ప్రజలకు లేదా సమాజానికి, దేశానికి గాని ఏమైనా ఉపయోగం ఉందా? ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది. అక్షింతలు తలపై చల్లుకోవడం, ఫొటోకి ఫ్రేమ్ కట్టించి పూజగదిలో పెట్టి దండం పెట్టుకోవడానికి తప్ప మరో దానికి పనికిరాదు. ఇది నిరుద్యోగాన్ని పోగొట్టి ఉద్యోగ కల్పన కలిగించదు. ధరలను కానీ ఆర్థిక మాంద్యాన్ని కానీ తగ్గించదు. అందుకు బదులుగా ఈ నిధులను సమాజహితం కోసం ఉపయోగించవచ్చు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రారంభించడం ద్వారా కానీ, లేదా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడం ద్వారా కొన్ని వేలమందికి ఉద్యోగాలు కల్పించొచ్చు. కానీ ఇందుకు భిన్నంగా దేవుడు, భక్తి అని మూఢనమ్మకాలని ప్రోత్సహించడం సరైనది కాదు. సరే రామజన్మ భూమి ట్రస్ట్‌కి విదేశీ నిధుల కోసం లైసెన్స్ ఇస్తే ఇచ్చారు, కానీ బాధాకరమైన విషయమేమిటంటే 2020లో సమాజహితం కోసం పనిచేసే పదివేల ప్రభుత్వేతర సంస్థల ఎన్‌జీఓల లైసెన్సులను రద్దు చేసారు. 2022లో మరో 6000 సంస్థల లైసెన్సులు రద్దయ్యాయి ఇందులో ఎన్‌జీఓ సంస్థలతో పాటు ప్రఖ్యాతి పొందిన మదర్‌థెరిసా సంస్థ అయిన మిషనరీస్ ఆఫ్ చారిటీస్‌తో పాటు, ప్రభుత్వ సంస్థలైన ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఐఐటీ ఢిల్లీ, జామియా మిలియా విశ్వవిద్యాలయం, ఆక్స్‌ఫామ్ ఇండియా లాంటి ప్రముఖ సంస్థలు కూడా ఉన్నాయి. ఐటీ ఢిల్లీ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, జామియా మిలియాల విదేశీ నిధులు ఆపడమంటే పేదలకి, అట్టడుగు వర్గాలకి అతి తక్కువ ఖర్చుతో లభించే ఉన్నత విద్యను వారికి దూరం చేయడమే.

ఈ విద్యాలయంలో చదివి విదేశాలలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు ఈ నిధులను తమ విద్యాలయాల బాగుకోసం నిధులను పంపుతుంటారు. సహజంగా ఎన్‌జీఓ సంస్థలు, పేద, వీధి బాలల, ఆదివాసి, గిరిజనుల ఉన్నతికి పనిచేస్తుంటాయి. తిండి, బట్ట, గూడు కల్పిస్తుంటాయి. వైద్య, విద్య సౌకర్యాలు కల్పిస్తుంటాయి. వీటి విదేశీ నిధులను ఆపడమంటే... తాను పెట్టదు, పెట్టేవాళ్ళని పెట్టనీయదు అన్నట్లుగా ఉంది. ఈ మధ్యనే థింక్ ట్యాంక్ అనబడే 'సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్' తో పాటు పిల్లలు, మహిళలు ఇంకా లైంగిక హింసతో బాధపడే వారి కోసం పనిచేసే మరో మూడు ఎన్‌జీఓల లైసెన్స్‌లు రద్దు చేయబడ్డాయి. హందర్డ్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఐఐటీ ఢిల్లీ, ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్, నేషనల్ ఫౌండేషన్ ఫర్ కమ్యూనల్ హార్మొనీ, ఢిల్లీ కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్, గోవా ఫుట్‌బాల్ అసోసియేషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ (కలకత్తా), దేశవ్యాప్తంగా సుమారు డజన్ ఆస్పత్రులు నిర్వహిస్తున్న ఇమ్మానుయేల్ ఆసుపత్రి అసోసియేషన్ కూడా ఉన్నట్లు 'న్యూస్ క్లిక్' సమాచారమని 'ది వైర్' పేర్కొంది. ఏది ఏమైనా రామ్ మందిర్ ట్రస్ట్‌కి విదేశీ నిధుల లైసెన్స్ ఇస్తే ఇచ్చారుగాని, ఇతరుల లైసెన్సులు రద్దు చేయటం మాత్రం అన్యాయం. ◆

'ది వైర్' నుండి సేకరణ : పలకంశెట్టి జయప్రకాశ్
సెల్ : 837485426

తెలంగాణలో ఉన్నది ఫ్రెండ్లీ ప్రభుత్వమేనా!?


జె. వెంకటేష్
9490098658

రాష్ట్ర అసెంబ్లీకి 2023 నవంబర్ 30న ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలను, అందులోనూ 3 కోట్ల 17 లక్షల మంది ఓటర్లను ఆకర్షించేందుకు ఎన్నికల మేనిఫెస్టోలను సిద్ధం చేస్తున్నాయి. అధికార బీఆర్‌ఎస్ పార్టీ అక్టోబర్ 15న ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ, వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల మేనిఫెస్టోల కోసం కసరత్తు చేస్తున్నాయి. బీఆర్‌ఎస్ తన మేనిఫెస్టో మత గ్రంథాలకంటే పవిత్రమైనదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు గొప్పగా ప్రకటించారు. గౌరవ ముఖ్యమంత్రి సాధారణ ఓటర్లను ఆకర్షించేందుకు అనేక వాగ్దానాలను బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో ప్రకటించారు. బీఆర్‌ఎస్ ఘనమైన మేనిఫెస్టోలో రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు సేవలందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర కేటగిరీల్లోని సిబ్బంది న్యాయసమ్మతమైన సమస్యలను మేనిఫెస్టోలో చేర్చకపోవడం యాధృచ్ఛికం కాదు. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని తెలంగాణతో సహా దేశవ్యాప్త ఉద్యమం జరుగుతున్న ప్రస్తుత స్థితిలోనూ ఎన్‌పిఎస్ రద్దు కోసం ఒక కమిటీని వేస్తానని ముఖ్యమంత్రి చేతులు దులుపుకోవడం విడ్డూరం. హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల్లో ఎన్‌పిఎస్ రద్దు చేసిన అనుభవాలు ఉన్నప్పటికీ ఎన్‌పి ఎస్‌పై కమిటీ పేరుతో వ్యూహాత్మకంగా వ్యవహరించామనుకున్నప్పటికీ నూతన పెన్షన్ విధానం వర్తించే ఉద్యోగుల్లో తీవ్ర విమర్శల పాలైంది.

ఉద్యోగుల పట్ల ప్రభుత్వ అడ్డగోలు వాదనలు

ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారింది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా జీతాలు చెల్లిస్తున్నామని, మాదీ ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెబుతూనే మరోవైపు పిఆర్‌సి పెంపు ప్రభుత్వానికి ఆర్థిక భారమని పదేపదే ప్రస్తావిస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉందని, అప్పులు చేయడానికి కేంద్రం విధించిన ఎఫ్‌ఆర్‌బిఎం చట్టం అడ్డంకిగా ఉందని చెబుతోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ అని చెబుతున్న పాలకులకు ఈ కృషిలో ఉద్యోగుల పాత్ర ప్రముఖంగా ఉందన్నది తెలంగాణ సమాజం యావత్తు గమనిస్తున్నది. అయినా ఉద్యోగుల జీతాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాల గురించి చులకన చేస్తూ ప్రభుత్వం మాట్లాడటం అన్యాయం. ప్రజల ముందు పారదర్శకంగా వాస్తవాలు తెలిపితే తప్పే మీలేదు. రాష్ట్ర జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య గురించి బీఆర్‌ఎస్ ఎందుకు మాట్లాడదు? 9 ఏళ్ళుగా ప్రభుత్వ ఉద్యోగులపై పడుతున్న పని భారం గురించి ఎందుకు స్పందించదు. ద్రవ్యోల్బణం, విద్య, వైద్యం, రవాణా, నిత్యావసర సరుకులు, ఇతర ఖర్చులు ఏ స్థాయిలో పెరుగుతున్నదీ అన్నింటినీ సమగ్రంగా పరిశీలించి పూర్తి నిర్ధారణలకు రావాలి. అదే విధంగా ఏయే రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు మన తెలంగాణకు ఉన్న వ్యత్యాసం శ్వేతపత్రం విడుదల చేస్తే ప్రజలకు సమగ్రత వస్తుంది. దీన్ని విస్మరించి సందర్భం వచ్చినప్పుడల్లా ప్రభుత్వ ఉద్యోగులను కించపర్చడం ఫ్రెండ్లీ ప్రభుత్వమని ప్రచారం చేసుకునే బీఆర్‌ఎస్ పార్టీకి సబబుకాదు.

ప్రచారార్భాటం - వాస్తవ విరుద్ధం

ధనిక రాష్ట్రమని, ఆదాయానికి లోటు లేదనీ అనేక సార్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో నిజముంటే ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు, ఇతర సౌకర్యాలు మెరుగ్గా ఉన్నా ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీ లేదు. కానీ ద్వంద్వ ప్రమాణాలు, అవకాశవాద ప్రకటనలు చేయడం తెలంగాణ సమాజాన్ని మోసగించడమే అవుతుంది. ఉద్యోగులు మాకు వ్యతిరేకంగా ఉన్నారు, ఓట్లు ఎలాగూ వెయ్యరు కాబట్టి ఉద్యోగుల సమస్యలు విస్మరించినా నష్టం లేదన్న రీతిలో ప్రభుత్వ పెద్దలున్నట్లు మీడియాలో వార్తలొచ్చాయి. వీటిని ప్రభుత్వ పరంగానూ, బీఆర్‌ఎస్ పార్టీగాను ఖండించింది లేదు. దీంతో పాటు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ప్రభుత్వ నిర్ణయాలు ఈ వాదనలను బలపర్చేవిగా ఉన్నాయి.



తెలంగాణ రాష్ట్ర ఎన్నికలకు ముందు 2023 జూలైలో జరిగిన చిట్టచివరి అసెంబ్లీ సమావేశాల్లో గౌరవ ముఖ్యమంత్రి రాష్ట్ర 2వ పిఆర్‌సి కమిటీ వేస్తామని ప్రపంచం అబ్బురపోయే ఐఆర్ ప్రకటిస్తామని ఘనంగా ప్రకటించారు. చివరికి 2023 అక్టోబర్ 2న 5 శాతం ఐఆర్‌తో సరిపెట్టడం దేశంలోకెల్లా వింతే. వాస్తవంగా ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులకు 3 డిఎలు ఇవ్వాలి. ఇవి ఇచ్చినా సుమారు 6 శాతం అయ్యేవి. డిఏలను కూడా ఏండ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం ఈ ప్రభుత్వానికే చెల్లింది. ఆర్‌టిసి ఉద్యోగులకు 2 పే-స్కేల్స్‌తో పాటు 3 డిఏలు కూడా పెండింగ్‌లో పెట్టింది. ఉద్యోగులు దాచుకున్న జి.పి.ఎఫ్ నుండి పిల్లల చదువులకోసం, ఆరోగ్యం కోసం, ఇల్లు కట్టుకోవడం కోసం లోనుకు అప్లై చేస్తే రెండేండ్లయినా మంజూరు చేయడం లేదు. సరెండర్ లీవు, సప్లిమెంటరీ బిల్లులు పాస్ కావడం లేదు. అందుకే ఆర్‌టిసి సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో విలీనం చేసే నిర్ణయం పట్ల కూడా తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారమై రెండేండ్లు దాటింది. అయినా తెలంగాణ ఉద్యోగులకు ఇండ్ల స్థలాలు కేటాయించలేదు. జాప్యానికి కేసులు కొంత కారణమైతే, ప్రభుత్వం జీఓ విడుదల చేయడానికి కూడా తీవ్రమైన జాప్యం చేస్తున్నది. ఇంత ముఖ్యమైన నిర్ణయం పట్ల ప్రభుత్వం మౌనం వహించడం ఉద్యోగుల్లో అసహనం, అసంతృప్తిని పెంచింది. ఉద్యోగులకు వైద్య సేవలు గొప్పగా ఉన్నాయంటున్నది ప్రభుత్వం. కానీ ఇప్పటికే వెల్‌నెస్ సెంటర్లు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయి. కనీసం వైద్యానికి కూడా ఉద్యోగులు నోచుకోవడం లేదు. ప్రతిష్టాత్మక నిమ్స్ హాస్పిటల్‌లో హెల్త్ కార్డులున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు చికిత్స కాదు కదా కనీసం టెస్ట్‌లు కూడా చేయని దుస్థితి ఉన్నది. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను హడావిడిగా ప్రవేశపెట్టడం కూడా ఉద్యోగులను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది,

> బంగారు తెలంగాణాలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఈ విధంగా సాక్షాత్కరించగా రాష్ట్రంలో అత్యధిక వేతనాలు పొందుతున్నారని సకల సౌకర్యవంతంగా జీవిస్తున్నారని, ప్రచారం చేయడం ప్రభుత్వానికి సబబు కాదు. 2023లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయని ముందుగా తెలిసినప్పటికీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఉద్యోగుల సమస్యలను మరుగున పెట్టింది. కపట ప్రేమ నటించింది. ప్రభుత్వానికి ఓట్లపై ఉన్న శ్రద్ధ ఉద్యోగుల సమస్యల పట్ల లేకపోవడమే ఈ స్థితికి కారణం. గొప్ప గొప్ప సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని దేశమంతటా ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వానికి తెలంగాణ 4కోట్ల ప్రజానీకానికి ఉద్యోగులందిస్తున్న సేవల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గత తొమ్మిదేండ్లుగా తీవ్రమైన పనిభారంతో సతమతమవుతున్నారు. కనీస వేతనాలు 2018 నుండి పెరగాల్సి ఉండగా 2021 జూలై నెలలో జీఓ నెం.60 ప్రకారం వేతనాలు పెంచినప్పటికీ రెండేండ్లు గడిచినా 12 ప్రభుత్వ శాఖల్లో జీవో అమలు కాకపోవడం అన్యాయం. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ఉద్యోగులకు రెన్యువల్ విధానం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుండి 2017 వరకు ఏడాదికొక్కసారి మాత్రమే రెన్యువల్ విధానం అమలులో ఉండేది. 2018 నుండి ఆరు నెలలకొకసారి రెన్యువల్ పద్ధతి మార్చడం వల్ల ఈ ఉద్యోగులు తీవ్ర అభద్రత లో ఉన్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీలు కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీ చేస్తున్నా ప్రభుత్వ శాఖల హెచ్‌ఓడిలు అదుపు చేసే పరిస్థితి లేదు.

2021 నుండి ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు (హైదరాబాద్ మొదలుకొని జిల్లాల వరకు) ప్రతినెలా 15వ తేదీ వరకు ఎదురు చూపులు తప్పడం లేదు. 60 సంవత్సరాలు సర్వీస్ చేసి రిటైరైన ఉద్యోగులకివ్వాల్సిన పెన్షన్ కూడా ప్రతినెలా 15వ తేదీనే చెల్లించడం ప్రభుత్వానికే అవమానకరం. 33 జిల్లాలు ఏర్పడ్డాక సిబ్బందిని పెంచాల్సింది పోయి 2014 తెలంగాణ ఏర్పడ్డ నాటికి ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో పని భారం ఉద్యోగులకు తీవ్రంగా పెరిగింది. రాష్ట్రంలో 1,90,000 ప్రభుత్వ ఖాళీలు ఉండగా గడిచిన 9 ఏండ్లలో 30 వేల లోపు ఉద్యోగాలు భర్తీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకున్నది. పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల్లో సరిపడే సిబ్బందిని నియమించకుండా ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్స్ కోసం తెచ్చిన జీవో నెం.317 ప్రకారం సుమారు 50 వేల మందికి అన్యాయం జరిగిందని ఉద్యోగులు వాపోతున్నారు.

బంగారు తెలంగాణాలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఈ విధంగా సాక్షాత్కరించగా రాష్ట్రంలో అత్యధిక వేతనాలు పొందుతున్నారని సకల సౌకర్యవంతంగా జీవిస్తున్నారని, ప్రచారం చేయడం ప్రభుత్వానికి సబబు కాదు. 2023లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయని ముందుగా తెలిసినప్పటికీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఉద్యోగుల సమస్యలను మరుగున పెట్టింది. కపట ప్రేమ నటించింది. ప్రభుత్వానికి ఓట్లపై ఉన్న శ్రద్ధ ఉద్యోగుల సమస్యల పట్ల లేకపోవడమే ఈ స్థితికి కారణం. గొప్ప గొప్ప సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని దేశమంతటా ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వానికి తెలంగాణ 4 కోట్ల ప్రజానీకానికి ఉద్యోగులందిస్తున్న సేవల పట్ల చిత్తశుద్ధి ప్రదర్శించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. 2023 రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న తరుణంలోనైనా ఉద్యోగులు తమ రాజకీయ అనుబంధాలకతీతంగా వాస్తవిక దృష్టితో బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యోగ వ్యతిరేక వైఖరిని సాకల్యంగా అర్థం చేసుకోవాలి. ఉద్యోగుల సమస్యల పట్ల తెలంగాణ సమాజం సానుభూతితో అర్థం చేసుకోవడం అవసరం. ◆

ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో ఫిన్‌కేర్ ఎస్ఎఫ్‌బీ విలీనం

ముంబయి : ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ విలీనం కానుంది. దీనికి పలు అనుమతులు లభిస్తే 2024 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుందని ఎయు ఎస్ఎఫ్‌బి పేర్కొంది. తాజా ఒప్పందంతో ఫిన్‌కేర్‌లో ఉన్న ప్రతి 2,000 షేర్లకుగానూ ఎయు ఎస్ఎఫ్‌బిలో 579 షేర్లు వాటాదారులకు లభిస్తాయి. ఈ ప్రక్రియ పూర్తయితే ఫిన్‌కేర్ వాటాదారులకు ఎయులో 9.9 శాతం వాటా లభించనుంది. ఈ ఒప్పందానికి ఆర్‌బిఐ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆమోదం లభించాల్సి ఉందని ఎయు ఎస్ఎఫ్‌బి పేర్కొంది. తాజా పరిణామంతో ఫిన్‌కేర్ రూ.625 కోట్ల ప్రతిపాదిత ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ నిలిచిపోనుంది.

ఐక్విప్పోతో భారత్ బెంజ్ ఒప్పందం

చెన్నయ్ : తన ప్రీ-ఓన్డ్ వాణిజ్య వాహనాల వినియోగదారులకు డిజిటలైజ్డ్ పరిష్కారాలను అందించేందుకు ఐక్విప్పోతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు డైమ్లెర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్‌కు చెందిన భారత్ బెంజ్ తెలిపింది. ఈ భాగస్వామ్యం భారత్ బెంజ్ వినియోగదారులకు వారు ఉపయోగించిన వాహనాలను తక్కువ సమయంలో మార్పిడి చేసుకునేందుకు, మెరుగైన పున విక్రయ విలువను పొందేందుకు మద్దతును అందిస్తుందని పేర్కొంది.

జీ మాజీ చీఫ్‌కు ఎస్ఏటిలో ఉపశమనం



ముంబయి : నిధుల దారి మళ్లింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న జీ ఎంటర్‌టైన్‌మెంట్ మాజీ సిఇఒ పునీత్ గోయెంకాకు సెక్యూరిటీ అప్పిల్లేట్ ట్రిబ్యునల్ (ఎస్ఎటి)లో ఉపశమనం లభించింది. నిధులను దుర్వినియోగంపై పునీత్ గోయెంకాపై ప్రస్తుతం సెబీ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆయన ఎలాంటి కీలక పదవులు చేపట్టొద్దంటూ నిషేధం విధించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన ఎస్ఎటిని ఆశ్రయించగా.. తాజాగా అక్కడ ఆయనకు ఊరట లభించింది. దీంతో గోయెంకా మళ్లీ జీ గ్రూప్‌లో మళ్లీ కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం దక్కనుంది.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



- ఐకెఎంసి సదస్సులో వక్తలు

హైదరాబాద్ : పర్యావరణ రక్షణ బాధ్యత అందరి లక్ష్యమని ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్ (ఐకెఎంసి) 2023 సదస్సులో వక్తలు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సదస్సు తొలి రోజున బిరాక్ ఎండి జితేంద్ర కుమార్, ఐఐటి హైదరాబాద్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ దేశాయ్ స్టార్టప్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం భూగోళం వాతావరణ మార్పులు, సుస్థిరత సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. అనంతరం తెలంగాణ పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ అధ్యక్షతన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది.

అంతరాష్ట్ర గంజాయి, హెరాయిన్ స్మగ్లర్ల అరెస్ట్

- రూ. 2 కోట్ల విలువగల 710 కేజీల గంజాయి గంజాయి పట్టివేత
- మరోచోట రూ. 50 లక్షల విలువ గల హెరాయిన్ స్వాధీనం..



నవతెలంగాణ-హయత్ నగర్/ చందానగర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఔషాపూర్ చెక్ పోస్ట్ వద్ద ఘట్‌కేసర్ పోలీసుల సహకారంతో మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు రూ. 2 కోట్ల విలువగల 710 కేజీల గంజాయిని పట్టుకున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌లో రూ. 50 లక్షల విలువ గల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ సీపీ దేవేందర్ సింగ్ చౌహన్ వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన సుభాష్ బిస్నోయ్ వృత్తి రీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్నాడు. ఈ క్రమంలో ఒడిశా నుంచి హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్రకు ఒక్క లోడుకు రూ. 60వేల చొప్పున మాట్లాడుకుని 500 కేజీల గంజాయిని డ్రగ్ పెడ్లర్‌కు అప్పగించాడు. మరోసారి డ్రగ్ పెడ్లర్ సూచనల మేరకు సుభాష్ బిస్నోయ్ ఈనెల 24న ఒడిశాలోని నబరంగ్ పూర్‌కు వెళ్లి సరఫరాదారుని నుంచి 710కేజీల గంజాయి సేకరించాడు. దాన్ని లారీ క్యాబిన్ బాడీ మధ్యలో పెట్టి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నాడు. ఇదిలా ఉండగా కొన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు వారం, పది రోజులుగా రెక్కీ నిర్వహిస్తున్న పోలీసులు.. విశ్వసనీయ సమాచారం మేరకు ఈనెల 29న పోలీసులు మాటువేసి.. ఘట్‌కేసర్ వద్ద ఉన్న ఔషాపూర్ చెక్‌పోస్ట్ వద్ద సుభాష్ బిస్నోయ్‌ను పట్టుకున్నారు. మొత్తం రూ. 2,25,50,000 విలువ గల గంజాయి కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. తదనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మరో ఘటనలో.. మీర్‌పేటలోని ఎన్‌బీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన భన్వర్ లాల్, విష్ణు బిస్నోయ్‌తోపాటు మరో ఇద్దరు మైనర్లతో కలిసి.. మత్తుకు బానిసై హెరాయిన్‌కు అలవాటు పడిన వారికి ఓ ప్రయివేటు కొరియర్ ద్వారా సరఫరా చేసేవారు. ఈ క్రమంలో వారిని మీర్‌పేటలో ఎల్‌బీనగర్ జోన్ ఎస్ఓటీ, మీర్‌పేట పోలీసులు సంయుక్తంగా కలిసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 80 గ్రాముల హెరాయిన్, ఒక ద్విచక్ర వాహనం, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ రూ. 50 లక్షలు ఉంటుందని సీపీ చెప్పారు. ప్రధాన నిందితుడు, వినియోగదారుడు పరారీలో ఉన్నట్టు, అతని కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీపీ వెంట ఎల్‌బీనగర్ జోన్ ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ఎల్‌బీ నగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి, మహేశ్వరం ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్‌లు స్వామి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో జనసేన లొల్లి

- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి సీట్లు ఇవ్వొద్దని ఆందోళన
- తమకు సీట్లు కేటాయించకపోవడంపె నేతల ఆగ్రహం
- ఈటల టార్గెట్‌గా అసమ్మతి రాగం తీవ్రం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో టికెట్ల లొల్లి ముదిరిపాకాన పడింది. పొత్తుల పంచాయతీ శ్రేణుల ఆగ్రహానికి కారణమవుతున్నది. జనసేనకు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలు కేటాయిస్తున్నారనే ప్రచారం కాస్తా బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడికి దారితీసింది. పవన్‌కళ్యాణ్ పార్టీకి తెలంగాణలో సీట్లు కేటాయింపు అంశం నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. మరోవైపు ఆయా నియోజకవర్గాల్లో టికెట్లు దక్కని నేతల ధిక్కారస్వరం రోజురోజుకీ పెరగటం కలవరపెడుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాలో టిక్కెట్లు దక్కని హార్డ్‌కోర్ బీజేపీ నేతలు ఈటలపై దుమ్మెత్తిపోస్తుండటం గమనార్హం.

బీజేపీ రాష్ట్ర కార్యాలయం నేడు ఆందోళనల కేంద్రంగా మారింది. ఏ క్షణాన ఏ నాయకుడు ఏ రూపంలో నిరసనలు తెలుపుతాడో అర్థంకాక రాష్ట్ర నాయకత్వం సతమతం అవుతున్నది. వారికి సర్దిచెప్పలేక తలలు పట్టుకుంటున్నది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సెటిలర్లు ఎక్కువగా ఉండే కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మల్కాజిగిరి, ఎల్‌బీనగర్, తదితర నియోజకవర్గాలను పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించబోతున్నట్టు జరుగుతున్న ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లో అగ్గి రాజేసింది. జనసేనకు కూకట్ పల్లి టికెట్ కేటాయించవద్దని మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి రాష్ట్ర కార్యాలయంలోనే సోమవారం ఆందోళనకు దిగారు. 'వీ వాంట్ జస్టిస్' అంటూ ఆ నియోజకవర్గం శ్రేణుల నినాదాలు మార్మోగిపోయాయి. బీజేపీలో టికెట్ ఆశిస్తున్న నలుగురిలో ఎవరికిచ్చినా కలిసికట్టుగా పనిచేస్తాంగానీ, జనసేనకు మాత్రం ఇవ్వొద్దని డిమాండ్ చేస్తున్నారు. జనసేనకే ఇస్తే ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటాయని హెచ్చరిస్తున్నారు. శేరిలింగంపల్లి సీటును జనంలేని జనసేనకు ఏ ప్రాతిపదికన ఇస్తారంటూ బీజేపీ శ్రేణులు రాష్ట్ర నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. నాయకత్వ తీరుతో క్యాడర్‌లో తీవ్ర అసహనం మొదలైంది. రవియాదవ్ నేతృత్వంలో ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో ఆందోళన చేసిన విషయం విదితమే.

ఈటల టార్గెట్‌గా అసమ్మతి

ఈటల వర్సెస్ బండి సంజయ్‌గా సాగుతున్న ఆధిపత్యపోరు మరింత తీవ్రమైంది. ఈటల టార్గెట్‌గా అసమ్మతి గ్రూపు మరింత దూకుడు పెంచుతున్నది. నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా ఎర్రగొల్ల మురళీ యాదవ్‌ను ప్రకటించడం దీనికి ఆజ్యం పోసింది. ఆయన్ను కచ్చితంగా మార్చాల్సిందేనని టికెట్ ఆశించి భంగపడ్డ మరో నేత గోపి, అతని అనుచరులు రాష్ట్ర కార్యాలయం వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. బెల్లంపల్లి అభ్యర్థి శ్రీదేవిని కూడా మార్చాలని ఆ నియోజకవర్గం బీజేపీ శ్రేణులు కూడా ఆందోళనకు దిగాయి. అక్కడ కొయ్యల ఏమాజి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. మూడో లిస్టులో టికెట్ ఆశిస్తున్న నాయకులు రాష్ట్ర నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారికి టికెట్లు దక్కకపోతే పరిస్థితి ఎటు దారితీస్తుందో అని నాయకత్వం దిగులుచెందుతున్నది.

పార్టీని హోల్‌సేల్‌గా అమ్మే కుట్ర : గోపి

'రాష్ట్రంలో బీజేపీని హోల్‌సేల్‌గా అమ్మాలని ఈటల రాజేందర్ చూస్తున్నారు. ఆయన వచ్చాకే ఆధిపత్యపోరు మొదలైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని టికెట్లను తన అనుచరులకు ఇస్తానని ఆయన వాగ్దానం చేశారు. కష్టపడి పనిచేసిన బండిని, ఆయన అనుచరులను పక్కన పెట్టేశారు. 30,40 మంది కీలక నేతలను పార్టీ చేరుస్తామని ఝుటా మాటలు చెప్పిన వారి మాటల్ని నమ్మి మాకు అన్యాయం చేయడం సరిగాదు. ఢిల్లీకెళ్లి పైరవీలు చేసి బండి సంజయ్‌ని పదవి నుంచి తొలగించినప్పుడు ఈటలకు బీసీ నినాదం గుర్తుకురాలేదా? పని చేస్తున్న కార్యకర్తలను పక్కనపెట్టి దొంగలకు టికెట్లు ఇవ్వడమేంటి? నర్సాపూర్ టికెట్ ప్రకటించి పది రోజులు దాటినా ప్రచారం ఎందుకు మొదలు పెట్టలేదని అడిగితే..పైనుంచి అందాల్సినవి రాలేదని చెబుతున్నారు. అందాల్సినవేంటి?' అని గోపి అన్నారు. కొత్తగా పార్టీలో చేరిన నేతలు డిసెంబర్ 3 తర్వాత పార్టీలో ఉంటారా? అని ప్రశ్నించారు. జాతీయ నాయకులు తమకు న్యాయం చేయాలనీ, బండి సంజయ్ లాంటి నేతలను, తమను కాపాడుకోవాలని కోరారు.

పరిశ్రమల ఏర్పాటుపై పార్టీలు స్పష్టతనివ్వాలి



- కార్మిక సంఘ నేతలు
- "అసెంబ్లీ ఎన్నికలు- కార్మికుల మ్యానిఫెస్టో" అంశంపై సీఐటీయూ ఆధ్వర్యంలో సదస్సు

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లాలో ఉక్కు, బైరటిస్, సున్నం పరిశ్రమల ఏర్పాటు గురించి రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోల్లో చేర్చాలని జాతీయ కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'అసెంబ్లీ ఎన్నికలు- కార్మికుల మ్యానిఫెస్టో' అంశంపై సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రస్థాయి డిమాండ్లతో పాటు జిల్లా పరిధిలోని అనేక అంశాలపై చర్చించి వర్కర్స్ మేనిఫెస్టో రూపొందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శులు కుంట ఉపేందర్, రేషపల్లి నవీన్, హెచ్ లింగన్న మాట్లాడారు. రాష్ట్రంలోనే ఒక్క పరిశ్రమ కూడా లేని జిల్లా మహబూబాబాద్ అని అన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, గార్లలో బైరటిస్ పరిశ్రమ, గంగారంలో సున్నం పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా అనేక ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. జిల్లాకు కార్మిక శాఖ అధికారిని నియమించాలని, కేసముద్రంలో ఏఎల్ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, క్వారీ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, హమాలీ ట్రాన్స్‌పోర్ట్, స్ట్రీట్ వెండర్స్, మిర్చి తొడిమెలు తీసేటువంటి అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా, ఐకేపీ వీవోఏ, మధ్యాహ్న భోజన కార్మికులకు సామాజిక భద్రత చట్టాలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 30 శాతానికి పైగా ఉన్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలతో రూపొందించిన వర్కర్స్ మ్యానిఫెస్టోను పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులకు, రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులకు అందజేస్తామని వెల్లడించారు. సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాల జిల్లా నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీను, వాసం దుర్గారావు, నర్రా శ్రావణ్, దేవేందర్, బాబు, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రయివేటు సైన్యంపై చర్యలు

- రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ప్రయివేటు సైన్యంపై చర్యలు తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ టెలిఫోన్ ట్యాపింగ్‌తో పాటు హ్యాకర్స్‌ను ఉపయోగించి తమ ఫోన్‌లు హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. అందరి ఫోన్‌లు ట్యాప్ చేస్తూ హ్యాకర్స్‌ని కూడా కేటీఆర్ నియమించుకున్నారని విమర్శించారు. తమను నియంత్రించాలనుకుంటూ సహకరిస్తున్న వారిని బెదిరిస్తున్నారని తెలిపారు. తమ బంధువులను, మిత్రులను కూడా వదలడం లేదన్నారు. హరీష్.. కేటీఆర్.. కేసీఆర్.. అనైతికంగా వ్యవహారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సైన్యంలో పని చేస్తున్న అధికారులు విచారణ ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

మైనార్టీలకు బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదు? అసదుద్దీన్ కు రేవంత్ రెడ్డి ప్రశ్న

మైనార్టీలకు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు ఓటేయాలని మైనార్టీలను కోరేముందు అసద్ బీఆర్ఎస్‌ను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. అసద్ మైనార్టీల కోసం కాకుండా ప్రధాని మోడీ, బీజేపీల కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలో జేడీఎస్‌తో కలిసి పరోక్షంగా బీజేపీకి మేలు చేయాలని కుట్రలు చేసినా అక్కడ మైనార్టీల్లో 80 శాతం మంది కాంగ్రెస్‌కు ఓటేశారని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు బీజేపీకి తమకు సంబంధం లేదన్నట్టు చెప్పిన జేడీఎస్ ఆ తర్వాత బీజేపీతో కలిసిందని తెలిపారు. జీహెచ్ఎంసీలో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేస్తే 12 శాతమున్న మైనార్టీలకు 120 ఇండ్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు.

ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై దాడి దిగ్భ్రాంతికరం

- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో సోమవారం జరిగిన దాడి గురించి తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యాయని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. సోమవారం ఈ మేరకు రాజ్‌భవన్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదనీ, ఇలాంటి ఘటనలు వ్యవస్థకే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రచారకుల భద్రతకు మరిన్ని చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు.

ఓలా, ఉబర్ చెత్త వేదికలు

- గిగా వర్కర్ల పట్ల నిర్లక్ష్యం..!
- కనీస చెల్లింపులు, భద్రతలోనూ అంతంతే
- ఫెయిర్ వర్క్ ఇండియా రిపోర్ట్



న్యూఢిల్లీ : ఓలా, ఉబర్, పోర్టర్‌లను అత్యంత చెత్త వేదికలుగా గిగా వర్కర్స్ భావిస్తున్నారని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. టెక్నాలజీ రవాణ కంపెనీలు ఓలా, పోర్టర్‌కు కేవలం సున్నా పాయింట్లు, ఉబర్, డుంజోకు ఒక్క పాయింటు చొప్పున మద్దతు లభించిందని 'ఫెయిర్‌వర్క్ ఇండియా 2023' రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. ఆక్స్‌ఫర్డ్‌తో కలిసి సెంటర్ ఫర్ ఐటి అండ్ పబ్లిక్ పాలసీ (సిఐటిఎపిపి), ఐఐఐటి బెంగళూరు ఓ రిపోర్ట్‌ను రూపొందించాయి. గిగ్ వర్కర్ల పని పరిస్థితులను పరిశీలించి దీన్ని విడుదల చేశాయి. ఈ సంస్థలు పలు డిజిటల్ వేదికలపై మెరుగైన చెల్లింపులు, మంచి పరిస్థితులు, ఫెయిర్ కాంట్రాక్ట్స్, మంచి మేనేజ్‌మెంట్, ఫెయిర్ ప్రాతినిధ్యం (రిప్రజెంటేషన్) తదితర ఐదు అంశాలపై అమెజాన్ ఫ్లెక్స్, బిగ్ బాస్కెట్, బ్లుస్మార్ట్, డుంజో, ఫ్లిప్‌కార్ట్, ఓలా, పోర్టర్, స్విగ్గీ, ఉబెర్, అర్బన్ కంపెనీ, జెప్టో, జొమాటో తదితర 12 సంస్థలపై అధ్యయనం చేసి ఓ నివేదికను రూపొందించిందని బిజినెస్ స్టాండర్డ్ ఓ కథనం ప్రచురించింది. గిగా వర్కర్ల సౌలభ్యాలపై 10 పాయింట్లకు గాను స్కోర్ నిర్ణయంచింది. ఏ ఒక్క సంస్థ కూడా ఆరు పాయింట్లకు మించి సంపాదించుకోలేక పోయింది.

బిగ్ బాస్కెట్ అత్యధికంగా ఆరు పాయింట్లను సాధించగా.. ఆ తర్వాత స్థానాల్లో బ్లుస్మార్ట్, స్విగ్గీ, అర్బన్ కంపెనీ, జొమాటో సంస్థలు ఐదు పాయింట్ల చొప్పున నమోదు చేసుకున్నాయి. ఉబెర్ 10 పాయింట్లకు ఒక్క పాయింట్, ఓలా, పోర్టర్‌లు సున్నా పాయింట్లతో అథమ స్థానంలో నిలిచాయి. మెరుగైన చెల్లింపుల్లో ఏ ఒక్క సంస్థ కూడా స్కోర్ చేయలేదు. బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, అర్బన్ కంపెనీలు మాత్రమే కనీస వేతన విధానాన్ని కలిగి ఉన్నాయి. వాటి కార్మికులు ఇంధనం, వాహన నిర్వహణ, బీమా, డేటా వంటి పని సంబంధిత ఖర్చులతో సహా పని గంటల తర్వాత అదనపు పని గంటకు కనీస వేతనం పొందేలా చూసుకుంటున్నాయి. 12 వేదికల్లో ఏడు మాత్రమే కార్మికులకు 'ఫెయిర్ కాంట్రాక్ట్‌లను' అందిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదాలు, గాయాలు, దొంగతనం, నేరం. హింస, ప్రతికూల వాతావరణ పరిస్థితులు వంటి అనేక ప్రమాదాలను గిగ్ కార్మికులు ఎదుర్కొంటున్నారు. అమెజాన్ ఫ్లెక్స్, బిగ్‌బాస్కెట్, బ్లుస్మార్ట్, ఫ్లిప్‌కార్ట్, స్విగ్గీ, ఉబెర్, అర్బన్ కంపెనీ, జెప్టో, జొమాటోతో సహా 9 ప్లాట్‌ఫారమ్‌లు కార్మికులకు తగిన భద్రతా పరికరాలు, శిక్షణను అందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించేలా కృషి చేస్తున్నాయని ఈ రిపోర్ట్ పేర్కొంది. బిగ్ బాస్కెట్, స్విగ్గీ, జెప్టో, జొమాటో సంస్థలు మాత్రమే తమ వర్కర్లకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రమాద బీమాను కల్పిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు, ఇతర వైద్య కారణాల వల్ల వారు పని చేయలేని సందర్భాల్లో ఆదాయ నష్టానికి పరిహార మద్దతను అందిస్తున్నాయి. గిగా వర్కర్ల భద్రత, సంక్షేమం కోసం దేశంలో తొలిసారి రాజస్థాన్ ప్రభుత్వం మాత్రమే చట్టం చేసిందని ఈ రిపోర్ట్ గుర్తు చేసింది. ఇది వారికి సామాజిక భద్రత, ఇతర ప్రయోజనాలను కల్పిస్తుందని పేర్కొంది.

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరిన రమాదేవి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిర్మల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షురాలు పడకంటి రమాదేవి బీఆర్ఎస్ లో చేరారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. రమాదేవికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, ముధోల్ బీఆర్ఎస్ ఇంచార్జీ పురాణం సతీష్, తదితరులు పాల్గొన్నారు.





హార్టికల్చర్ హబ్ ఏమాయె..?

వరికి బదులు ఉద్యాన వంట సాగు పెంచాలని నిర్ణయం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పర్యటనలో సీఎం కేసీఆర్ హామీ
- రూ.250 కోట్లతో ప్రతిపాదనలు
- మూడేండ్లు కావస్తున్నా.. విడుదల కాని నిధులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తానన్న సీఎం కేసీఆర్ హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. దాదాపు మూడేండ్లు గడుస్తున్నా.. ఆ వైపుగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. జిల్లా ఉద్యాన శాఖ రూ.250 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి సర్కార్‌కు పంపింది. అయినా నేటికీ ఉద్యాన హబ్ అందుబాటులోకి రాలేదు. సీఎం కేసీఆర్ హామీ నీటి మూటగానే మిగిలిపోయిందని రైతులు అంటున్నారు.

అక్టోబర్ 29, 2020న హైదరాబాద్ నగర శివారు మూడుచింతలపల్లి మండల కేంద్రంలో ధరణి పోర్టల్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శివారు ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. వెంటనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. దాంతో జిల్లా ఉద్యానశాఖ అధికారులు 2020 నవంబర్‌లో ఉద్యాన హబ్ ఏర్పాటుకు ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది. ఇది జరిగి దాదాపు మూడేండ్లు కావస్తోంది. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఈ నెల 18వ తేదీన మేడ్చల్‌లో జరిగిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభలో ఉద్యాన హబ్‌పై సీఎం కేసీఆర్ ప్రసంగించకపోవడంతో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కదిలికలేకపోవడంతో నీలినీడలు అలుముకున్నాయాన్న ఆందోళ...

ఉద్యాన హబ్ ప్రతిపాదనలు ఇలా..

నగర శివారుల్లో 99 వేల ఎకరాల వ్యవసాయ (పంట సాగు) భూమి ఉంది. ఇందులో 12 వేల ఎకరాల్లో మాత్రమే ఉద్యానవన పంట సాగు చేస్తున్నారని, మరో 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నట్టు ప్రతిపాదనల్లో జిల్లా యంత్రాంగం వివరించింది. ప్రతి ఏటా 10 వేల ఎకరాల చొప్పున దశల వారీగా మూడేండ్లలో 30 వేల ఎకరాల్లో ఉద్యాన పంట సాగును పెంచేందుకు అవకాశముందని, ఇందు కోసం హార్టికల్చర్ శాఖలో ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బంది సంఖ్యకు అదనంగా ఏడుగురు హార్టికల్చర్ అధికారులు, 10 మంది హెచ్ఐఓ పోస్టులు మంజూరు చేయాలని ప్రతిపాదనల్లో జిల్లా యంత్రాంగం పేర్కొంది. పట్టుమని ఐదు వేల ఎకరాల్లో కూడా అదనంగా ఉద్యానవన పంట సాగుకాలేదు. జిల్లా హార్టికల్చర్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయలేదు. రానున్న రోజుల్లోనైనా జిల్లాను ఉద్యాన హబ్‌గా అభివద్ధి చేసేందుకు తక్షణమే నిధుల విడుదల చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు. అంతేకాదు, హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధికి నిధుల కొరత అడ్డంకిగా మారింది. దాదాపు రూ.250 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా ఉన్నా.. నిధులు మాత్రం విడుదల కాకపోవడంతో ఉద్యాన హబ్‌కు బ్రేక్ పడింది.

ఉద్యాన హబ్ ప్రతిపాదనలు ఇలా..

నగర శివారుల్లో 99 వేల ఎకరాల వ్యవసాయ (పంట సాగు) భూమి ఉంది. ఇందులో 12 వేల ఎకరాల్లో మాత్రమే ఉద్యానవన పంట సాగు చేస్తున్నారని, మరో 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నట్టు ప్రతిపాదనల్లో జిల్లా యంత్రాంగం వివరించింది. ప్రతి ఏటా 10 వేల ఎకరాల చొప్పున దశల వారీగా మూడేండ్లలో 30 వేల ఎకరాల్లో ఉద్యాన పంట సాగును పెంచేందుకు అవకాశముందని, ఇందు కోసం హార్టికల్చర్ శాఖలో ప్రస్తుతం ఉన్న అధికారులు, సిబ్బంది సంఖ్యకు అదనంగా ఏడుగురు హార్టికల్చర్ అధికారులు, 10 మంది హెచ్ఐఓ పోస్టులు మంజూరు చేయాలని ప్రతిపాదనల్లో జిల్లా యంత్రాంగం పేర్కొంది.

పట్టుమని ఐదు వేల ఎకరాల్లో కూడా అదనంగా ఉద్యానవన పంట సాగుకాలేదు. జిల్లా హార్టికల్చర్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయలేదు. రానున్న రోజుల్లోనైనా జిల్లాను ఉద్యాన హబ్‌గా అభివద్ధి చేసేందుకు తక్షణమే నిధుల విడుదల చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు. అంతేకాదు, హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధికి నిధుల కొరత అడ్డంకిగా మారింది. దాదాపు రూ.250 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా ఉన్నా.. నిధులు మాత్రం విడుదల కాకపోవడంతో ఉద్యాన హబ్‌కు బ్రేక్ పడింది.

కలిసి పని చేస్తాం

- ఫలించిన రేవంత్, కోదండ రామ్‌ల చర్చలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్, టీజేఎస్ మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కి వచ్చాయి. ఆ రెండు పార్టీలు పొత్తుతో కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. కాంగ్రెస్ అధికారం లోకి వస్తే ప్రొఫెసర్ కోదండరాంకు, తెలంగాణ ఉద్యమ అనుచరులకు సముచిత స్థానం కల్పించ నున్నట్టు కాంగ్రెస్ తెలిపింది. గత కొంత కాలంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి, టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంతో చర్చలు జరుపు తున్న సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో సోమ వారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మానిక్ రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, నాయ కులు బోసురాజు, వేం నరేందర్‌రెడ్డి తదితరులు హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. అనంతరం వారు కోదండరాంతో పాటు ఆ పార్టీ ఉపాధ్యక్షులు పీ.ఎల్.విశ్వేశ్వర్ రావులతో చర్చలు జరిపారు. చర్చల సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం, ప్రజా పరిపాలన నెలకొల్పడానికి మద్ధతివ్వాలని టీజేఎస్‌ను కోరారు. తెలంగాణ ప్రజలను ఐక్యం చేసి లక్ష్యసాధన దిశగా ఉద్యమాలను నిడిపిన కోదండరామ్, తన అనుభ వాన్ని కేసీఆర్ నిరంకుశ పాలన అంతమొందించడా నికి,స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి సాధన కోసం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కోదండరాం మాట్లాడుతూ కేసీఆర్ నిరంకుశ పాలనను అంతమొందించేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్ధతిస్తున్నట్టు ప్రకటించారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విధాన రూపకల్పనలో ఆరు అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. అందరికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించా లనీ, ఉపాధి, ఉద్యోగాల కల్పన ప్రధాన లక్ష్యంగా ఆర్థిక విధానాల రూపకల్పన జరగాలని ఆకాంక్షిం చారు. ఏ ఏడాది ఏర్పడిన ఉద్యోగ ఖాళీలను అదే ఏడాది క్యాలెండర్ ప్రకారం భర్తీచేయాలనీ, స్థానిక ప్రయివేట్ పరిశ్రమలు, వ్యాపార సంస్థల్లో భూమి పుత్రులకు అవకాశాలు కల్పించాలన్నారు.

వాస్తవ సాగుదారులందరికీ, ప్రత్యేకించి చిన్న, సన్న, కౌలు రైతుల ఆదాయ భద్రత సాధించడంతో పాటు వీరి భూమి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రాజ్యాంగ ప్రాతిపదికన ప్రజాస్వామిక పాలనను నెలకొల్పాలనీ, కేసీఆర్ అవినీతి చర్యలపైన విచారణ జరపాలనీ, పౌరులంద రికి ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు, మైనార్టీలకు, పేద వర్గాలకు పాలనలో భాగస్వామ్యం కల్పిస్తూ వారి సంక్షేమం కోసం విధానాలు రూపొం దించాలన్నారు. అభివృద్ధి ఫలితాల్లో న్యాయమైన వాటా దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలనీ, అమరుల కుటుంబాలకు సమగ్రమైన సహాయాన్ని అందించాలని కోరారు.

కోదండరాంకు సముచిత స్థానం

పాలనలో కోదండరాంకు సముచిత స్థానం కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తెలి పారు. చర్చల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనను అంతమొందించడమే రెండు పార్టీల లక్ష్యమని స్పష్టం చేశారు. పొత్తు,సీట్లకు సంబంధిం చిన అన్ని విషయాలను అధిష్టానానికి నివేదిస్తామని తెలిపారు. కోదండరాం రాష్ట్రంలో నాలుగు కోట్ల మంది అభిమానించే నాయకుడని కొనియాడారు. కోదండరాం మాట్లాడుతూ కేసీఆర్ నియంత పాలన అంతం కావడంతో పాటు ప్రజాస్వామిక పాలన రావాలని ఆకాంక్షించారు.

డీఎస్సీకి 1,77,502 దరఖాస్తులు

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి రాష్ట్రవ్యాప్తంగా 1,77,502 దరఖాస్తులొచ్చాయి. 1,79,297 మంది ఫీజు చెల్లిస్తే, వారిలో 1,77,502 మంది దరఖాస్తు చేశారు. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ సెప్టెంబర్ ఆరో తేదీన విడుదల చేసిన విషయం తెలిసిందే. గతనెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది.

ఆదివారంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో జరిగే రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసింది. వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీఎస్సీ రాత పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు 66,376 మంది, 611 లాంగ్వేజ్ పండితులు (ఎల్పీ) పోస్టులకు 12,339 మంది, 164 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులకు 6,856 మంది, 1,739 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 91,931 మంది కలిపి మొత్తం 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

హైదరాబాద్ నుంచి అత్యధికంగా 14,187 దరఖాస్తులు

డీఎస్సీకి హైదరాబాద్ నుంచి అత్యధికంగా 14,187 దరఖాస్తులొచ్చాయి. ఈ జిల్లాలోనే అత్యధికంగా 358 ఉపాధ్యాయ పోస్టులున్నాయి. వికారాబాద్‌లో 191 పోస్టులుంటే 9,772 మంది, నల్లగొండలో 219 పోస్టులకుగాను 9,041 మంది, నిజామాబాద్‌లో 309 పోస్టులుంటే 8,905 మంది దరఖాస్తు చేశారు. ఇక అత్యల్పంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,338 మంది దరఖాస్తు చేయడం గమనార్హం. ఆ జిల్లాలో 74 ఉపాధ్యాయ పోస్టులే ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 78 పోస్టులుంటే 1,483 మంది, ములుగులో 65 పోస్టులకుగాను 1,526 మంది, జనగామలో 76 పోస్టులకుగాను 1,616 మంది దరఖాస్తు చేశారు.

ఉపాధ్యాయ పోస్టులు, దరఖాస్తుల వివరాలు

కేటగిరీ	పోస్టులు	దరఖాస్తులు
స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)	1,739	91,931
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)	2,575	66,376
లాంగ్వేజ్ పండిట్ (ఎల్పీ)	611	12,339
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ)	164	6,856
మొత్తం	**5,089**	**1,77,502**
అత్యధిక దరఖాస్తులొచ్చిన జిల్లాలు		
హైదరాబాద్	358	14,187
వికారాబాద్	191	9,772
నల్లగొండ	219	9,041
నిజామాబాద్	309	8,905
అత్యల్పంగా దరఖాస్తులొచ్చిన జిల్లాలు		
జయశంకర్ భూపాలపల్లి	74	1,338
మేడ్చల్ మల్కాజిగిరి	78	1,483
ములుగు	65	1,526
జనగామ	76	1,616

యూడైస్‌లో వివరాల్లేని విద్యార్థులను

పదో తరగతి పరీక్షలకు అనుమతించాలి

టీపీటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూడైస్‌లో వివరాల్లేని విద్యార్థులను పదో తరగతి పరీక్షలకు అనుమతించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి వివరాలనూ యూడైస్‌లో నమోదు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ ఆదేశించిందని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లేని విద్యార్థులను ఈ ఏడాది మార్చి/ఏప్రిల్‌లో నిర్వహించే పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు అనుమతించొద్దంటూ నిర్దేశించిందని పేర్కొన్నారు. కానీ విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థికి ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా వయసుకు తగ్గ తరగతిలో చేర్చుకోవాలంటూ ఆదేశాలున్నాయని గుర్తు చేశారు. దీంతో గత కొన్నేండ్లుగా విద్యార్థులు పాఠశాలల్లో ప్రవేశం సందర్భంగా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు టీసీ లేదా బోనఫైడ్ సర్టిఫికెట్లు లేకుండానే ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ఆధారంగా వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చుకున్నారని వివరించారు. ప్రయివేటు బడుల్లో ఫీజులు చెల్లించలేని వారికీ ఈ పద్ధతి వల్ల డ్రాపౌట్ కాకుండా ఉపయోగపడిందని తెలిపారు. దీంతో అనేక మంది విద్యార్థులు గతంలో చదివిన పాఠశాల వివరాలు ఇవ్వకపోవడం వల్ల ప్రస్తుతం చదువుతునఉన పాఠశాలల్లో యూడైస్‌లో వివరాలు నమోదు చేయడం కుదరడం లేదని పేర్కొన్నారు. ఈ ప్రభావం ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపైనా పడిందని తెలిపారు. వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని యూడైస్‌లో వివరాల్లేకపోయినా వారి పరీక్షలకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

కారులో కోవర్టులు

- సిట్టింగుల్లో భయం.. భయం..
- సొంత నిర్ణయాలతో ముందుకు..
- బహిరంగ విమర్శలకు దిగుతున్న నేతలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీలో కోవర్టులు చాప కింద నీరులా వాళ్ల లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దాంతో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఆందోళనకు గురవు తున్నారు. వరంగల్ పశ్చిమ, తూర్పు, పాలకుర్తి, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఉండటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు, పలువురు కార్పొరేటర్లు ఈ మేరకు సొంత నిర్ణయాలతో ముందుకు వెళ్తున్నట్టు సమాచారం. దాంతో సిట్టింగ్ ఎమ్మెల్యేల అనుచరులు.. 'పార్టీలో ఎవరిని నమ్మాలో, ఎవ్వరిని నమ్మవద్దో తేల్చుకోవడం కష్టంగా మారింది' అని అంటున్నారు.

క్షేత్రస్థాయిలో అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకుందని ప్రచారం జరుగుతుండటం కూడా బీఆర్ఎస్ అభ్యర్థుల్లో ఆందోళనకు కారణమైంది. ఒకప్పుడు విపక్షాల్లో కోవర్టులను పెంచి పోషించిన బీఆర్ఎస్ ఇప్పుడు సొంత పార్టీలో కోవర్టులుండడం జీర్ణించుకోలేకపోతుంది. ఈ పరిస్థితి నానాటికి తీవ్రమవుతుండడం గమనార్హం. వరంగల్ పశ్చిమలో పలువురు కార్పొరేటర్లు సైలెంటవడం, 'తూర్పు' నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌కు వ్యతిరేకంగా పలువురు కార్పొరేటర్లు బహిరంగంగానే నిరసన వ్యక్తం చేశారు.

మంత్రి దయాకర్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకుర్తి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే కోవర్టులు చకాచకా పావులు కదుపుతున్నట్టు కనిపిస్తుంది. ప్రతిపక్ష పార్టీలు.. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేల పట్ల వ్యతిరేకత కలిగిన నేతలను, ప్రజాప్రతినిధులను గుర్తించి యుద్ధప్రాతిపదికన వారిని టచ్‌లోకి తెచ్చుకొని పార్టీలో చేర్చుకోవడం ప్రారంభమైంది. ఇది రానున్న రోజుల్లో మరింత పతాకస్థాయికి చేరే అవకాశం లేకపోలేదు.

అడ్డుకోవడం ఎలా..?

గతంలో కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీల్లో తీవ్ర అసమ్మతి ఉండేది. కాంగ్రెస్‌లో ఇప్పటికీ అసమ్మతి ఉంది. ఇదే పరిస్థితి ఇప్పుడు బీఆర్ఎస్‌లో చోటుచేసుకోవడంతో అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పార్టీ టికెట్ ఆశించిన నేతలు ఈసారి ఎక్కువయ్యారు. అభ్యర్థులతో సఖ్యతతో వెళ్లడానికి సైతం వారు అయిష్టంగా ఉన్నట్టు తెలుస్తుంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

పరకాల నియోజకవర్గంలో భారీ మెజార్టీ వస్తుందని, బీఆర్ఎస్‌కు పోటీ లేరని ఆ పార్టీ నేతలు భావించారు. ఇందుకు భిన్నంగా బీఆర్ఎస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు కాంగ్రెస్‌లో చేరగా, భూపాలపల్లి నియోజకవర్గంలో ఐదుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఈ వ్యవహారాన్ని పట్టించుకోకుండా ఉంటే మొదటికే మోసం వచ్చేలా ఉందని పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు క్షేత్ర స్థాయిలో వస్తున్న వ్యతిరేకత నేపథ్యంలో ఓడిపోతే కాంట్రాక్టులు చేసుకుంటా మంటూ వ్యాఖ్యానించడం కొసమెరుపు. సీఎం కేసీఆర్ నుంచి ఎమ్మెల్యేల వరకు ఇదే తరహా వ్యాఖ్యలు చేయడం మారుతున్న రాజకీయాలకు నిదర్శన మని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకనే...



విజయనగర రైలు ప్రమాద ఘటన

- 13 మంది దుర్మరణం ...
- ముమ్మరంగా సహాయక చర్యలు
- రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

విజయనగరం : విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి సమీపాన ఆదివారం జరిగిన రైలు ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య 13కు చేరింది. గాయపడిన వారు సుమారు 39 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. వీరిలో విజయనగరంలో 25 మంది, విశాఖలో 14 మంది చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. స్వల్పంగా గాయపడిన వారిని ప్రథమ చికిత్స చేసి ఇండ్లకు పంపించారు. కంటకాపల్లి-అలమండ మధ్య రైల్వే ట్రాక్‌పై ఆగి ఉన్న విశాఖ-పలాస పాసింజర్ రైలును, ఆ వెనుక వస్తున్న విశాఖ-రాయగడ పాసింజర్ రైలు ఢీకొన్న విషయం తెలిసిందే. పట్టాలు తప్పిన వీటి బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్సు రైలు బోగీలపైకి దూసుకెళ్లడంతో పట్టాలు పైకి లేచాయి. ఈ ప్రమాదంలో తొలిరోజే పది మంది మృతదేహా లను బయటకు తీసిన సహాయక బృందాలు, సోమవారం మరో మూడు మృతదేహాలు బయటపడ్డాయి. దీంతో, మృతు ల సంఖ్య 13కు చేరింది. ఛిద్రమైన రైలు బోగీలను కట్ చేసి రాయగడ పాసింజర్ రైలు లోకో పైలట్ మృతదేహంతో పాటు మరో ఇద్దరి మృతదేహాలకు బయటకు తీశారు. సంఘటనా స్థలంలో 11 మంది మృతి చెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో మరణించారు. మృతుల్లో విజయనగరం జిల్లావాసులే ఎక్కువ మంది ఉన్నారు. పలాస రైలు గార్డు ఎం.శ్రీనివాసరావు విశాఖ రైల్వే ఆస్పత్రిలో మతి చెందగా, టెక్కలి సుగుణమ్మ విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. మృతదేహాలను విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. క్షతగాతులకు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు.

ఇనుప చక్రాల మధ్య చిక్కుకున్న డ్రైవర్, లోకో పైలట్ మృతదేహాలు

రైలు ప్రమాదంలో బోగీలు ఛిద్రమవ్వడంతో ఇనుప చక్రాల మధ్య మృతదేహాలు చిక్కుకుపోయాయి. బోగీల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రాయగడ రైలు అసిస్టెంట్ డ్రైవర్ ఎస్.చిరంజీవి, లోకోపైలట్ సింగంపల్లి మధుసూదన రావు మృతదేహాలు ఇంజన్ల మధ్య చిక్కుకొని నుజ్జునుజ్జు అయ్యాయి. వారి మృతదేహాలను వెలికి తీయడానికి సహా యక బృందాలకు ఎక్కువ సమయం పట్టింది. లోకో పైలట్ శరీరం ఛిద్రం కావడంతో మాంసపు ముద్దలు బయటకు తీశారు. వీటిని గుర్తు పట్టేందుకు వీలులేని పరిస్థితి ఉంది.

ఆటో సిగ్నల్ సిస్టంలో లోపం!

గతంలో రైలు కథలాలంటే స్టేషన్ నుంచి క్లియరెన్స్ వచ్చాకే రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవారు. ఒకవేళ దాని ముందు మరో రైలు వెళితే, అది తరువాత స్టేషన్ చేరుకు న్నాక ఈ రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వదిలే వారు. కానీ, ఆటో మోడ్ సిగ్నల్ వచ్చాక, ఒకే లైనుపై రెండు రైళ్లను ఐదు నిముషాలు వ్యవధిలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చి వదులుతున్నారు. పలాస రైలుకు సిగ్నల్ లోపం వలనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. కానీ, ఒఆర్ కేబుల్ కట్ అవడం వలన రైలు ఆగిపోయిందని కొందరూ చెబుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు విషయం తెలియనుంది

స్థానికుల చొరవతో తగ్గిన ప్రాణ నష్టం

రైలు ప్రమాదం జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో భారీ శబ్దం రావడంతో సమీప గ్రామాలైన అలమండ, కుద్దు పాలెం, నారాయణపురం, భీమాలి గ్రామాల ప్రజలు, యువ కులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయా ణికులను రక్షించారు. సంఘటనా స్థలం నుంచి క్షతగాత్రుల ను బయటకు తీశారు. సుమారు కిలోమీటరు వరకూ భుజా లపై మోసుకొని తీసుకెళ్లి అంబులెన్సుల్లో ఎక్కించారు. వాహ నాలు ఘటనా స్థలానికి చేరుకోవడానికి కొమ్మలు, చెట్లు తొల గించి పోలీసు, రెవెన్యూ, ఇతర సహాయక బలగాలకు సహ కరించారు. ఈ నేపథ్యంలోనే కొంతమంది ప్రాణపాయం నుంచి బయటపడ్డారని బాధితులు చెబుతున్నారు. మరో వైపు మహిళలు తాగునీరు, మజ్జిక వంటివి బాధితులకు అందించి సహాయక చర్యలు చేపట్టారు.

15 గంటల్లో లైన్ క్లియర్

యుద్ధప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరణ

ప్రమాదం జరిగినప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది, పోలీసు, రెవెన్యూ అధికారులు పెద్ద ఎత్తున హాజరై యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన బోగీలను ట్రాక్‌పై నుంచి తొలగించేందుకు భారీ క్రేనులు, ప్రొక్లయినరు వంటి వాటిని రైల్వే శాఖ ఉపయోగించింది. పట్టాలు తప్పిన బోగీలను పలాస రైలుకు సంబంధించి అలమండ స్టేషన్‌కు, రాయగడ రైలుకు సంబంధించి కంటకాపల్లి స్టేషన్‌కు తరలించారు. రైలు ప్రమాద ఘటన జరిగిన 15 గంటల్లో యుద్ధప్రాతిపదికన రైలు ట్రాక్‌ను పునరుద్ధరించారు. విజయవంతంగా ట్రయిల్ రన్ నిర్వహించారు. ఈ పనులను రైల్వే శాఖ డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, జిఎం మనోజ్ శర్మ పర్యవేక్షించారు. ట్రాక్ మరమ్మతుల్లో వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన అరగంట వ్యవధిలోనే రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో జిల్లాలోని పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. ఒడిశా నుంచి నాలుగు డిజాస్టర్ బృందాలు చేరుకోగా, 85 మంది ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది, 123 మంది ఎస్‌సిఆర్ ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. విశాఖ, విజయనగరం వైద్య బృందాలు బాధితులకు చికిత్స అందించాయి. సహాయక చర్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర అశోక పర్యవేక్షించారు. పెద్ద ఎత్తున పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకే ప్రమాదం

బాధిత ప్రయాణికుల కథనం ప్రకారం... పలాస పాసింజర్ రైలు కంటకాపల్లి స్టేషన్ దాటిన వెంటనే అలమండ స్టేషన్ నుంచి రావాల్సిన గ్రీన్ సిగ్నల్ బదులు పసుపు సిగ్నల్ రావడంతో పలాస రైలు వేగం తగ్గించుకుని నెమ్మదిగా వెళ్తోంది. ఆ వెనుక వస్తున్న రాయగడ రైలుకు కంటకాపల్లిలో గ్రీన్ సిగ్నల్ రావడంతో అది యథావిధిగా వేగంతో అదే లైను గుండా వెళ్లడంతో ముందున్న పలాస రైలును బలంగా ఢీకొంది. కానీ, అధికారులు మాత్రం... ఓవర్ హెడ్‌వైర్ తెగిపోవడంతో పలాస పాసింజర్‌కు సిగ్నల్ లేక ఆగిపోయిందని, దీనివల్లే వెనుక వస్తున్న రాయ గడ రైలు ఢీ కొట్టిందని చెప్తున్నారు. పూర్తి విచారణ జరిపితే తప్ప కారణం చెప్పలేమని రైల్వే ఉన్నతాధికారులు అంటున్నారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో హెల్ప్‌లైన్స్ ఏర్పాటు

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోనూ అధికారులు హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. అనకాపల్లి; 08924-221698, తుని, 08854-252172, సామర్లకోట 0884-2327010, కాకినాడ టౌన్ 0884-2374227, రాజమండ్రి 0883-2420541, నిడదవోలు 0881-3223325, ఏలూరు 0881-2232267, భీమవరం టౌన్ 0881-6230098, విజయవాడ 0866-2576924, తెనాలి 0864-4227600, ఒంగోలు 08592 -2280308, నెల్లూరు 0861-2342028, గూడూరు 9494178434 నెంబర్లను రైల్వే శాఖ కేటాయించింది. ప్రయాణికులకు సంబంధించిన సమాచారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించాలని సూచించింది.

రైల్వే ప్రయాణికులకు భద్రత కరువు

- బాధిత కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలి : బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విజయనగరం జిల్లాలోని కంటకాపల్లి అలమండ సమీపంలో రైలు ప్రమాదం దురదృష్టకరమని బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షులు తోట చంద్రశేఖర్ తెలిపారు. ప్రమాద ఘటనలో మరణించిన వారికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. దేశంలో రైలు ప్రమాద ఘటనలు పెరిగిపోవడం ఆందోళనకరమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ప్రయాణీకులకు భద్రత కరువైందని పేర్కొన్నారు. ప్రమాదాలను నివా రించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శిం చారు. ఒడిశాలోని ఘటన మరవకముందే మరో సంఘటన చోటుచేసు కోవడం బాధాకరమని తెలిపారు. రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలున్నా వాటిని సరిదిద్దకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. రైల్వేను ప్రయివేటుపరం చేసే దుష్టఆలోచనను కేంద్ర ప్రభు త్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయాణీకుల భద్రతకు భరోసాని వ్వాలని కోరారు. ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు.

కాంగ్రెస్ ఐదు గంటల కరెంటు హాస్యాస్పదం

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఐదు గంటల కరెంటు ఉచితంగా ఇస్తామంటూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేయటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రంలో 24 గంటల కరెంటు బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నేతృత్వంలో ఇస్తున్నదని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే.. కరెంటు ఎప్పుడు వస్తున్నదో తెలియని పాతరోజుల్లోకి తీసుకుపోతుందని పేర్కొన్నారు. నాడు కరెంటు కష్టాలతో ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు.

రేపు పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన



- సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ
- పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సామ్రాజ్యవాద శక్తుల అండతో గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న క్రూరమైన దాడులను సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించాయి. పాలస్తీనాకు సంఘీభావంగా వచ్చేనెల ఒకటో తేదీన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు ప్రకటించాయి. అందుకు సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కార్యదర్శి జె వెంకటేశ్, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, పి ప్రభావతి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు, సహాయ కార్యదర్శి కె అశోక్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్, మల్లు లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ అఖిల భారత కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా వచ్చేనెల ఒకటిన అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో పాలస్తీనా ప్రజలకు సంఘీభావ ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ దురహంకారంగా వ్యవహరి స్తున్నదని విమర్శించారు. గాజాలోని పాఠశాలలు, ఆస్పత్రులపై అమానుష దాడులకు పాల్పడుతున్నదనీ, పిల్లలు, మహిళలు అనేక మంది ప్రాణాలు కోల్పోతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిది వేల మంది మరణిం చారనీ, 14 లక్షల మంది నిరాశ్రయులయ్యారని చెప్పారు. మానవత్వంతో ఆలోచించి ఈ దాడులను ఇజ్రాయిల్ ఆపాలని డిమాండ్ చేశారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాలస్తీనా ప్రజలకు ప్రపంచ వ్యాప్తంగా సహకారం అందించలేని పరిస్థితి ఉందన్నారు. ఐక్యరాజ్యసమితి తీర్మానంలో భారత్ ఓటింగ్‌లో పాల్గొనకపోవడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చేనెల ఒకటిన నిర్వహించే ప్రదర్శనలో సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే మేధావులు, విద్యావంతులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.

టీడీపీకి కాసాని రాజీనామా

- త్వరలో భవిష్యత్ కార్యాచరణ



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

తెలంగాణలో టీడీపీకి బిగ్ షాక్. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు పంపించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ వద్దని అధిష్టానం చెప్పడంతో కాసాని అసంతృప్తికి లోనయ్యారు. త్వరలోనే తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. ఈ మేరకు అమీర్‌పేటలోని తన నివాసంలో కాసాని మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీకి చంద్రబాబు నాయుడు ఆసక్తి చూపడంలేదని వాపోయారు. గత కొద్ది రోజులుగా బాబు, లోకేష్‌ను సంప్రదించినా ఎటువంటి సమాధానం రాకపోవడంతో రాజీనామా నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న సమయంలో పోటీ చేయాలా వద్దా అని తేల్చుకోలేక పోవడం, పార్టీ నేతల నుంచి స్పష్టత లేకపోవటమే ప్రధాన కారణమని చెప్పారు. ఈ ఫలితంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు.

బాబు జైలుకు వెళ్లడం బెయిల్ రాకపోవడం కారణమా ?

చంద్రబాబు జైలుకు వెళ్లడంతో టీడీపీకి తిప్పలు తప్పడం లేదని కాసాని తెలిపారు. ఎన్నికల కోసం పార్టీ నేతలు ఐదేండ్లుగా ఎదురు చూసిన వారికి అన్యాయం జరిగిందని వివరించారు. ఈ కారణం గా బీసీలకు అధిక సీట్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లాలని మొదటి నిర్ణయం చేసినా అటువైపు అడుగులు వేయలేదు. ఇది ఇలా ఉంటే ఏపీ లో బీజేపీ, జనసేన తో కలిసిపోటీ చేయడం తెలంగాణలో పోటీకి దూరంగా ఉండటం కొద్ది మంది నేతలు కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని చెప్పడంతో ఈ దూరం పెరిగినట్టు తెలుస్తుంది.

నేడు రాష్ట్రానికి ప్రియాంకగాంధీ రాక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేడు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ రాష్ట్ర పర్యటనకు రానున్నారు. మంగళవారం (అక్టోబర్ 31న) ఆమె పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు నియోజక వర్గాలలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచార సభల్లో ఆమె ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దేవరకద్రకు చేరుకొని మహిళలతో సమావేశమై టీపీసీసీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రియాంక ప్రచారం చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో పాలమూరు ప్రజా భేరి సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

గౌలిపుర కబేలా స్థలాన్ని రక్షించాలి

తప్పుడు అఫిడవిట్ దాఖలుపై విచారణ చేపట్టాలి

- భూ కబ్జాదారులు, అధికారులపై చర్యలు తీసుకోవాలి
- సహకరించిన వారిని సస్పెండ్ చేయాలి : సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ గౌలిపుర మున్సిపల్ పరిధిలోని కబేలా స్థలాన్ని కబ్జా నుంచి రక్షించాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం సీపీఐ(ఎం) నగర కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ స్నేహా అంబరీష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిజాం కాలం నుంచి గౌలిపుర మున్సిపల్ కబేలా ఉందన్నారు. 4.2 ఎకరాల స్థలంలో ఉన్న దాదాపు రూ.100 కోట్ల విలువైన కబేలా అతి పురాతనమైందని చెప్పారు. 2003లో హైకోర్టు ఆదేశాలతో అన్ని కబేలాలతోపాటు గౌలిపుర కబేలా కూడా మూతపడిందన్నారు. తదనంతరం గౌలిపుర కబేలా ఆధునీకరణ కోసం జీహెచ్ఎంసీ రూ.7 కోట్లు కేటాయించి 95 శాతం పనులు పూర్తి చేసిందని గుర్తు చేశారు. 1954-55 నుంచి రెవెన్యూ పహాణీ రికార్డుల్లో 4.2 ఎకరాల కబేలా ఉన్నట్టు నమోదైందన్నారు. కొందరు కబేలా స్థలంతోపాటు చుట్టూ ఉన్న శ్మశాన వాటిక స్థలాన్ని కూడా కబ్జా చేయడానికి చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2010లో భూకబ్జాదారులకు అనుకూలంగా కబేలా స్థలంతో పాటు 8 ఎకరాల భూమిని హైదరాబాద్ కలెక్టర్‌గా వున్న నవీన్ మిట్టల్ అక్రమంగా మ్యుటేషన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నవీన్ మిట్టల్ చేసిన మ్యుటేషన్ తప్పని నిర్ధారిస్తూ తదనంతరం వచ్చిన కలెక్టర్ ఎస్ఎస్ గుల్జార్ ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తు చేశారు.

కబేలా భూమితో పాటు మరికొన్ని ప్రభుత్వ భూములను కూడా అక్రమంగా మ్యుటేషన్ చేశారని నవీన్ మిట్టల్‌పై రాష్ట్ర ప్రభుత్వం చార్జిషీట్ నమోదు చేసిందన్నారు. కోర్టులో కేసులు కొనసాగుతుండగానే రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు గౌలిపుర కబేలా అక్రమ మ్యుటేషన్‌కు వ్యతిరేకంగా అఫిడవిట్ దాఖలు చేస్తూ వచ్చారని చెప్పారు. అయితే, నవీన్ మిట్టల్ సీసీఎల్ఏగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెవెన్యూ అధికారులు హైకోర్టులో భూ కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారన్నారు. 4.2ఎకరాల గౌలిపుర మున్సిపల్ కబేలా స్థలం జీహెచ్ఎంసీదే కాదంటూ అఫిడవిట్ దాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కా డాక్యుమెంట్లతో అనేక సార్లు వివిధ కోర్టుల్లో అఫిడవిట్ దాఖలు చేసిన అధికారులే 2022, ఫిబ్రవరిలో మొదటిసారీ కబేలా స్థలంతో తమకేమీ సంబంధం లేదని, మమ్మల్ని కేసు నుంచి తప్పించండి అంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ పేరుతో అఫిడవిట్ దాఖలు చేశారని వివరించారు. ఇలా జీహెచ్ఎంసీ అధికారులు భిన్నంగా వ్యవహరించడంతో హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసిందన్నారు. ఈ క్రమంలో హైకోర్టులో జీహెచ్ఎంసీ ఓడిపోవాల్సి వచ్చిందన్నారు. అయినా, భూకబ్జాదారులకు అనుకూలంగా గత నెలలో తీర్పు వచ్చిందన్నారు.

కబ్జాదారులతో కొందరు అధికారులు కుమ్మక్కై భారీ భూస్కాంలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసిన వ్యవహారంపై విచారణ జరిపించాలని, రెవెన్యు, జీహెచ్ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. చర్యలు తీసుకోకుంటే జీహెచ్ఎంసీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అరెకటిక సంఘం గౌలిపుర అధ్యక్షులు యం.యశ్వంతరావు, అరెకటిక సంఘం గౌలిపుర కార్యదర్శి ఎం.రమేష్, సీపీఐ(ఎం) సౌత్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎల్.కోటయ్య, గౌలిపుర స్లాటర్ హౌస్ వర్కర్స్ యూనియన్ శివకుమార్ ఉన్నారు.

కొత్త కుట్రలకు తెర లేపుతున్న ఇరు పార్టీలు

- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే
- అంబర్‌పేట దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తా
- టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ, బీఆర్ఎస్.. కొత్త కుట్రలకు తెర లేపుతున్నాయని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు ఓడిపోతామన్న భయం పట్టుకుని బీజేపీతో కుమ్మక్కై దాడులు చేస్తూ కాంగ్రెస్ పార్టీపై బురద చల్లుతున్నారని అన్నారు. సోమవారం గోల్నాక పెరల్ గార్డెన్‌లో జరిగిన అంబర్‌పేట కాంగ్రెస్ కమిటీ కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హింసను ప్రోత్సహించదని, గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణం త్యాగం చేశారని గుర్తు చేశారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అంబర్‌పేటను తాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గంగపుత్రులకు కాంగ్రెస్ సుమచిత స్థానం కల్పిస్తుందన్నారు. నియోజకవర్గంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్టేడియం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి రోహిన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ హనుమంతరావు, కాంగ్రెస్ అభ్యర్థి రోహిన్ రెడ్డి, లక్ష్మతి యాదగిరి గౌడ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, పోలినేని రామ్మోహన్ రావు, గడ్డం శ్రీధర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్ గౌడ్, నారాయణస్వామి, కట్టెల సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా నియమితులైన పీవీఎస్ రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కలిశారు.



ఈ సందర్భంగా పోస్టల్ శాఖ అందిస్తున్న పలు ప్రజా ప్రయోజన పథకాలను ఆమెకు వివరించారు. కొత్త పోస్టులో రాణించాలని ఈ సందర్భంగా శాంతికుమారి ఆయన్ని అభినందించారు.

కేంద్రంలో 16 లక్షల ఉద్యోగ ఖాళీలు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో 16 లక్షల ఉద్యోగ ఖాళీలున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో దరువు ఎల్లన్న బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, గుజరాత్ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ తలసరి ఆదాయం ఎక్కువని తెలిపారు. ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ కొంత మేరకు న్యాయం చేసిందనీ, ఇంకా చేయాల్సింది ఉందని చెప్పారు.

దరువు ఎల్లన్నకు తాను భరోసాగా ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కర్నాటకలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులకు చేతగాక బయటి నాయకులను రప్పించి ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మోడీ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ నిబద్ధత ఉన్న నాయకుడని కొనియాడారు.

కరువు పీడిత ప్రాంతంగా ఉన్న మహబూబ్‌నగర్ చేపల చెరువులు, రొయ్యల చెరువుల స్థాయికి ఎదిగిందన్నారు. అన్ని చేసిన బీఆర్ఎస్ గెలిపిద్దామా? ఏమి చేయని కాంగ్రెస్, బీజేపీ లకు ఓటు వేద్దామా? అంటూ ప్రశ్నించారు.

కరీంనగర్ కలెక్టర్‌గా పమేలా సత్పతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా 2015 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణ పమేలా సత్పతిని నియమించారు. అలాగే ఆ జిల్లా పోలీస్ కమిషనర్‌గా రాచకొండ కమిషనరేట్‌లో ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తున్న అభిషేక్ మహంతి నియమితులయ్యారు.

ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ రెండు పోస్టుల్లోని అధికారుల్ని బదిలీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా పై అధికారులతో ఆ పోస్టుల్ని భర్తీ చేశారు.

ఆర్టీఐ చట్టం 'డెడ్ లెటర్'గా మారుతుంది

- సమాచార కమిషన్లలో ఖాళీలను భర్తీ చేయాలి
- కేంద్రానికి, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్‌లోని ఖాళీలను భర్తీ చేయాలని రాష్ట్రాలను, కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇలాంటి ఖాళీలు కొనసాగడం సమాచార హక్కు చట్టంలోని లక్ష్యాన్ని ఓడిస్తుందని కోర్టు పేర్కొంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ సమాచార కమిషన్‌లలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేంద్ర సమాచార కమిషన్‌తో పాటు పలు రాష్ట్ర సమాచార కమిషన్‌లలో ఖాళీలపై ఫిర్యాదు చేస్తూ ఆర్టీఐ కార్యకర్త అంజలి భరద్వాజ్ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. "ఈ ఖాళీలను భర్తీ చేయడంలో రాష్ట్రాలు విఫలమైతే ఆర్టీఐ చట్టం లక్ష్యాన్ని దెబ్బతీస్తుంది. చట్టం డెడ్ లెటర్ అవుతుంది. రాష్ట్ర సమాచార కమిషనర్ల ఎంపిక ప్రక్రియను ప్రారంభించే వరకు అన్ని రాష్ట్రాలు వెంటనే చర్యలు తీసుకోవాలి" అని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రాల స్పందనలను కోరాలని భారత అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటిని ఆదేశించారు. అన్ని కమీషన్లలో ఎన్ని ఖాళీలు ఎన్ని అప్పీళ/ఫిర్యాదులు వచ్చాయనే దానిపై చార్ట్ సిద్ధం చేయాలని కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీఓపీటీ)ని కోర్టు ఆదేశించింది. ఇంకా, ఖాళీల భర్తీకి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని కేంద్రం, రాష్ట్రాలను ఆదేశించింది.

తెలంగాణ వంటి రాష్ట్రాలు కమిషన్‌ను రద్దు చేశాయి : ప్రశాంత్ భూషణ్

పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ, తెలంగాణ వంటి రాష్ట్రాలు దాదాపు రాష్ట్ర సమాచార కమిషన్‌ను రద్దు చేశాయని, చాలా రాష్ట్రాలు అలాంటి కేసుల్లో అప్పీలు కూడా తీసుకోవడం లేదని పేర్కొన్నారు.

సామాన్యుల సొమ్ము తిరిగిచ్చేయండి

- రాష్ట్ర ఎన్నికల అధికారులకు సీఈసీ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికలు, రాజకీయాలతో సంబంధంలేని సామాన్య ప్రజల నగదును వారికి వెంటనే అందచేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో పెద్ద సంఖ్యలో సామాన్య ప్రజల సొమ్మును స్వాధీనం చేసుకోవడంపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని సీఈసీ తెలిపింది. ఇలాంటి సొమ్ముపై జిల్లా గ్రీవెన్సెస్ కమిటీల నుంచి అనుమతి రాగానే సాధ్యమైనంత త్వరగా వాటిని ప్రజలకు అందచేయాలని చెప్పింది. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై సీఈసీ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితీష్‌కుమార్ వ్యాస్, డైరెక్టర్ (వ్యయం) పంకజ్ శ్రీవాస్తవ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌తో పాటు జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఈసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో నామినేషన్ల ప్రక్రియ అవుతున్నందున ఏర్పాట్లన్నీ పగడ్బందీగా పూర్తి చేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత, పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం, సమగ్ర కంట్రోల్ రూం ఏర్పాటు, నమూనా నియమావళి, సీ-విజిల్ ప్రచారం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అవసరమైన బలగాలను తరలించాలనీ, ఆన్‌లైన్ ప్రచారం, అఫిడవిట్‌లు అప్‌లోడ్ చేయడం, స్ట్రాంగ్ రూంల ఏర్పాట్లనూ సమీక్షించారు. ఓటరు జాబితా, ఓటరు సమాచార స్లిప్‌లు, ఓటర్ గైడ్, పంపిణీ, పర్యవేక్షణ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీలు, గుర్తింపు లేని రాజకీయ పార్టీల జాబితాలు, నమోదై గుర్తింపు పొందని రాజకీయపార్టీలకు కేటాయించిన ఉమ్మడి గుర్తులు, ఏదైనా ఒకటి ఎన్నుకోవడానికి వీలైన జాబితా, ఎన్‌కోర్ ద్వారా ఆన్‌లైన్ నామినేషన్ల నమోదు, పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ, పంపిణీ, పర్యవేక్షకుల వ్యూహం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల వ్యయ పర్యవేక్షన నోడల్ అధికారి మహేష్ భగవత్, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి సంజయ్‌కుమార్ జైన్, అడిషనల్ సీఈఓ లోకేష్‌కుమార్, జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, పలు జిల్లాల కలెక్టర్లుచ ఎస్పీలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు టీఎస్ఈఆర్సీ అభినందనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కల్గించడం సరికాదనీ, అలా వ్యవహరించేవారిపట్ల చట్టపరమైన చర్యలు తప్పవని టీఎస్ఈఆర్సీ చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు అన్నారు. ఇటీవల హైదరాబాద్ పాతబస్తీలోని మొఘల్‌పురా డివిజన్‌లో కరెంటు బిల్లు కట్టలేదని సర్వీస్ కట్ చేసిన విద్యుత్ సిబ్బందిపై సదరు వినియోగదారుడు కత్తితో దాడికి యత్నించిన విషయం తెలిసిందే. దీనిపై పోలీస్‌కేసు కూడా నమోదయ్యింది. ఈ ఘటనలో ధైర్యంగా విధులు నిర్వహించిన ఆర్టిజన్ మమ్మద్ అబ్దుల్ సలీం రుహీ, ఏఈ (ఆపరేషన్స్) జీ లక్ష్మీనారాయణ రాజును సోమవారంనాడిక్కడి టీఎస్ఈఆర్సీ ప్రధాన కార్యాలయంలో సత్కరించారు. చైర్మెన్ శ్రీరంగారావుతో పాటు సభ్యులు ఎమ్‌డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్య, కార్యదర్శి నారం నాగరాజు, టీఎస్ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ స్వామి రెడ్డి సదరు ఉద్యోగులకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి సన్మానించారు.



ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ప్రజలు సహకరించాలే తప్ప, అవరోధాలు కల్పించకూడదని చెప్పారు. నిజాయితీగా, ధైర్యంగా విధులు నిర్వహించిన విద్యుత్ ఉద్యోగులు మరికొందరికి స్ఫూర్తిని ఇస్తారని అన్నారు.

విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి, విద్యుత్ సంస్థలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ఉద్యోగులకు భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని చెప్పారు.

నేడు వామపక్షాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పాలస్తీనా సంఘీభావ సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సదస్సును మంగళవారం ఉదయం పదిగంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం(ఎస్వీకే)లో నిర్వహించనున్నాయి. ఈ సదస్సులో ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్‌తోపాటు సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసీపీఐ(యూ), ఎస్‌యూసీఐ(సీ), ఫార్వర్డ్‌బ్లాక్, ఆర్ఎస్పీ, సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ తదితర వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు ఎస్వీకే నుంచి అంబేద్కర్ కాలేజీ వరకు ప్రదర్శన నిర్వహిస్తారు.

భవిష్యత్‌లో పోటీ చేస్తా

- శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలన శ్రీరామరక్షగా నిలిచిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు పథకం అమలవుతుందని, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతిస్తూ రైతులను ఆదుకుంటున్నారని చెప్పారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. మూడోసారి కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు పట్టం కడతారని, అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదాలు కేసీఆర్‌కు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. త్వరలోనే మిర్యాలగూడకు గోదావరి నీళ్లు అందుతాయన్నారు.

లండన్‌కు చేరుకున్న కల్వకుంట్ల కవిత

- ఎన్నారైలు, బీఆర్ఎస్ కార్యకర్తల ఘన స్వాగతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆహ్వానం మేరకు తెలంగాణ మోడల్‌పై కీలకోపన్యాసం చేయడానికి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం లండన్ చేరుకున్నారు. లండన్ విమానాశ్రయంలో కల్వకుంట్ల కవితకు ఎన్నారైలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 11.30 గంటలకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో "ఎక్స్ ప్లోరింగ్ ఇన్ క్లూసివ్ డెవలప్‌మెంట్: ద తెలంగాణ మోడల్" అనే అంశంపై కవిత ప్రసంగించనున్నారు. కీలక రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన గణనీయమైన పురోగతిపై ప్రజంటేషన్ ఇస్తారు. వ్యవసాయం, విద్యుత్తు, విద్య, వైద్యం, తాగునీరు తదితర అంశాలపై తెలంగాణ సాధించిన ప్రగతిని అంతర్జాతీయ వేదికపై ఆమె ఆవిష్కరించనున్నారు.

విపక్షాల నీచ రాజకీయాలు

- చావు రాజకీయాలు కోరుకుంటున్న ఎంపీ అరవింద్
- తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు నీచ రాజకీయాలకు తెరలేపాయని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల్లో గెలిచే దమ్ములేక చావు రాజకీయాలు కోరుకుంటున్నారని దుయ్యబట్టారు. సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల మీద నిజామాబాద్ ఎంపీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మనిషి పుట్టుక పుట్టిన ఎవ్వడు వేరే వాళ్ల చావు కోరుకోరని తెలిపారు. మీ ఇంట్లో వారిపై ఇదే విధంగా మాట్లాడితే ఊరుకుంటావా అని అరవింద్‌ను ప్రశ్నించారు. మళ్లీ ఇలాంటి మాటలు మాట్లాడితే నాలుక కోస్తామని హెచ్చరించారు. అసలు బీజేపీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రైతులను పట్టించుకోవడం లేదు... తెలంగాణలో రైతులను అండగా నిలిస్తే జీర్ణించుకోలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

43 మంది అభ్యర్థులతో బీఎస్పీ రెండో జాబితా

- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీని ఓడించాలని పిలుపు
- అమిత్‌షా వ్యాఖ్యలు హాస్యాస్పదం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


బహుజన సమాజ్ పార్టీ రెండో జాబితా విడుదల చేసింది. ఈ నెల 3 న 20 మందితో తొలి జాబితా విడుదల చేసిన బీఎస్పీ, సోమవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 43 మందితో రెండో జాబితా ప్రకటించింది. ఈ సందర్భంగా మీడియాను ఉద్దేశించి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు ఇచ్చే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓట్లు వేయొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రి చేస్తానన్న అమిత్ షా వ్యాఖ్యలు హాస్యాస్పదమని విమర్శించారు. బీసీ కులాలకు చెందిన బండి సంజయ్ పార్టీకి అధ్యక్షుడిగా ఉంటే ఓర్వలేని బీజేపీ బీసీని ముఖ్యమంత్రిని చేస్తానంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ప్రధానిగా బీసీ ఉన్నా కులగణన చేపట్టడం లేదని గుర్తు చేశారు. బీఎస్పీ జనబలం ముందు కేసీఆర్ ధన బలం పనికిరాదన్నారు. ఎన్నికల్లో డబ్బులు పంచే, ప్రలోభాలకు గురిచేసే పార్టీలకు ఓట్లను అమ్ముకోవద్దని కోరారు. జనాభాలో 99 శాతం పేదలకు అధికారం దక్కాలన్నదే బీఎస్పీ లక్ష్యమన్నారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి లక్ష కోట్లు అప్పు తెచ్చి కాళేశ్వరం కట్టారన్న ఆయన మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిన నాలుగేళ్లలోనే కుంగిపోవడానికి కారకులు ఇంజనీర్లా లేక కేసీఆర్ బినామీ కాంట్రాక్టర్లా? అని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని కల్వకుంట్ల కుటుంబం వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ దోపిడీ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ప్రకటించిన మొత్తం 63 అసెంబ్లీ స్థానాలకు బీసీ26, ఎస్సీ 21, ఎస్టీ11, ఓసీ03, మైనార్టీలు02 సీట్లు కేటాయించారు.

ప్రజా వ్యతిరేక బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించండి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. జాగో (మేలుకో) తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం చేపట్టిన బస్సుయాత్ర సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా గడియారం సెంటర్ వరకు సాగింది. అక్కడున్న జిల్లా గ్రంథాలయంలో నిరుద్యోగులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి, నియంతృత్వంతో దోపిడీ చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. మద్యానికి, నోటుకు, కులానికి, మతానికి లోబడకుండా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జేపీ చలపతిరావు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదో ప్రజలు అభ్యర్థులను నిలదీయాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఎక్కడని, రైతు రుణమాఫీ, దళిత బంధు, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, పంటల బీమా, ముస్లిం మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్లు, రూ.15 లక్షల నల్లధనం, తదితర అంశాలపై పాలకులను నిలదీయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక సలహాదారు, ప్రొ. వినాయక్ రెడ్డి, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్ రెడ్డి, సభ్యులు ఎం. హన్మేశ్, టీఎస్డీఎఫ్ కో కన్వీనర్ నైనాల గోవర్ధన్, ప్రదీప్, రాష్ట్ర నాయకులు రాజ్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ఓయూ విద్యార్థి సంఘం నాయకులు ఇందూరు సాగర్, జిల్లా కార్యదర్శి పోలె పవన్, జిల్లా అధ్యక్షులు బొంగరాల నర్సింహ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు బీరెడ్డి సత్తిరెడ్డి, ఏమిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





రూబియేల్స్‌పై వేటు

జ్యూరిచ్ : ముద్దు వివాదంలో ఇరుక్కున్న స్పానిష్ ఫుట్‌బాల్ అసోసి యేషన్ (ఆర్‌ఎఫ్‌ఈఎఫ్) మాజీ అధ్యక్షుడు లూయిస్ రూబియేల్స్‌పై ఫిఫా క్రమశిక్షణ సంఘం కొరఢా ఝులిపించింది. ఈ ఏడాది మహిళల ఫిఫా ప్రపంచకప్ విజేతగా నిలిచిన స్పెయిన్ జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తూ స్టార్ ప్లేయర్ జెన్నీ హెర్మోసోను రూబియేల్స్ ముద్దు పెట్టుకున్నాడు. జెన్నీ సమ్మతి లేకుండా రూబియేల్స్ బలవంతంగా ముద్దు పెట్టడంపై పెను దుమారం రేగింది. విచారణ అనంతరం రూబియేల్స్‌ను మూడేండ్ల పాటు ఫుట్‌బాల్ కార్యకలాపాలకు దూరం చేస్తూ ఫిఫా క్రమశిక్షణ కమిటీ నిర్ణయం తీసుకుంది.







భావోద్వేగ సమరం!

- పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఢీ నేడు
- గెలుపు కోసం ఇరు జట్ల తహతహ

నవతెలంగాణ-కోల్‌కత

ఓ జట్టుకు సాంకేతికంగా స్వల్పంగా సెమీఫైనల్స్ ఆశలు మిగిలి ఉండగా, మరో జట్టు ఇప్పటికే ఆశలు వదులుకుని చాంపియన్స్ ట్రోఫీ బెర్త్ కోసం పోటీపడుతుంది. ఆరు మ్యాచుల్లో నాలుగు ఓటములతో పాకిస్థాన్ సతమతం అవుతుండగా, ఆరు మ్యాచుల్లో ఐదు పరాజయాలతో బంగ్లాదేశ్ అంచనాలను అందుకోలేదు. ఇప్పుడు ఈడెన్ గార్డెన్స్ వేదికగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. ఇటీవల కాలంలో పాక్, బంగ్లా క్రికెట్ మ్యాచ్ భావోద్వేగ సమాహారంగా మారగా.. చెత్త ప్రదర్శనతో ఆటగాళ్లు సైతం మానసికంగా కుంగిపోయారు. వరుస ఓటముల నడుమ ఓ గెలుపు ఊరట కోసం పాకిస్థాన్, బంగ్లాదేశ్ తహతహ లాడుతున్నాయి. కోల్‌కతలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ పోరు నేడు.

కుంగిన పాక్

హైదరాబాద్‌ను వీడాక పాక్‌కు ఏదీ కలిసి రాలేదు. ఉప్పల్‌లో శ్రీలంకపై వరల్డ్‌కప్ చరిత్రలోనే అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన పాకిస్థాన్.. ఆ తర్వాత వరుసగా నాలుగు మ్యాచుల్లో ఓడింది. భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, అఫ్గనిస్థాన్‌లు పాక్‌ను చిత్తు చేశాయి. ఆరు మ్యాచుల్లో రెండే విజయాలతో పాక్ సెమీస్ ఆశలను వదులుకుంది. డ్రెస్సింగ్‌రూమ్‌లో సైతం ప్రశాంతత లోపించింది. ఆటగాళ్ల వేతనాల చెల్లింపులు తదితర అంశాలపై పీసీబీతో కయ్యానికి సై అంటున్నారు. మైదానంలో వైఫల్యం.. గ్రౌండ్ వెలుపల సమస్యలను మరింత జటిలం చేస్తోంది. కెప్టెన్ బాబర్ ఆజమ్ నాయకుడిగా, బ్యాటర్‌గా విఫలమయ్యాడు. మహ్మద్ రిజ్వాన్ మెరిసిన రెండు మ్యాచుల్లో పాక్ గెలుపొందగా.. అతడు నిరాశపరి చిన నాలుగు మ్యాచుల్లో ఓటమి బాట పట్టింది. అబ్దుల్లా షఫీక్, సయిద్ షకీల్, ఫకర్ జమాన్‌లు మెరిస్తే నేడు బంగ్లాపై గెలిచేందుకు అవకాశాలు ఉన్నాయి. షహీన్ షా అఫ్రిది, హరీశ్ రవూఫ్, మహ్మద్ వసీంలు బంతితో మరింత బాధ్యత తీసుకోవాల్సి ఉంది.

నిరాశలో బంగ్లా

వరుస పరాజయాలు జట్టును నిరాశలోకి నెట్టేయగా.. కెప్టెన్ షకిబ్ అల్ హసన్ చిన్ననాటి కోచ్ దగ్గర బ్యాటింగ్ టెక్నిక్‌ను సరి చేసుకునేందుకు స్వదేశానికి వెళ్లాడు. రెండు సెషన్ల బ్యాటింగ్ ప్రాక్టీస్ ముగించుకుని మళ్లీ కోల్‌కతకు చేరుకున్నాడు. గ్రూప్ దశ పోరును బంగ్లాదేశ్ మెరుగ్గానే మొదలుపెట్టినా.. ఆ తర్వాత ఆ జట్టులో పోరాట స్ఫూర్తి లోపించింది. జట్టులో నాణ్యమైన ఆటగాళ్లు ఉన్నప్పటికీ ఆశించిన ప్రదర్శన చేయటం లేదు. కెప్టెన్ షకిబ్ అల్ హసన్ బ్యాట్‌తో, బంతితో రాణిస్తే బంగ్లా రేసులో నిలువగలదు. లిటన్ దాస్, మెహిది, టాంజిద్ హసన్, నజ్ముల్ హసన్, ముష్పీకర్, మహ్మదుల్లా బంగ్లాదేశ్‌కు కీలకం కానున్నారు.

అఫ్గాన్ జిలేబి

- శ్రీలంకపై మెరుపు విజయం
- అఫ్గనిస్థాన్ ఖాతాలో మూడో గెలుపు

ఐసీసీ 2023 ప్రపంచకప్



నవతెలంగాణ-పుణె

ఐసీసీ ప్రపంచకప్‌లో అఫ్గనిస్థాన్ సంచలన ప్రదర్శన కొనసాగుతోంది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్, మాజీ చాంపియన్ పాకిస్థాన్‌ను ఓడించిన అఫ్గనిస్థాన్ తాజాగా శ్రీలంకకు చుక్కలు చూపించింది. సోమవారం పుణెలోని ఎంసీఏ స్టేడియంలో జరిగిన ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో శ్రీలంకపై ఏడు వికెట్ల తేడాతో అఫ్గనిస్థాన్ ఘన విజయం సాధించింది. 242 పరుగుల లక్ష్యాన్ని అఫ్గనిస్థాన్ 3 వికెట్లు కోల్పోయి మరో 28 బంతులు మిగిలి ఉండగానే ముగించింది. రెహమత్ షా (62, 74 బంతుల్లో 7 ఫోర్లు), హస్మతుల్లా షాహిది (58 నాటౌట్, 74 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (73 నాటౌట్, 63 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. అంతకుముందు శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు కుప్పకూలింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అఫ్గాన్ పేసర్ ఫజల్‌హాక్ ఫరూకీ (4/34) నాలుగు వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. శ్రీలంక బ్యాటర్లలో నిశాంక (46, 60 బంతుల్లో 5 ఫోర్లు), కుశాల్ మెండిస్ (39, 50 బంతుల్లో 3 ఫోర్లు), సదీర సమరవిక్రమ (36, 40 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. ప్రపంచకప్‌లో ముచ్చటగా మూడో విజయంతో పాయింట్ల పట్టికలో అఫ్గనిస్థాన్ ఐదో స్థానానికి ఎగబాకింది. పాకిస్థాన్, శ్రీలంక, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్‌లు అఫ్గాన్ దిగువన నిలిచాయి.

ఛేదనలో అదుర్స్

భారత పిచ్‌లపై ఊరించే లక్ష్యాలను ఎలా ఛేదించాలో అఫ్గాన్‌ను చూసి నేర్చుకోవాలేమో!. ఒత్తిడి, తొందరపాటుకు తావు లేకుండా ప్రణాళిక బద్ధంగా ఆడిన అఫ్గనిస్థాన్ ఆడుతూ పాడుతూ లాంఛనం ముగించింది. ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్ (0) ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే నిష్క్రమించినా.. అఫ్గాన్ అధైర్యపడలేదు. ఇబ్రహీం జద్రాన్ (39), రెహమత్ షా (62) రెండో వికెట్‌కు విలువైన 73 పరుగులు జోడించారు. ఈ ఇద్దరు నిష్క్రమించినా.. హస్మతుల్లా షాహిది (58 నాటౌట్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (73 నాటౌట్) నాల్గో వికెట్‌కు అజేయంగా 111 పరుగుల భాగస్వామ్యంతో అదరగొట్టారు. అజేయ అర్ధ సెంచరీలతో శ్రీలంకపై అదిరే విజయాన్ని కట్టబెట్టారు.

ఫరూకీ ఫటాఫట్

టాస్ నెగ్గి తొలుత బౌలింగ్ ఎంచుకున్న అఫ్గనిస్థాన్‌కు బౌలర్లు అండగా నిలిచారు. పేసర్ ఫజల్‌హాక్ ఫరూకీ (4/34) నాలుగు వికెట్ల ప్రదర్శనకు స్పిన్నర్ ముజీబ్ రెహమాన్ (2/38) జతకట్టాడు. దీంతో శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ దిముత్ కరుణరత్నె (15) వికెట్‌తో బ్రేక్ సాధించిన ఫరూకీ.. శ్రీలంకపై ఎదురుదాడి చేశాడు. పతుం నిశాంక (46), కుశాల్ మెండిస్ (39), సదీర సమరవిక్రమ (36) రాణించినా.. మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. అసలంక (22), మాథ్యూస్ (23), తీక్షణ (29) మెరవటంతో శ్రీలంక 241 పరుగులైనా చేయగల్గింది. ఫరూకీ, ముజీబ్, రషీద్ ఖాన్ బంతితో మాయ చేశారు. అజ్మతుల్లా, రషీద్ చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక ఇన్నింగ్స్ : 241/10 (నిశాంక 46, మెండిస్ 39, ఫరూకీ 4/34, ముజీబ్ 2/38)
అఫ్గనిస్థాన్ ఇన్నింగ్స్ : 242/3 (అజ్మతుల్లా 73, హస్మతుల్లా 58, రెహమత్ షా 62, మధుశంక 2/48)

కోహ్లి కోసం ముస్తాబు

ఈడెన్‌లో పండుగలా విరాట్ బర్త్‌డే



నవతెలంగాణ-కోల్‌కత

భారత క్రికెట్ కింగ్, పరుగుల యంత్రం విరాట్ కోహ్లి. స్వదేశంలో జరుగుతున్న ఐసీసీ ప్రపంచకప్‌లో ఇప్పటికే మోత మోగిస్తున్న విరాట్ కోహ్లి నవంబర్ 5న కోల్‌కతకు రానున్నాడు. ఈడెన్‌గార్డెన్స్ వేదికగా భారత్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. భారత్, సఫారీ మ్యాచ్ రోజే విరాట్ కోహ్లి పుట్టినరోజు కావటంతో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్) కింగ్ బర్త్‌డేను పండుగలా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. స్టేడియంలో 70000 మంది అభిమానులు విరాట్ కోహ్లి ఫేస్ మాస్క్‌లతో సందడి చేయనుండగా, ఇన్నింగ్స్ విరామం సమయంలో విరాట్ కోహ్లి కోసం క్యాబ్ బాణాసంచా కాల్చి స్పెషల్ లేజర్ షో ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు క్యాబ్ అధ్యక్షుడు స్నేహాశిష్ గంగూలీ తెలిపారు. 'విరాట్ కోహ్లి పుట్టినరోజు వేడుకల కోసం ప్రత్యేకంగా ఓ కేక్‌ను తయారు చేయిస్తున్నాం. కేక్ డిజైన్ విరాట్ కోహ్లిని ప్రతిబింబించే నమూనాతో ఉండనుంది. స్టేడియంలో 70 వేల మంది అభిమానులు కోహ్లి మొహంతో కూడిన మాస్క్‌లు ధరించనున్నారు. ఈడెన్‌గార్డెన్స్ మాత్రమే కాదు యావత్ కోల్‌కత కోహ్లి బర్త్‌డేను, మ్యాచ్‌ను సెలబ్రేట్ చేయనుంది' అని గంగూలీ తెలిపారు. నవంబర్ 5న విరాట్ కోహ్లి 35వ వసంతంలోకి అడుగుపెట్టనున్నారు. విరాట్ బర్త్‌డే కావటంతో భార్య అనుష్క శర్మ, కూతురు వామిక సహా కుటుంబ సభ్యులు ఈడెన్‌గార్డెన్స్‌కు రానున్నారు.

ముంబయిలో రోహిత్‌సేన

జట్టుతో చేరనున్న హార్దిక్ పాండ్య

ముంబయి : ఎకాన స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్‌ను 100 పరుగుల తేడాతో చిత్తు చేసి ప్రపంచకప్ గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన టీమ్ ఇండియా.. సోమవారం 'సిటీ ఆఫ్ డ్రీమ్స్' ముంబయికి చేరుకుంది. 2011 ప్రపంచకప్ ఫైనల్లో వాంఖడెలో శ్రీలంకపై ధోనీసేన చారిత్రక వరల్డ్‌కప్ విజయం సాధించిన గడ్డపై.. గురువారం భారత్, శ్రీలంక రీ మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి. ఇటీవల ఆసియా కప్ ఫైనల్లో భారత్ చేతిలో మట్టికరిచిన శ్రీలంక నవంబర్ 2న ఆతిథ్య జట్టుకు గట్టి పోటీ ఇవ్వటం అనుమానమే. ఇక చీలమండ గాయంతో రెండు మ్యాచులకు దూరమైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ముంబయిలో జట్టుతో చేరనున్నాడు. బెంగళూర్‌లోని ఎన్‌సీఏలో ఉన్న హార్దిక్ పాండ్య జట్టుతో చేరనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. అయితే, శ్రీలంకతో మ్యాచ్‌కు పాండ్య అందుబాటులో ఉండేది లేనిది జట్టు మేనేజ్‌మెంట్ తేల్చనుంది.

మళ్లీ బీసీసీఐ, పీసీబీ లొల్లి?

2025లో పాక్ పర్యటనకు భారత్ నిరాకరణ!



దుబాయ్ : ఓ వైపు ఐసీసీ ప్రపంచకప్ సమరం రక్తికడుతుండగా.. మరోవైపు చిరకాల ప్రత్యర్థులు బీసీసీఐ, పీసీబీ సరికొత్త కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. 2023 ఆసియా కప్ వేదిక అంశంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పంతం నెగ్గించుకుంది. పాక్‌లో అడుగుపెట్టేందుకు ససేమిరా అనేసింది. దీంతో గత్యంతరం లేక నాలుగు మ్యాచులు పాక్‌లో, మిగతా టోర్నీ శ్రీలంకలో నిర్వహించారు. ఆసియా కప్ కోసం భారత జట్టు పాక్‌కు రాకుంటే.. ప్రపంచకప్ కోసం పాకిస్థాన్ జట్టు భారత్‌లో అడుగుపెట్టదని పీసీబీ బెదిరింపులకు దిగినా బీసీసీఐ ఖాతరు చేయలేదు. 2023 ప్రపంచకప్ సంగ్రామం నవంబర్ 19న ముగియనుండగా.. పాకిస్థాన్‌కు అప్పట్నుంచి కష్టాలు మొదలు కానున్నాయి!. ఐసీసీ మరో మెగా ఈవెంట్ చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ 2025లో ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. భద్రతా కారణాల రీత్యా పాకిస్థాన్ పర్యటనకు బీసీసీఐ నో చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో పీసీబీ అయోమయంలో పడింది. ప్రపంచకప్ కోసం భారత్‌కు పాక్ జట్టు వెళ్తే.. భారత్ సైతం చాంపియన్స్ ట్రోఫీ కోసం తిరిగి వస్తుందని పీసీబీ ఆశపడింది. కానీ భద్రతా కారణాలకు బలమైన రాజకీయ, సరిహద్దు ఉద్రిక్తతలు ఉండటంతో చాంపియన్స్ ట్రోఫీకి వేదికను యుఏఈ, శ్రీలంకకు మార్పు చేయాలని ఐసీసీకి సూచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పరిణామంతో మరోసారి బీసీసీఐ, పీసీబీ యుద్ధం మొదలు కానుంది.



నవచిత్రం

భయపెట్టే.. పిండం

శ్రీకాంత్ శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటిస్తున్న చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపు కుంటోంది.
సోమవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ, 'ది స్కేరియస్ట్ ఫిల్మ్ అని చెప్పడం వల్ల భయపడి సినిమాకి రాకుండా ఉండకండి. ఏంటి మమ్మల్ని భయపడతారా అనుకొని సినిమాకి రండి. కంటెంట్‌ని నమ్ముకొని తీసిన చిత్రమిది' అని తెలిపారు.



శ్రీకాంత్ శ్రీరామ్

'డైరెక్టర్ చాలా కాన్ఫిడెంట్‌గా పక్కా హర్రర్ మూవీ తీశారు. సినిమా చాలా బాగా వచ్చింది' అని నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి అన్నారు. దర్శకుడు సాయి కిరణ్ మాట్లాడుతూ, " పిండం అనే కథ ఎలా మొదలైంది అంటే.. ఒకసారి మా అమ్మమ్మ ఊరిలో జరిగిన ఓ క్రూరమైన ఘటన గురించి చెప్పారు. అది నా మైండ్‌లో అలాగే ఉండిపోయింది. దానిని ఎలా చెప్పాలి అని ఆలోచిస్తే.. హర్రర్ జోనర్‌లో చెప్తే బాగుంటుంది అనిపించింది. ఇదొక ఇంటెన్స్ హర్రర్ ఫిల్మ్. స్క్రీన్ ప్లే చాలా ఆసక్తికరంగా ఉంటుంది' అని తెలిపారు. నాయిక ఖుషీ రవి మాట్లాడుతూ, 'తెలుగులో సినిమా చేయడం సంతోషంగా ఉంది. నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని అన్నారు.



మృణాళ్ ఠాకూర్, నాని

అందమైన రొమాంటిక్ సాంగ్

నాని తాజాగా నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'హాయ్ నాన్న'. ఈ పాన్ ఇండియా చిత్ర గ్లింప్స్, టీజర్‌కు నేషనల్ వైడ్‌గా అద్భుతమైన స్పందన వచ్చింది. మ్యూజికల్ ప్రమోషన్స్ కూడా చార్ట్ బస్టర్ నోట్‌లో స్టార్ట్ అయ్యాయి. మొదటి రెండు పాటలు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. ఫస్ట్ సింగిల్ 'సమయమా..' పాటలో నాని, మృణాల్ ఠాకూర్ మధ్య ప్రేమ, బాండింగ్‌ని అద్భుతంగా చూపించారు. రెండో పాట 'గాజు బొమ్మ..' తండ్రి, కూతురు పంచుకునే అందమైన అనుబంధాన్ని మనసుని హత్తుకునేలా చిత్రీకరించారు.
తాజాగా మేకర్స్ థర్డ్ సింగిల్ అప్డేట్‌తో వచ్చారు. థర్డ్ సింగిల్ 'అమ్మాడి..' పాటని నవంబర్ 4న విడుదల చేయనున్నారు. సాంగ్ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో నాని, మృణాల్ ఠాకూర్ లవ్లీ కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. పోస్టర్ బట్టి చూస్తుంటే ఈ పాట బ్యూటీఫుల్ రొమాంటిక్ నెంబర్ అని అర్థమౌతోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించబోతున్న మరో చార్ట్ బస్టర్ సాంగ్ కోసం ప్రేక్షకులు ఎగ్జైటింగ్‌గా ఎదురుచుస్తున్నారు అని చిత్ర బృందం తెలిపింది. శౌర్యువ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ కియారా ఖన్నా నాని కుమార్తెగా కనిపించనుంది. వైర ఎంటర్‌టైన్ మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 7న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

ఇది పక్కా బ్లాక్‌బాస్టర్ సినిమా



బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్‌భాస్కర్

దర్శకుడు తరుణ్ భాస్కర్ దాస్యం తన మూడో చిత్రంగా తెరకెక్కించిన యూనిక్ క్రైమ్ కామెడీ మూవీ 'కీడా కోలా'. విజి సైన్మా బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1 గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మిస్తున్నారు. హీరో రానా దగ్గుబాటి సమర్పిస్తున్న ఈ చిత్రం నవంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ,'తరుణ్ 'పెళ్లి చూపులు'తో నాకు లాంచ్ ఇచ్చాడు. తర్వాత 'ఈ నగరానికి ఏమైంది..' చేసి ఇంకొంతమందికి కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు ఈ సినిమాలో కూడా మంచి టాలెంటెడ్ యాక్టర్స్ కనిపిస్తున్నారు. ఈ సినిమా ఖచ్చితంగా మజా ఇస్తుంది. మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేయండి. ఈ సినిమా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది. తరుణ్‌తో ఓ సినిమా చేయబోతున్నా' అని తెలిపారు. 'ఈ సినిమాలో నటించడానికి ఏకైక కారణం.. ఇది తరుణ్ భాస్కర్ సినిమా. ఈ టీం అందరితో కలసి నేను ఓ చిన్నపిల్లోడిలా నటించే అవకాశం నాకు కలిగింది. జంధ్యాల సినిమాలు చేస్తున్నపుడు కామెడీ ఎంత హాయిగా పడిందో మళ్ళీ ఈ సినిమాకి అలాంటి అనుభూతి కలిగింది' అని బ్రహ్మానందం అన్నారు.
తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ, 'క్రైమ్ కామెడీ నా ఫేవరేట్ జోనర్. ఈ సినిమా తీసినందుకు చాలా ఆనందంగా ఫీలౌతున్నాను. నా స్నేహితులు ఉపేంద్ర, కౌశిక్, వివేక్, సాయి నన్ను ఎంతగానో సపోర్ట్ చేశారు. ఈ సినిమా మా గురించి కాదు ప్రేక్షకుల గురించి డిజైన్ చేశాం. ఎన్ని సమస్యలున్నా నవ్వు కలిగించాలనే ప్రయత్నమే ఈ సినిమా. నవంబర్ అంతా నవ్వుకోవచ్చు' అని చెప్పారు.

నవంబర్ 4న తెలుగులో రిలీజ్

శివరాజ్ కుమార్ హీరోగా రూపొందిన యాక్షన్ స్పెక్టకిల్ 'ఘోస్ట్' కన్నడ బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ కలెక్షన్లతో దూసుకెళ్తోంది. ఈనెల19న దసరా కానుకగా కన్నడలో విడుదలైన ఈ సినిమా తొలి రోజే టెర్రిఫిక్ రివ్యూస్‌తో బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. శ్రీని దర్శకత్వంలో ప్రముఖ రాజకీయనాయకులు, నిర్మాత సందేశ్ నాగరాజ్ తన సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో నవంబర్ 4న ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలో విడుదలకు సిద్ధం అవుతోంది.
'దర్శకుడు రాజమౌళి విడుదల చేసిన ఈచిత్ర ట్రైలర్‌కి ట్రెమండెస్ రెస్పాన్స్ వచ్చింది. శివరాజ్ కుమార్ పూర్తి స్థాయిలో యాక్షన్ హీరోగా నటించిన ఈ సినిమాపై తెలుగు ప్రేక్షకుల్లో మంచి అంచనాలున్నాయి. ఆ అంచనాలను ఈ సినిమా కచ్చితంగా రీచ్ అవుతుంది' అని చిత్ర బృందం తెలిపింది.



శివ రాజ్‌కుమార్



ఎ.గోకుల్ కృష్ణ, కె.టి.కుంజుమోన్

జెంటిల్‌మన్ 2 తొలి షెడ్యూల్ పూర్తి

కె.టి.కుంజుమోన్ జెంటిల్‌మన్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై 'జెంటిల్‌మన్-2' చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. చేతన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎ.గోకుల్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు.
నయనతార చక్రవర్తి, ప్రియాలాల్ కథానాయికలు. చెన్నై పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయింది. 15 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో చేతన్, నయనతార చక్రవర్తి, ప్రియా లాల్, బాడవ గోపి, సుధా రాణి, సితార, శ్రీ లత, కన్మణి, లొల్లు సభ స్వామినాథన్, బేబీ పద్మ రాగం, ముల్లై-కోతాండమ్‌లు పాల్గొన్నారు. స్టంట్ కొరియోగ్రఫర్ దినేష్ కాసి సూపర్ విజన్‌లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరించారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ మేజర్ హైలెట్‌గా ఉండబోతుంది. తదుపరి షెడ్యూల్ నవంబర్ మూడవ వారంలో ప్రారంభమవుతుంది. ఈ షెడ్యూల్ చెన్నై, హైదరాబాద్, పాండిచ్చేరిలో గ్రాండ్‌గా చిత్రీకరించనున్నారు. మిగతా షెడ్యూల్‌లను మలేషియా, దుబాయ్, శ్రీలంకలో చిత్రీకరిస్తారు.



సరికొత్త కథ

సుహాస్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.
దుశ్యంత్ కటికినేని దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామా సినిమా జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం జరిగిన వేడుకలో ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'గుమ్మా..' సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ, "గుమ్మా..' సాంగ్ వినగానే అందరికీ నచ్చుతుంది. ఈ పాటకు రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. శేఖర్ చంద్ర క్యాచీ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. ఈ సినిమాలోని ఆల్బమ్ మొత్తం బాగుంటుంది. రియల్ లైఫ్‌లో చూసిన కొన్ని ఇన్సిడెంట్స్ ఆధారంగా ఈ కథ రాసుకున్నాను' అని తెలిపారు. 'ఫ్రెష్ సబ్జెక్ట్ ఇది. ఆడియెన్స్ ఈ మూవీ చూసి ఒక మంచి ఫీల్‌తో థియేటర్ల నుంచి బయటకు వస్తారు' అని హీరో సుహాస్ చెప్పారు. నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, 'మూవీని జనవరి ఎండ్‌లో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.


థ్రిల్ చేసే 8 ట్విస్టులు..

'మాఊరి పొలిమేర' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందిన డా.అనిల్ విశ్వనాథ్ తాజాగా 'మా ఊరి పొలిమేర-2'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'పొలిమేర' చిత్రానికి సీక్వెల్ ఇది. సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల నటించిన ఈ చిత్రానికి గౌరికృష్ణ నిర్మాత. నవంబరు 3న ఈ చిత్రాన్ని ప్రముఖ పంపిణీదారుడు వంశీ నందిపాటి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు.
ఈ నేపథ్యంలో సోమవారం దర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్ మీడియాతో మాట్లాడుతూ, 'పొలిమేరకి సీక్వెల్ చేయటానికి కారణం ఒకటే..



డా. అనిల్ విశ్వనాథ్

కథ రాసుకున్నప్పుడే సీక్వెల్ ఫిక్స్ అయ్యాం. కథలో ఉన్న సీరియస్ నెస్, ఇంకా చెప్పాలనుకున్న కథను పార్ట్ 2లో చెబుతున్నాం. ఎక్కడైతే పార్ట్ 1 ముగిసిందో.. పార్ట్ 2 అక్కడే మొదలవుతుంది. ఇది పక్కా సీక్వెల్. 'కార్తికేయ' చిత్రానికి దీనికి పోలిక ఉందా అని చాలా మంది అడుగుతున్నారు. గుడి అనే కామన్ పాయింట్ తప్ప ఆ చిత్రానికి మా చిత్రానికి ఎటువంటి సంబంధం లేదు. సినిమా చూస్తే మీకూ తెలుస్తుంది. ఈ చిత్రంలో ప్రేక్షకులు ఊహించలేని ఎనిమిది ట్విస్ట్‌లు ఉంటాయి. పార్ట్ 1కు మించి పది రెట్ల థ్రిల్ ను ఫీలవుతారు. పతాక సన్నివేశాలు షాకింగ్‌గా ఉంటాయి. 'పొలిమేర 3' కథ కూడా రెడీ ఉంది' అని తెలిపారు.



మన దేశంలో మహిళలు సరైన ఆహారం తినట్లేదని సర్వేలు చెబుతున్నాయి. అందుకే కొన్ని ఆహారాలూ మన డైట్‌లో చేర్చుకుంటే ఆరోగ్యానికి మేలు జరగడంతో పాటు అధిక బరువు సమస్యా పోతుంది. కొన్ని రకాల ఆహారాలు తింటే బరువు పెరుగుతాం.. కొన్ని తింటే బరువు తగ్గుతాం. ఏ ఆహారమైతే తిన్న తర్వాత వంద శాతం జీర్ణం అవుతుందో అలాంటి ఆహారం వల్ల బరువు పెరిగే సమస్య ఉండదు. కొవ్వు, డాల్డా, షుగర్, ఆయిల్ వంటివి అంత త్వరగా జీర్ణం కావు. అవి పేగుల్లో, ఆహార నాళాల్లో పేరుకుపోతాయి. రక్తంలో చేరి ఒళ్లంతా స్టాక్ అవుతాయి. అవే కొవ్వుగా మారి బాడీకి బరువును పెంచుతాయి. ఈ కొవ్వును తగ్గించుకోవడం ఓ సమస్య అయితే కొత్తగా మరింత కొవ్వు చేరకుండా చేసుకోవడం మరో ముఖ్యమైన అంశం. ఈ కొవ్వును కరిగించుకోవడానికి వ్యాయామాలు చేయడం, వాకింగ్, జాగింగ్, వర్కవుట్లతో పాటూ... తినే ఆహారంలో చాలా మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా కొవ్వును కరిగించే ఆహారం తినాలి. అవేంటో తెలుసుకుందాం.

ప్రపంచంలోనే ఏకైక ఆర్చర్

శీతల్ దేవికి కోచ్‌గా కుల్‌దీప్ వేద్వాన్ వ్యవహరించారు. ఆయనే ఆమెకు ఎంతో శ్రద్ధగా ఆర్చరీలో శిక్షణ ఇచ్చారు. కోచ్ సహకారంతో రెండు చేతులు లేకపోయినా కాళ్లతోనే బాణాలు వేయడం సాధన చేసింది. మెల్లమెల్లగా సాధారణ ఆర్చర్లతో పోటీపడే స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం ప్రపంచంలో రెండు చేతులు లేకుండా పోటీపడుతున్న ఏకైక ఆర్చర్ శీతల్ దేవీ కావడం గొప్ప విశేషం. చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన పారా ఆసియా క్రీడల్లో మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో అలీమ్ సహిదా (సింగపూర్)ను ఓడించి స్వర్ణం సాధించింది ఆమె. మిక్స్‌డ్ టీమ్‌లో స్వర్ణం గెలిచింది. ఒకే క్రీడలో రెండు పసిడి పతకాలు నెగ్గిన తొలి భారత మహిళా అథ్లెట్‌గా కూడా ఆమె ఘనత సాధించింది. మహిళల డబుల్స్‌లోనూ శీతల్ రజతం గెలిచింది. 2024 పారిస్ పారాలింపిక్స్‌లోనూ భారత్‌కు పతకాలు సాధించాలని శీతల్ లక్ష్యంగా పెట్టుకుంది.



బరువు తగ్గించే ఆహారం



○ కాలిఫ్లవర్‌లో కేలరీలు తక్కువే. ఓ కప్పు కాలీఫ్లవర్‌లో 25 కేలరీలే ఉంటాయి. అందువల్ల మీరు దీన్ని ఎంత తిన్నా పెద్దగా బరువు పెరగరు. మహిళలకు ఇది సరైన ఆహారం. 46 నుంచి 51 ఏండ్ల వయసు వారు వేగంగా బరువు తగ్గాలంటే ఇదే తినాలి.

○ ఓ కప్పు చిక్కుడు కాయల్లో 31 కేలరీలు ఉంటాయి. కొవ్వు ఉండదు. షుగర్ కూడా 3.6 గ్రాములే ఉంటుంది. పైగా సి,కె,ఎ విటమిన్లు, కెరాటెనాయిడ్స్, యాంటీఆక్సిడెంట్స్, ఫైబర్ ఉంటాయి. ఇది కూడా మహిళలకు బరువు తగ్గేందుకు సరైన ఆహారం.



○ సలాడ్లు, శాండ్‌విచ్‌లలో కాప్సికం యాడ్ చేసుకుంటే బరువును వేగంగా తగ్గిస్తుంది. ఈ రంగుల ఆహారంలో కేలరీలు తక్కువే. పైగా కొవ్వును కరిగించే లక్షణం ఉంటుంది. ఇందులో ఉండే విటమిన్ సి పొట్ట, నడుం చుట్టూ ఉండే కొవ్వును కరిగిస్తుంది.

○ ఆకుకూరల్లో పోషకాలు బాగా ఉంటాయి. కేలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ. ఈ ఫైబర్ వల్ల అనవసరంగా ఏదీ తినబుద్ధి కాదు. స్నాక్స్ వంటివి ఎక్కువ తినకుండా ఇది అడ్డుకుంటుంది. తద్వారా బరువు తగ్గుతారు.



○ క్యారెట్ కంటికే కాదు ఒంటికీ మంచిదే. ఇందులోనూ కేలరీలు తక్కువే. పైగా ఇందులోని బీటా కెరోటిన్, ఫైబర్ ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తాయి. క్యారెట్లను జ్యూస్, సలాడ్, స్మూతీలుగా తీసుకోవచ్చు. కొవ్వును బాగా కరిగిస్తుంది.

○○ సీజన్‌లో వచ్చే స్ట్రాబెర్రీల్లో సీ విటమిన్, ఫైబర్ ఎక్కువ. అందువల్ల ఇది కొవ్వును కరిగించగలదు. ఓ కప్పు స్ట్రాబెర్రీలు తింటే... మీకు రోజువారీ కావాల్సిన విటమిన్ సీ... 163 శాతం లభిస్తుంది. ఇందులో కేలరీలు తక్కువ, యాంటీఆక్సిడెంట్స్ ఎక్కువ. కాబట్టి ఎంతో ఆరోగ్యం.



○ యాపిల్, పియర్స్ ఈ రెండూ బరువు తగ్గడానికి సరైన ఆహారాలు. ఎందుకంటే వీటిలో వేడిని తగ్గించే లక్షణం ఉంటుంది. ఫైబర్ ఉంటుంది. ఈ ఫైబర్ వల్ల యాపిల్, పియర్స్ వంటివి తిన్నాక... పొట్ట నిండినట్టు అనిపిస్తుంది. ఇంకేమీ తినబుద్ధి కాదు. పైగా వీటిలో కేలరీలు చాలా తక్కువ. కాబట్టి ఎన్నితిన్నా బరువు పెరగరు.

కాలితో విల్లు పట్టి...

కాలితో విల్లును నిటారుగా నిలబెట్టింది. నోటితో బాణం లాగి పట్టింది. గురి చూసి కొట్టింది. కట్ చేస్తే దేశానికి మూడు పతకాలు సాధించింది. సాధారణంగా ఆర్చర్లు ఎవరైనా ఒక చేత్తో విల్లుని పట్టుకుని, మరో చేత్తో బాణాలు సంధిస్తారు. ఎంత సాధన చేసి పోటీలోకి దిగినా చాలా సార్లు గురితప్పుతారు. అలాంటిది రెండు చేతులు లేకుండా బాణాలు వేయడం గురించి ఒక్కసారి ఊహించుకోండి... నిజంగా నమ్మలేకపోతున్నారు కదూ..! కానీ ఇది నిజం. ఆ అద్భుతాన్ని చేసింది శీతల్ దేవి. రెండు చేతులు లేకపోయినా కాలివేళ్లతో విల్లు పట్టి బాణాలు సంధిస్తూ పారా ఆసియా క్రీడల్లో పోటీకి దిగింది. అంతేకాదు ఆ పోటీల్లో స్వర్ణం సాధించిన మొదటి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది. ఆ వివరాలు ఏంటో మనమూ తెలుసుకుందాం...

పదహారేండ్ల శీతల్ కమ్మూకాశ్మీర్‌లోని కిష్టవార్ గ్రామంలో పుట్టింది. వీరిది నిరుపేద కుటుంబం. తండ్రి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి గొర్రెలను కాస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. శీతల్‌కు చిన్నతనం నుండే ఫొకోమేలియా అనే అనారోగ్య సమస్య వుంది. ఈ వ్యాధి కారణంగా ఆమెకు రెండు చేతులు ఎదగలేదు. దాంతో కాళ్లతోనే పనులు చేసుకోవడం నేర్చుకుంది. రెండు చేతులు లేని శీతల్‌కు చెల్లెలు శివానీనే ఆత్మీయ స్నేహితురాలు. ఆమె అవసరాలన్నీ చెల్లెలు, తల్లీ చూసుకుంటారు. ఆమెకు అన్ని విధాలుగా సహకరిస్తుంటారు.

ఆర్మీ దత్తత తీసుకుని...

మొదటి నుండి ఆటలంటే మక్కువ చూపే శీతల్‌కు అనుకోకుండా ఓ మంచి అవకాశం వచ్చింది. ఇండియన్ ఆర్మీ నిర్వహించిన ఓ క్రీడా శిబిరంలో పాల్గొంది. అదే ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. క్రీడల్లో ఎంతో ఆసక్తి ఉన్న శీతల్‌ను చిన్నతనంలోనే ఇండియన్ ఆర్మీ దత్తత తీసుకుంది. దాంతో ఆటలపై ఆమెకు మరింత ఆసక్తి పెరిగింది. ఆర్చరీపై మక్కువ పెంచుకొని సాధన చేసింది.

ప్రత్యేక కారు కానుకగా...

బెంగుళూరు సైట్ సీయింగ్ కోసం వెళ్ళినప్పుడు శీతల్ తన స్నేహితుని కారు స్టీరింగ్‌పై కాలు పెట్టి 'నేనూ ఏదో ఒక రోజు కారు నడుపుతాను' అంది. ఈ రోజు ఆమె కల నిజం కాబోతోంది. అదెలాగంటే... అంతర్జాతీయ వేదికల్లో భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన క్రీడాకారులకు కార్లను బహుమతిగా ఇస్తుంటారు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా. ప్రతిభను గుర్తించడంలో, సామాన్యులను ప్రోత్సహించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. ఈయన తాజాగా చేసిన ఓ పోస్టు అందరిలో స్ఫూర్తినింపుతోంది. నెటిజన్ల చేత ప్రశంసల వర్షం కురిపిస్తోంది. 'చేతులు లేకున్నా.. పారా ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, భారత్‌కు రెండు స్వర్ణ పతకాలను సాధించిపెట్టిన శీతల్ దేవికి ప్రత్యేక కారును బహూకరిస్తాను' అని ఆయన ప్రకటించారు. తమ కంపెనీ అందిస్తున్న కార్లలో దేన్నైనా ఆమె ఎంచుకోవచ్చని ఆయన శీతల్‌కు ఆఫర్ ఇచ్చారు. అంతేకాదు.. ఆమె ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా కారుకు మార్పులు చేసి అందజేస్తామని కూడా చెప్పారు. ఇలా కారు నడపాలనే శీతల్ కల నిజం కాబోతోంది.

మన సమస్యలు చాలా చిన్నవి

పారా ఆసియా క్రీడల్లో ఆర్చరీకి సంబంధించిన పలు విభాగాల్లో భారత్‌కు మొత్తం 3 పతకాలు (2 స్వర్ణం, 1 రజతం) సాధించి పెట్టిన ఆమె పట్టుదల, ప్రతిభకు ముగ్ధుడైన ఆనంద్ మహీంద్రా శీతల్‌కు కారును కానుకగా ఇవ్వడమే కాకుండా ఆమెపై ప్రశంసలు కురిపించారు. శీతల్ జీవిత కథను తెలిపే ఓ ప్రత్యేక వీడియోను 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా తన ఫాలోవర్స్‌కు షేర్ చేశారు. 'ఆమె ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఒక ఉపాధ్యాయురాలు. ఇకపై నేను చిన్న చిన్న సమస్యలపై ఫిర్యాదు చేయబోను..' అంటూ ఆనంద్ మహీంద్రా పోస్ట్ చేశారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలనే సందేశాన్ని ఇచ్చారు. శీతల్ దేవికి ఉన్న అవరోధాల ముందు మన సమస్యలు చాలా చిన్నవని అంటూ ఆయన చెప్పకనే చెప్పారు.





భారత్‌లో అతిపెద్ద డేటా లీక్?

(మొదటిపేజీ తరువాయి)

మోడీ సర్కారు.. ఈ డేటా లీక్ ఆరోపణలపై సమాధానం చెప్పాలని సామాజికవేత్తలు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమాచారం ఇంకా ఎవరి చేతుల్లోకి వెళ్లిందో అనే విషయంపై లోతుగా దర్యాప్తు జరగాలని వారు అంటున్నారు. ఇందులో మోడీ సర్కారు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నదని చెప్తున్నారు.విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. డార్క్ వెబ్‌లోని పౌరుల డేటాబేస్‌ను ప్రచారం జరిగింది. ఇందులో 81.5 కోట్ల మంది భారతీయ పౌరుల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామాలతో పాటు ఆధార్, పాస్‌పోర్ట్ సమాచారం ఉన్నది. పౌరుల కోవిడ్-19 పరీక్ష వివరాల నుంచి సేకరించిన డేటా ఐసీఎంఆర్ నుంచి తీసుకోబడిందని ఇందులో పేర్కొనబడటం గమనార్హం.ఐసీఎంఆర్ ఫిబ్రవరి నుంచి అనేక సైబర్ దాడి ప్రయత్నాలను ఎదుర్కొంటున్నది. ఇటు కేంద్ర ఏజెన్సీలదీ అదే బాధ. ఐసీఎంఆర్ సర్వర్‌లను హ్యాక్ చేయడానికి గతేడాది 6,000కు పైగా ప్రయత్నాలు జరగటం గమనార్హం. ఏదైనా డేటా లీక్‌ను నివారించడానికి నివారణ చర్యలు తీసుకోవాలని ఏజెన్సీలను ఐసీఎంఆర్ కోరినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పీడబ్ల్యూఎన్0001 అనే మారుపేరుతో ఒక వ్యక్తి రుజువుగా నాలుగు పెద్ద లీక్ నమూనాలను కలిగి ఉన్న స్ప్రెడ్‌షీట్‌లను పంచుకోవటం గమనార్హం. ఈ విషయం యొక్క సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకొని వివిధ ఏజెన్సీలు, మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులందరూ రంగంలోకి దిగినట్టు సమాచారం. లీక్‌లో విదేశీ నటీనటులు ప్రమేయం ఉన్నందున దానిని ఒక ప్రీమియర్ ఏజెన్సీ ద్వారా విచారించడం చాలా ముఖ్యం అని సామాజికవేత్తలు, విశ్వసనీయ వర్గాలు తెలుపుతున్నాయి. భారతదేశ ఆరోగ్య వ్యవస్థను హ్యాకర్లు టార్గెట్ చేయడం ఇదే మొదటిసారి కాదు. గతేడాది ఏయిమ్స్ సైబర్‌దాడిని ఎదుర్కొన్నది. ఇది వివిధ వ్యవస్థలలో మార్పులను ప్రేరేపించింది.

బీజేపీతో బంధం వినాశకరం

(మొదటిపేజీ తరువాయి)

కలిగిస్తోందని విమర్శించారు. మరోవైపు ఎస్సీ, ఎస్టి సబ్ ప్లాన్ నిధుల ను తగినంతగా కేంద్ర ప్రభుత్వం కేటాయించట్లేదని అన్నారు. అరకొరగా కేటాయించిన నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం మళ్లిస్తోందని విమర్శించారు.

సాధికార యాత్ర చేపట్టే నైతిక హక్కు వైసీపీకిలేదు : వి శ్రీనివాసరావు

రాష్ట్రంలో సామాజిక సాధికార యాత్ర చేపట్టే నైతిక హక్కు వైసీపీ ప్రభుత్వానికి లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాల్లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అడవులు, భూములు, గనులు వంటి సహజ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో వైసీపీ జతకట్టిందని విమర్శించారు. ఉపాధి నిధులు కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని, అరకొరగా వచ్చిన విధులను సీఎం జగన్ మళ్లిస్తున్నారని తెలిపారు. పేదలకు, దళితులకు, గిరిజనులకు ఇచ్చిన భూములను లాగేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికీ గిరిజన గ్రామాల్లో తాగునీరు, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాలు తగినంతగా లేవన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించుకోవాలి : అశోక్ ధావలే

రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా ఆదోని ప్రజారక్షణ భేరిని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, కర్నూలులో బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లాలో ప్రధాన పంట అయిన పత్తి గతంలో ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని, ఇప్పుడు ఒకటి, ఒకటిన్నర క్వింటాళ్లు మాత్రమే వస్తోందని, అలాంటి దుర్భర పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కరువు నివారణ చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. అత్యధిక ప్రాంతాల్లో పండే వరికి క్వింటాలుకు కేంద్రం రూ.2,100 మాత్రమే మద్దతు ధర ప్రకటించిందని, కేరళలోని వామపక్ష ప్రభుత్వం రూ.2,850 ఇస్తోందని తెలిపారు. దేశానికి, అసమానతలు లేని అభివృద్ధికి వామపక్షాలే ఏకైక ప్రత్యామ్నాయన్నారు. విద్యను ప్రయివేటీకరణ చేయడానికి కేంద్రం నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చిందనీ, చరిత్రను వక్రీకరించి ఆర్‌ఎస్‌ఎస్ పాఠాలు చేరుస్తున్నారని, విద్యను కాషాయీకరణ చేయాలని చూస్తున్నారని తెలిపారు. బీజేపీతో కలిసి వెళ్లే ఏ పార్టీతోనూ సీపీఐ(ఎం) కలిసి వెళ్లదని స్పష్టం చేశారు.

ఆ హక్కు ప్రజలకు లేదు


నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన ఎన్నికల బాండ్ల పథకంపై తన వాదనను కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంది. ఈ పథకం ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని పేర్కొంది. రాజకీయ పార్టీలకు స్వచ్ఛమైన ధనం విరాళంగా అందించాలనే ఉద్దేశంతోనే ఈ పథకం తీసుకొచ్చామని తెలిపింది. అయితే, ఆ విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకునే హక్కు ప్రజలకు లేదని పేర్కొంది. ఈ మేరకు సోమవారం కేంద్రం తరపున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి సుప్రీంకోర్టుకు లిఖితపూర్వక వాదనలు సమర్పించారు.

ఎన్నికల బాండ్ల పథకం చెల్లుబాటును సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లపై అక్టోబరు 31న (మంగళవారం) సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తుది విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా కేంద్రం తన లిఖితపూర్వక వాదనలను కోర్టుకు సమర్పించింది. ఎలక్టోరల్ బాండ్ల పథకం "రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2) పరిధిలో ఉంది" అని పేర్కొన్నారు. "ఈ పథకంతో విరాళాలు ఇచ్చే వారి వివరాలు చాలా గోప్యంగా ఉంటాయి. స్వచ్ఛమైన మార్గాల్లో డబ్బును సమకూర్చుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది. పన్ను బాధ్యతలను కూడా సక్రమంగా నెరవేర్చేలా చేస్తుంది. అందువల్ల ఎలాంటి నిబంధనలు, హక్కులను ఈ పథకం ఉల్లంఘించట్లేదు" అని అటార్నీ జనరల్ తెలిపారు.

రాజ్యాంగం ప్రకారం.. అభ్యర్థుల పూర్వాపరాలను తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని, అయితే.. ప్రతిదీ తెలుసుకునే హక్కు వారికి లేదని అటార్నీ జనరల్ పేర్కొన్నారు. ఎన్నికల బాండ్లు సమాచారం పబ్లిక్ డొమైన్లలో ఉండదని, రాజకీయ పార్టీలకు విరాళాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ద్వారా తెలుసుకునే హక్కు కూడా ప్రజలకు లేదని పేర్కొన్నారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డికి కత్తిపోట్లు



(మొదటిపేజీ తరువాయి)



వెళ్లడానికి సిద్ధమవుతున్న క్రమంలో పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన రాజు (యూట్యూబ్ చానెల్ రిపోర్టర్) సెల్ఫీ దిగేందుకు వచ్చి ఎంపీని ఉన్నట్టుండి ఒక్కసారిగా కత్తితో పొడిచాడు. దాంతో పొట్టపై భాగంలో గాయాలయ్యి తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన కార్యకర్తలు ఎంపీని వాహనంలో హుటాహుటిన గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన రాజుకు దేహశుద్ధి చేశారు. అనంతరం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఘటనపై సీపీ శ్వేత దర్యాప్తు జరుపుతున్నారు. నారాయణఖేడ్ సభకు వెళ్తుండగా మంత్రి హరీశ్‌రావుకు ఎంపీపై దాడి సమాచారం తెలియడంతో వెంటనే గజ్వేల్‌కు చేరుకుని, ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలించారు.

హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో వైద్యులు ప్రభాకర్‌రెడ్డికి ఆపరేషన్ చేశారు. చిన్న పేగుకు నాలుగుచోట్ల గాయాలైనట్టు వైద్యులు తెలిపారు. గాయం కారణంగా రక్తం కడుపులో పేరుకుపోవడంతో 15 సెంటిమీటర్లు కట్ చేశామని, పేరుకుపోయిన రక్తం శుభ్రం చేశామని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదన్నారు. గ్రీన్ చానల్‌తో హైదరాబాద్ తరలించకుంటే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల ప్రచారం ముగించుకుని నేరుగా సీఎం కేసీఆర్ యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించారు. ఆయనకు ధైర్యం చెప్పారు. ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాగా, ఎంపీపై కత్తి దాడి జరగడంతో సూరంపల్లి రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు దాగారు. పోలీస్ వాహనంపై కూడా దాడి చేశారు. కొత్త ప్రభాకర్ రెడ్డికి చికిత్స అందిస్తున్న హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రి వద్దకు దుబ్బాక నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు తరలివచ్చి.. ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. "రఘునందన్ రావు డౌన్.. డౌన్.., బీజేపీ రౌడీల్లారా" అంటూ నినాదాలు చేశారు. దాంతో స్థానిక పోలీసులు ముందు జాగ్రత్తలు చేపట్టి నాయకులను ఆస్పత్రి నుంచి బయట పంపించారు.

దాడిని గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, మంత్రులు, బీఆర్ఎస్ నేతలు, ప్రతిపక్ష నాయకులు ఖండించారు.

ఈ దాడి ప్రభాకర్ రెడ్డిపై కాదు, నాపై జరిగింది : కేసీఆర్

"ఇది ప్రభాకర్ రెడ్డి మీద జరిగిన దాడి కాదు.. కేసీఆర్ మీద దాడి జరిగినట్టు కనిపిస్తోంది' అని కేసీఆర్ అన్నారు. చేతగాని దద్దమ్మలు, వెధవలు పని చేసే చేతగాక, ఎన్నికలు ఫేస్ చేసే దమ్ము లేక హింసకు, దాడులకు దిగ జారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కత్తులు పట్టి మా పార్టీ అభ్యర్థుల మీద దాడి చేస్తున్నారు. కత్తి పట్టుకొని పొడవాలంటే ఇంత మంది ఉన్నాం.. మాకు చేతులు లేవా..? మొండిదో లండిదో మాకో కత్తి దొరకదా..? మాకు తిక్కరేగితే.. రాష్ట్రంలో దుమ్ము దుమ్ము రేగుతుంది.. తస్మాత్ జాగ్రత్త" అని బాన్సువాడ సభలో కేసీఆర్ హెచ్చరించారు.

ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదుర్కోవాలి : కేటీఆర్, హరీశ్‌రావు

ప్రజాస్వామ్యంలో రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప వ్యక్తులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు అన్నారు. ప్రచారంలో కత్తిపోటుకు గురై సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించిన అనంతరం మంత్రులు విలేకరులతో మాట్లాడారు. ప్రభాకర్ రెడ్డి పదేండ్ల నుంచి మెదక్ ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిపై దాడులు చేయడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై ఎన్నికల సంఘం చర్యతు తీసుకుంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ప్రభాకర్ రెడ్డి దాడిలో సెక్యూరిటీ చేతికి కూడా గాయాలయ్యాయని తెలిపారు.

వాస్తవం లేదు : రఘునందన్‌రావు

దాడికి తానే కారణమని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. దాడితో తనకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. దాడి జరగడం దురదృష్టకరమన్నారు. నిందితుడు ఓ చానెల్ రిపోర్టర్ అని వెబ్‌లో ఉందని, నిందితుడు ఏ పార్టీ వ్యక్తి అనేది పోలీసులు స్పష్టంగా చెబితే బాగుంటుందన్నారు. దళితబంధు రాలేదనే ఆవేదనతోనే దాడి చేశాడని మీడియాలో వచ్చిందన్నారు. పోలీసులు విచారణ జరిపి వాస్తవాలను బయట పెట్టాలన్నారు.

గాజాపై దాడులు అమానవీయం

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మనమందరం సమిష్టిగా మేల్కొనేలోపు ఇంకా ఎంతమంది ప్రాణాలు బలికావాలని ప్రశ్నించారు. ఇటీవల గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను ఆపాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్ హమాస్ మధ్య తక్షణ, స్థిరమైన సంధి, శతృత్వ విరమణకు పిలుపునిచ్చేలా ఐక్యరాజ్యసమితి తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు కావడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.

సారూ...జర ఇటు చూడు

(మొదటిపేజీ తరువాయి)

శవాలకు పోస్టుమార్టం చేస్తుండటంతో 60 బాక్సులు సరిపోతున్నాయి. వీటిలో కొన్ని సరిగా పని చేయకపోవడంతోనే సమస్య తలెత్తున్నది. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆ విభాగం వైద్యులు ఇప్పటికే సంప్రదించగా బాక్సుల మరమ్మతుల కోసం ఆదేశించినట్టు తెలుపగా, మరోవైపు మరమ్మతులు చేయాల్సిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో మరమ్మతులకు ముందుకు రావడం లేదని సమాచారం. దీంతో ప్రతి రోజు ఆ విభాగంలో వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామని సిబ్బంది వాపోతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని సిబ్బంది కోరుకుంటున్నారు.

మా సహనం నశిస్తే దుమ్ము దుమ్మే...


(మొదటిపేజీ తరువాయి)

ఇస్తున్నామని చెప్పారన్నారు. మాకు సహనం నశిస్తే కాంగ్రెస్ వాళ్ల దుమ్ము దుమ్ము అవుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నారాయణఖేడ్ ఎట్లుండేదో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎట్లా ఉన్నదో ప్రజలు గమనించాలన్నారు. నారాయణఖేడ్ కరువుతో అల్లాడిన సమయంలో నేను మంత్రిగా ఈ ప్రాంతాన్ని పర్యటించానని, మంచినీళ్ల కోసం బిందెలతో మహిళలు కిలోమీటర్ల కొద్ది పోవాల్సిన పరిస్థితిని కళ్లారా చూసానని తెలిపారు. సింగూరు జలాలను నారాయణఖేడ్‌లోని మెట్ట ప్రాంతానికి అందించాలన్న లక్ష్యంతో బసవేశ్వర ప్రాజెక్టు చేపట్టినట్టు తెలిపారు. నియోజకవర్గంలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇరిగేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన రహదారులు, విద్యా సంస్థలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నల్లవాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, మాసంపల్లి రోడ్డు మంజూరు, బీసీ గురుకులంతో పాటు నియోజకవర్గానికి కావాల్సిన పనులన్నీ చేసే బాధ్యత ముఖ్యమంత్రిగా తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్మెన్ బిక్షపతి, ఎమ్మెల్సీ రఘుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రుబీనా నజీబ్, తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ 24 గంటలు కరెంట్ ఇస్తుంటే.. 5 గంటలు కరెంట్ చూసేందుకు రావాల్నా?

"కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలంగాణకు వచ్చి తమ రాష్ట్రంలో 5 గంటల కరెంటు ఇస్తున్నమని గప్పాలు చెప్పిండు. కావాలంటే మీరు వచ్చి సూడుండ్రి బస్సులు పెడతం అన్నడు. మేం 24 గంటల కరెంటు ఇస్తుంటే.. మీ 5 గంటల కరెంటు సూడనీకి మేమెందుకు రావాలె" అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. కామారెడ్డి జిల్లా జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గ కేంద్రాల్లో ఆయా అభ్యర్థులు హన్మంత్‌షిండే, పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రజాఆశీర్వాద సభల్లో సీఎం ప్రసంగించారు. జుక్కల్ నియోజకవర్గం కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసే చోట ఉన్నదని, కర్నాటకలో ఏం జరుగుతున్నదో, మహారాష్ట్రలో ఏం గతి ఉన్నదో మీకందరికీ తెలుసని సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర పెద్ద రాష్ట్రమైనా అక్కడ రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదన్నారు. దేశంలో తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. కర్నాటకలో 24 గంటల కరెంటు ఇస్తమని కాంగ్రెస్ ఓట్లు వేయించుకొని, తీరా గెలిచాక 5 గంటలే ఇస్తున్నారని తెలిపారు. దాంతో కరెంటు లేక పంటలకు నీళ్లు చాలడం లేదని రైతులు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు అనేక పార్టీలు వస్తాయని.. అనేక మంది నాయకులు అనేక మాటలు చెబుతారని, కాని ఆలోచించి అభివృద్ధి చేసిన వ్యక్తికి ఓటు వేయాలని సూచించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని లక్ష పైచీలుకు ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు.

'నో' చెప్పొచ్చు..



ప్రజాస్వామ్యంలో ఓటు ప్రజలకు వజ్రాయుధం. మన బాగోగులను పట్టించుకునే వారికి పట్టం కట్టే అవకాశం ఎన్నికలతో మనకొస్తుంది. అలాంటి ఓటు పట్ల నేడు గ్రామాలతో పోలిస్తే విద్యావంతులు అధికంగా ఉండే పట్టణాల్లో ఆసక్తి రోజురోజుకూ తగ్గుతోంది. తెలంగాణలో 2009 ఎన్నికల్లో 67 శాతం పోలింగ్ నమోదైతే 2014లో 72 శాతానికి పెరిగింది. దీనికి భిన్నంగా రాజధాని హైదరాబాద్ నగరంలో 2009లో 58 శాతం నమోదైతే 2014లో 53 శాతానికి తగ్గింది. ఇదే పరిస్థితి దేశంలోని మిగతా నగరాల్లో కూడా ఉంది. ప్రభుత్వం సెలవు ప్రకటిస్తే టీవీలకు అతుక్కుపోతున్నారు. మనం ఓటు వేయకపోతే ఏమవుతుంది? ఎవరు గెల్చినా ఏం లాభం? అందరి రాజకీయ చరిత్ర ఒక్కటే కదా అనే అసంతృప్తి వారిలో నెలకొంది. ఓటర్లకు నచ్చని అభ్యర్థులను తిరస్కరించే అవకాశం కూడా ఉండాలని కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే.. ఓటర్లకు ఆ వెసులబాటు ఉండాలని ఉన్నత న్యాయస్థానం 2013లో తీర్పు చెప్పింది. దీంతో ఆ సంవత్సరంలో జరిగిన కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో నోటాను తీసుకొచ్చారు. 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పాటు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా 'నోటా' ప్రవేశపెట్టారు. మొదట్లో నోటాకు ప్రత్యేక చిహ్నం ఇవ్వలేదు. 2015 నుంచి ఎన్నికల్లో ఈవీఎం బ్యాలెట్ చివరిలో కొట్టివేత (ఇ) గుర్తును కేటాయించారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో నోటాకు దేశవ్యాప్తంగా సుమారు 60 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఇవి 21 పార్టీలకు పోలయిన ఓట్ల కంటే అధికం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 30 వేల ఓట్లు నోటాకు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల్లో 0.7 శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 0.6 శాతంగా నమోదయ్యాయి. ఈ ఏడాది ఆరంభంలో గుజరాత్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 21 స్థానాల్లో గెలుపొందిన అభ్యర్థులకు వచ్చిన మెజార్టీ కంటే నోటాకు పోలైన ఓట్లు అధికంగా వచ్చాయి. ఒక నియోజకవర్గంలో అభ్యర్థులందరి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు పోలయినా అభ్యర్థుల్లో అధికంగా ఓట్లు పొందిన వారిని విజేతగా ప్రకటిస్తారు.

పోటీకి నిర్వాసితులు

అదేబాటలో ఉద్యమకారులు ● హుస్నాబాద్, సిద్దిపేట, కామారెడ్డిలో నామినేషన్లు వేసేందుకు సిద్ధం

పోరాట రూపాలకు కాదేదీ అనర్హం అన్నట్టుగా బాధితులు ఎన్నికల్ని సైతం పోరాట ఆయుధంగా మార్చుకుంటున్నారు. పాలకుల చేత బాధించబడిన, నిర్లక్ష్యానికి గురికాబడిన బాధితులు ఎన్నికల వేళ తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. తమ సమస్యను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ బ్యాలెట్ పోరాటం కొత్తదేమీ కాకపోయినా తాజా ఎన్నికల్లో చర్చనీయాంశం కాబోతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఫ్లోరైడ్ సమస్య నుంచి విముక్తి చేయండంటూ నల్లగొండలో వందలాది మంది ఎన్నికల్లో పోటీ చేసి నిరసన తెలిపారు. తెలంగాణలోనూ పసుపు రైతులు మూకుమ్మడిగా నామినేషన్లు వేసిన విషయం విదితమే. తాజాగా సిద్దిపేట జిల్లాలో బాధితులు అలాంటి పోరాటానికి సిద్ధమవుతున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో గౌరవెల్లి ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన నిర్వాసితులు 100 మంది ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. పక్కనే ఉన్న సిద్దిపేట నియోజకవర్గంలో తెలంగాణ ఉద్యమకారులు కూడా 200 మంది వరకు నామినేషన్లు వేసి తమ నిరసన గళాన్ని వినిపించేందుకు సై అంటున్నారు.

గౌరవెల్లి నిర్వాసితులకు అందని పరిహారం
గుర్తింపునకు నోచని తెలంగాణ ఉద్యమకారులు

నిర్వాసితులపై అక్రమ కేసులు



బీఆర్ఎస్‌కు నిర్వాసితులు, ఉద్యమకారుల టెన్షన్

హుస్నాబాద్‌లో నిర్వాసితులు, సిద్దిపేటలో ఉద్యమకారులు.. వందల సంఖ్యలో నామినేషన్లు వేసేందుకు సిద్ధం అవుతుండటంతో బీఆర్ఎస్‌లో టెన్షన్ మొదలైంది. ఇప్పటికే రోడ్ రోలర్ గుర్తు వల్ల గత ఎన్నికల్లో చేదు ఫలితాల్ని చవిచూసిన బీఆర్ఎస్ ఈసారి ఎక్కువ మంది నామినేషన్లు వేస్తుండటంతో ఏ రూపంలో నష్టం వాటిల్లుతుందోనని ఆ పార్టీ నేతలు ఆందోళనకు గురవుతున్నారు. హుస్నాబాద్‌లో 100 మంది, సిద్దిపేటలో 200 మంది వరకు నామినేషన్లు వేస్తే వారందరికీ గుర్తులు కేటాయించాల్సి వస్తది. అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయిస్తే ఎక్కువ మొత్తంలో ఈవీఎంలను పెట్టాల్సి ఉంటుంది. ఎక్కువ ఈవీఎంలను పెడితే బీఆర్ఎస్ అభ్యర్థి కారు గుర్తును వెతుక్కుని ఓటు వేయడం ఓటర్లకు ఇబ్బందిగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులు ఎన్నికల పోరుబాటకు సిద్ధమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడంలో విఫలమైనందున ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు వ్యతిరేకంగా 100 మంది వరకు నిర్వాసితులు నామినేషన్లు వేసి పోటీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే వారు పలుమార్లు సమావేశమై భవిషత్ కార్యాచరణపై చర్చించారు. నష్టపరిహారం అందక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న వారు ఇప్పటికే అనేక రూపాల్లో పోరాడుతూ వచ్చారు. భూములకు మెరుగైన నష్ట పరిహారం, సర్వం కోల్పోయినందుకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పశువుల కొట్టాలు, ఇండ్ల స్థలాలకు పరిహారం రాని నిర్వా సితులున్నారు.

హుస్నాబాద్ నియోజక వర్గంలోని అక్కన్నపేట మండలంలో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మిం చారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.4 టీఎంసీల నుంచి 8.23 టీఎంసీలకు పెంచారు. గుడాటిపల్లి, తెనుగుపల్లి గ్రామాలు, ఏడు తండాల పరిధిలో 3850 ఎకరాల భూమి సేకరించారు. అందులో కొంత మందికి నష్టపరిహారం అందలేదు. వివాహాలు అయి వెళ్లిపోయిన మహిళలకు పరిహారమివ్వడంలో జాప్యం జరిగింది. న్యాయం చేయాలని నిర్వాసితులు నడిపిన పోరాటంలో భాగంగా జరిగిన ఘర్షణలో అప్పటి హుస్నాబాద్ ఏసీపీ సతీష్‌పై దాడి చేశారన్న నెపంతో కేసులయ్యాయి. ఆ కేసుల్లో గుడాటిపల్లికి చెందిన బద్దం శంకర్‌రెడ్డి, అంగిటి తిరుపతిరెడ్డి, రాగి శ్రీనివాస్, బుక్యా సక్రుపై వివిద సెక్షన్ల కింద కేసులయ్యాయి.

ఒకవక్క పరిహారం అందకపోవడం, మరోవక్క కేసుల పాలవ్వడంతో తీవ్ర ఆవేదనతో ఉన్న నిర్వాసితులు అధికార పార్టీ ఎమ్మెల్యేను ఓడించాలనే కసితో ఉన్నారు. 12 సంవత్సరాలుగా పోరాడుతున్నా సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ విఫలమయ్యారనే భావనలో నిర్వాసితులున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన్ను ఓడిస్తామని తెగేసి చెబుతున్నారు.

సిద్దిపేటలో ఉద్యమకారుల తిరుగుబాటు

సకల జనులు పోరాడితే వచ్చిన తెలంగాణలో ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు విలువలేదనే భావన బలంగా ఉంది. స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం కొట్లాడిన, ప్రాణాలిచ్చిన వాళ్ల కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమం ఎగసిపడిన పలు ప్రాంతాల్లో సిద్దిపేట ముందుంటది. ఆ ప్రాంతం నుంచి అనేక మంది తెగించి పోరాడినోళ్లున్నారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన వాళ్లు ఉన్నారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాల రాష్ట్ర ఐక్యవేదికగా ఏర్పడి పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక, తెలంగాణ దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట నుంచి 200 మంది పోటీ చేసేందుకు నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. మంత్రి హరీశ్‌రావును ఓడిస్తామని స్పష్టం చేస్తున్నారు.




కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ బాధిత రైతుల నిరసన

కేసీఆర్‌పై పోటీగా కామారెడ్డి నుంచి 100 నామినేషన్లు వేస్తామని మాస్టర్ ప్లాన్ బాధిత రైతు ఐక్య కార్యాచరణ కమిటీ రైతులు ప్రకటించారు. తమ భూములు కాపాడుకునేందుకు ఎంతకైనా వెళ్తామని తెగేసి చెప్పారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణపై గత మంగళవారం సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ కాలేదని, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను అనవసరంగా బదనాం చేస్తున్నారని మంత్రి కేటీఆర్ సంబంధం లేని మాటలు మాట్లాడారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి మున్సిపల్ ఆఫీసు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతోనే తాము ఉద్యమ బాట పట్టామన్నారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మొన్న గజ్వేల్ కార్యకర్తలతో సీఎం మాట్లాడుతూ.. కామారెడ్డిలో తనకు పని ఉండటం వల్లే అక్కడికి వెళ్తున్నానని కేసీఆర్ చెప్పారని, కేసీఆర్‌కు ఇక్కడేం పని అని ప్రశ్నించారు. గజ్వేల్‌లో భూములు అయిపోయాయి కాబట్టి ఇక్కడికి ఆ పనిమీదే వస్తున్నారా అని ప్రశ్నించారు. రైతు రాములు ఆత్మహత్యలాంటి ఘటనలు మరోసారి జరగకముందే కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ద్వారా మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన తర్వాతే కేసీఆర్ కామారెడ్డికి రావాలని సూచించారు. లేకపోతే ప్రతి గ్రామం నుంచి 15 మంది చొప్పున 100 నామినేషన్లు వేస్తామని స్పష్టం చేశారు. దానికోసం రైతులందరం పార్టీలకు అతీతంగా సంఘటితం అవుతామని, నియోజకవర్గం మొత్తం కలియ తిరిగి కాళ్లు మొక్కి అయినా కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు.

ఆదర్శప్రాయం అరిబండి జీవితం

రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక ● కుటుంబాన్ని వదిలి ప్రజాసేవకే అంకితం

ఆణిముత్యాలు..



నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కుటుంబాన్ని, వ్యవసాయాన్ని పూర్తిగా వదిలేసి ఉద్యమ బాట పట్టిన వ్యక్తి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే అరిబండి లక్ష్మీనారాయణ. పూరి గుడిసెలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించారు. నిరాడంబర జీవితం గడిపారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శ ప్రాయం. 1978, 1985లో రెండుసార్లు మిర్యాలగూడ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రజా సమస్యలపై చట్టసభలో తన వాణి వినిపించి పరిష్కారం కోసం కృషి చేశారు. దాతల సహకారంతో మిర్యాల గూడలో కేఎన్ఎమ్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. నేరేడు చర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించారు. గోపాలపురం బ్రిడ్జి నిర్మించి ప్రజలందరికీ రాకపోకల సౌకర్యం కల్పించారు. రెండు సార్లు ఎమ్మెల్యే అయినా కూడా బస్సుల్లో, లారీల్లో, బండిపై ప్రయాణం సాగించారు.

సామాన్య రైతు కుటుంబంలో..

నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుండే చదువులో మేటి అయిన లక్ష్మీనారాయణ ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించి చిలుకూరు మండలం కట్టకమ్మగూడెంలో పని చేశారు. కొంతకాలం తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి ఆనాడు భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. ఆ పోరాటంలో నాగర్ కర్నూల్, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో పనిచేసారు. అజ్ఞాత జీవితం గడిపారు. సాయుధ పోరాటం అనంతరం సీపీఐ(ఎం) అభివృద్ధికి కృషి చేశారు. మిర్యాలగూడ అతిపెద్ద నియోజకవర్గం అయినా అన్ని ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యం, రహదారులు, వంతెనల నిర్మాణం, వందలాది మంది పేదలకు పెంకుటిల్లు నిర్మించారు. ఆయన ఎమ్మెల్యే అనే దర్పం ఏనాడూ కనిపించలేదు, చూపలేదు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఆప్యాయంగా పలకరించే నేత అరిబండి. పార్టీ నిర్మాణం కోసం రాత్రి సమయాల్లో గ్రామాలలో బసచేసి శాఖ సమావేశాలు ఏర్పాటుచేసి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తాను ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొన్నారు. ఒకసారి హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ, నేరేడుచర్ల మండలంలో దర్శించర్ల ప్రాంతాల్లో శత్రుమూకలు ఆయన వాహనంపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. అయినా ఆయన భయపడలేదు. ప్రజాప్రతినిధిగా అభివృద్ధిలోనూ, పార్టీ నిర్మాణంలోనూ ఆయన నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల మండల పరిధిలో, ఇతర ప్రాంతాల్లో నిరుపేదలకు 6000 ఎకరాల భూముల పంపిణీలో ముఖ్య భూమిక పోషించారు. ఆయనను కమ్యూనిస్టు గాంధీగా పిలుచుకునేవారు.

కుటుంబ నేపథ్యం..

కుమారులు డా.అరిబండి ప్రసాదరావు, డా.అరిబండి రమేష్, కుమార్తె సుంకర ఝాన్సీ ఉన్నారు. ప్రసాదరావు ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరై.. ప్రస్తుతం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, చైతన్య సేద్యం పత్రిక సంపాదకులుగా పనిచేస్తున్నారు. రెండో కుమారుడు రమేశ్ మద్రాస్ యూనివర్సిటీ జెనెటిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైరయ్యారు. కుమార్తె స్వగ్రామమైన నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె గ్రామంలో ఉంటున్నారు. అల్లుడు సుంకర వెంకటేశ్వరరావు పార్టీ హుజూర్‌నగర్ డివిజన్ నాయకునిగా, మండల కార్యదర్శిగా, పెంచికలదిన్నె ఎంపీటీసీగా పనిచేశారు.



పతి కోసం సతి 'చపాతీ' ప్రచారం

వికారాబాద్ జిల్లా పరిగిలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి తరపున ఆయన సతీమణి కొప్పుల ప్రతిమారెడ్డి పట్టణంలోని ఒకటో వార్డులోని మల్లెమోనిగూడలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా చపాతిలు వేస్తూ మహిళ ఓటర్లకు ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

ప్రత్యామ్నాయంగా..



ఆధార్‌కార్డు, ఎంఎన్ఆర్‌జీఏ జాబ్‌కార్డు, పోస్టాఫీస్ లేదా బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్డు, ఎమ్మెల్యే ఎంపీ, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం, దివ్యాంగుల ఐడెంటిటీ కార్డు, ఏదైనా ఒక గుర్తింపు కార్డులను తీసుకొని పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. అలాగే ఓటు జాబితాలో ఉందో ? లేదో ? ముందస్తుగా చెక్‌చేసుకుని పోలింగ్ కేంద్రానికి వెళితే మరీ మంచిది.

పంచ్ తంత్రం!



ఎన్ని వంకరమాటలెన్ని టింకరబుద్ధు లెన్ని
కుత్సితములు ఎంతబలుపు
ఎన్నెన్నికూతలో ఎన్నెన్నిబూతులో
ఎట్లున్న పాలిటిక్సెట్టులాయె
ఎవని కాళ్లకు కట్టెలెట్లు బెట్టగవలెను
ఎవని వెన్నున బాకునెట్లు దింపు
దెన్ని అబద్ధాలు ఎన్ని నివాదైలు
ఎంటలా తెలిపున్న ఎరుగలేము
చెట్టు చెడిపోవు కాలాన ఇట్లెనుండు
రాతలెట్లను నీటిపై గీతలగును
రాజకీయాలు పెంటగా రగులుకొనియె
తుఫుమనిని ఉమ్మేయి ఇక తప్పదేమో

- ఏనుగు నరసింహారెడ్డి

షర్మిల డైలమా

- అభ్యర్థుల కోసం వేట ప్రారంభం
- ఇతర పార్టీల్లోని అసంతృప్తులపై ఆశలు
- నైరాశ్యంలో వైఎస్ఆర్‌టీపీ శ్రేణులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల డైలమాలో పడ్డారు. కాంగ్రెస్ పార్టీలో విలీనానికి ఆ పార్టీ నో చెప్పటంతో ఒంటరి పోటీకే సిద్ధమంటూ పావులు మార్చు ప్రకటించారు. అందుకు తగిన కసరత్తు ప్రారంభించారు. అయితే.. ప్రభావిత చేసే నాయకులు పార్టీ ఆశించిన స్థాయిలో అభ్యర్థిత్వం కోసం దరఖాస్తులు రాలేదు. దీంతో నాయకుల వేటలో ఉన్నట్టు తెలుస్తున్నది. 'నమ్మినవాణులు పోస్తే.. పార్టీ బుర్రలంగానున్నట్టు మా పార్టీ పరిస్థితి ఏర్పడింది'అని వైఎస్ఆర్‌టీపీకి చెందిన ఓ ముఖ్యనాయకుడే వాపోతు న్నారంటే ఆ పార్టీ నాయకత్వం ఎంత నైరాశ్యంలో ఉందో అర్థమవుతున్నది. పార్టీకి సరైన కేడర్ లేకపోవటం, ఒంటరిగా ఎన్నికలకు వెళ్తే..ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలిపోతాయని కాంగ్రెస్‌తో విలీనానికి మొగ్గు చూపినట్టు వారు చెబుతున్నారు. ఏఐసీసీ సానుకూలంగా స్పందించినా.. టీపీసీసీ మాత్రం మోకాలడ్డు పెట్టిందనీ, దీంతో విలీన ప్రక్రియకు ఆ పార్టీనే 'చేయి'చ్చినట్టయిందని ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తెగా వైఎస్ షర్మిల ఆయన రాష్ట్ర ప్రజలు తమ పార్టీని ఆదరిస్తారని మొదటి నుంచి వైఎస్ షర్మిల ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యం లోనే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది వైఎస్ఆర్‌టీపీ అని, సీఎం కాబోయేది కూడా తానేనని షర్మిల పలు మార్లు బహిరంగంగానే వ్యాఖ్యానించారు.


119 నియోజక వర్గాల్లో పోటీ..?

119 నియోజక వర్గాల్లో పోటీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు ఆ పార్టీ నేతలు చెబతున్నారు. అయితే..తమ పోటీ వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు తమకు అనుకూలంగా వేస్తారా? లేదా? అనే మీమాంసలో ఉన్నారు. అయితే ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపే నాయకులు లేరని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే వైఎస్ విజయమ్మ, బ్రదర్ అనిల్‌ను కూడా రంగంలోకి దింపాలని షర్మిల భావిస్తున్నట్టు తెలుస్తున్నది. మరో పక్క కాంగ్రెస్ నుంచి టికెట్లు ఆశించి భంగపడ్డవారు తమ పార్టీ వైపు వస్తారని వేచి చూస్తున్నట్టు తెలుస్తున్నది.

బైనాక్యులర్ వద్దు..వాలీబాల్ కావాలి



కేంద్ర ఎన్నికల సంఘం వైఎస్ఆర్‌టీపీకి ఉమ్మడి గుర్తును కేటాయించింది. రాష్ట్రంలోని 119 నియోజక వర్గాల్లో ఆ పార్టీకి బైనాక్యులర్ గుర్తును కేటాయిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే..ఆ గుర్తు మార్పిడంటూ వాలీబాల్ గుర్తు కేటాయించాలని మరో సారి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్టు తెలిసింది.



రూ.99 లక్షలు పట్టివేత

నవతెలంగాణ-చందానగర్

ఎన్నికల తనిఖీల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా చందానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా డబ్బు తరలిస్తున్న ఓ వ్యక్తి వద్ద పోలీసులు రూ.99లక్షలు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు చందానగర్ పోలీసులు, మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు చందానగర్‌లోని జాకీ షోరూం ఎదురుగా తనిఖీలు నిర్వహిస్తుండగా.. హఫీజ్‌పేట మార్తాండనగర్‌కు చెందిన వైరల నాగరాజు వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో రూ.99లక్షలు గుర్తించారు. ఆ డబ్బుకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. నాగరాజును అరెస్టు చేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.